
సత్యం, సమర్థత, విశ్వసనీయత
WWW.SAKSHYAM.COM
# సాక్ష్యం
తెలుగు దినపత్రిక
సంపుటి: 17 | సంచిక: 111
పేజీలు: 08 | వెల: రూ.2:00
హైదరాబాద్ | ఆదివారం 19 ఏప్రిల్ 2026
Published from Hyderabad, Vijayawada.

## రెండోవిడత రైతుభరోసా విడుదలకు సిద్ధం

### 20న కాటారాం సభలో విడుదల చేయనున్న రేవంత్

హైదరాబాద్,ఏప్రిల్18(సాక్ష్యం): తెలంగాణ రైతులకు ప్రభుత్వం శుభవార్త తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'రైతు భరోసా'పథకం రెండో విడత నిధుల విడుదలకు ముహూర్తం ఖరారైంది. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది రైతులకు పెట్టుబడి సాయం అందనుంది. మిగతా 2 లో..





## హర్మ్యూజ్‌పై మళ్లీ పీటముడి

- మూసేస్తున్నట్లు ఇరాన్ ప్రకటన
- పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు
- వాణిజ్య నౌకలపై ఇరాన్ కాల్పులు

టెహ్రాన్,ఏప్రిల్18(సాక్ష్యం): పశ్చిమాసియాలో పరిస్థితులు మళ్లీ ఉద్రిక్తంగా మారుతున్నాయి. మిగతా 2 లో..



## 20నుంచి 26 వరకు వెల్ఫేర్ వీక్

### కలెక్టర్లతో సిఎస్ వీడియో కాన్ఫరెన్స్

హైదరాబాద్,ఏప్రిల్18(సాక్ష్యం): 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 20 నుండి ఏప్రిల్ 26 వరకు రాష్ట్రవ్యాప్తంగా 'వెల్ఫేర్ వీక్' నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన మిగతా 2 లో..




## ఎయిర్‌పోర్ట్ పనులు వేగవంతం చేయాలి

### ఎయిర్‌పోర్ట్ అధికారులతో మంత్రి పొంగులేటి సమీక్ష

హైదరాబాద్,ఏప్రిల్18(సాక్ష్యం): తెలంగాణ రాష్ట్రాన్ని సమగ్ర అభివృద్ధి దిశగా ముందుకు తీసుకుని వెళ్లాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి మిగతా 2 లో..

# బిల్లుపై రాజకీయం

### మహిళా బిల్లు అడ్డుకోవడం ముమ్మాటికి భ్రూణహత్యే

- కాంగ్రెస్,ఎస్పీ, తృణమూల్, డీఎంకెలదే ఈ బాధ్యత
- కుటుంబ పార్టీలతో మహిళలకు న్యాయం జరగదు
- అన్ని రాష్ట్రాలకు సమన్యాయం జరిగేలా సవరణ బిల్లు తెచ్చాం
- రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని కాంగ్రెస్ దుష్ప్రచారం
- ఈ పాపం ఆ పార్టీలను వదిలి పెట్టదు..
- కుట్రలు, కుతంత్రాలు మహిళా శక్తి చూస్తూ ఊరుకోదు
- జాతిని ఉద్దేశించిన చేసిన ప్రసంగంలో మోడీ విమర్శలు
- మహిళా బిల్లును అడ్డుకున్న పార్టీలకు బుద్ధి చెప్పండి
- కోయంబత్తూరు సభలో ప్రధాని మోడీ పిలుపు



న్యూఢిల్లీ,ఏప్రిల్18(సాక్ష్యం): భారత నారీశక్తి ఎదగకుండా కాంగ్రెస్ తదితర విపక్షాలు అడ్డుకున్నాయని ప్రధాని మోదీ ఆక్షేపించారు. భారత వ ,హిళల కలలను ధ్వంసం చేశారని విమర్శించారు. 131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో వీగిపోయిన నేపథ్యంలో.. దేశ ప్రజలను ఉద్దేశించి శనివారం మోదీ ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రధాని దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పారు. ఈ బిల్లును ఆమోదింపచేయకపోవడం తనకు బాధ కలిగించిందన్నారు. ఇది ముమ్మాటికీ భ్రూణ హత్యేనని అన్నారు. దేశ హితమే తమకు అత్యంత ముఖ్యమని, కొందరికి మాత్రం దేశం కంటే రాజకీయాలే ముఖ్యమని విమర్శించారు. దేశ హితం కోసం, నారీ శక్తి హితం కోసం బిల్లు తెచ్చామన్న ఆయన.. మహిళా శక్తిని ఈ దేశం ఇంకా చూడాల్సి ఉందన్నారు. స్వార్థ రాజకీయాల కోసం నారీ శక్తిని అడ్డుకున్నారని అన్నారు. మహిళా బిల్లును కాంగ్రెస్, డీఎంకే, టీఎంసీ అడ్డుకున్నాయని, అలాంటి కుటుంబ పార్టీలు మహిళలను ఎదగనీయవన్నారు. ఆ పార్టీలు ఓడించింది బిల్లును కాదు.. మహిళా శక్తిని. తమకు జరిగిన అన్యాయాన్ని మహిళలు ఎప్పటికీ మర్చిపోరు. కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు కలిసి మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశాయని అన్నారు. మహిళా బిల్లును అడ్డుకున్న పార్టీలకు తప్పకుండా శిక్ష పడుతుంది. మహిళా రిజర్వేషన్ బిల్లును మిగతా 2 లో..

## మహిళలకు విపక్షాలు వ్యతిరేకం

- బిల్లును అడ్డుకుని పెద్ద తప్పు చేశాయి
- ఊరూరా ఈ విషయం ప్రచారం చేయండి
- కేబినేట్ భేటీలో ప్రధాని మోడీ సూచన
- కేంద్ర ఉద్యోగులకు 2శాతం డిఏ పెంపు

### 13వేల కోట్లతో సావరిన్ మారిటైమ్ ఫండ్ ఏర్పాటు

న్యూఢిల్లీ,ఏప్రిల్18(సాక్ష్యం): మహిళా రిజర్వేషన్ల కోసం తెచ్చిన రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడంపై ప్రధాని మోదీ తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. ఈ విషయంలో విపక్షాలు జీవితాంతం చింతిస్తాయన్నారు. ప్రధాని అధ్యక్షతన దిల్లీలోని పార్లమెంట్ హౌస్‌లో శనివారం క్యాబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మోదీ ఈ వ్యాఖ్యలు చేసినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్ల బిల్లుకు మద్దతు ఇవ్వకుండా ప్రతిపక్ష పార్టీలు పెద్ద తప్పు చేశాయని ప్రధాని మోదీ అన్నారు. ఇందుకు వారు భారీ మూల్యం చెల్లించుకుంటాయని వ్యాఖ్యానించారు. ఈ విషయాన్ని కప్పిపుచ్చుకోవడానికి సాకులు వెతుకుతున్నారని విమర్శించారు. ప్రతిపక్ష పార్టీలు మహిళలకు వ్యతిరేకమనే మిగతా 3 లో..

## దక్షిణాదిని దెబ్బతీసే కుట్రను అడ్డుకున్నాం

- మహిళా రిజర్వేషన్‌లో చిత్తశుద్ధి లేదు
- బిల్లు ముసుగులో డీలిమిటేషన్ చట్టం
- చిత్తశుద్ధి ఉంటే కేవలం మహిళా బిల్లు తేవాలి
- అందుకు ఇండి కూటమి బేషరతుగా మద్దతు ఇస్తుంది
- బిజెపితో జతకట్టిన పార్టీలకు ఎదురుదెబ్బలు తప్పవు
- తెలుగు దేశం పార్టీకి కూడా ఆ ప్రమాదం ఉంది
- మీడియా సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి



న్యూఢిల్లీ,ఏప్రిల్18(సాక్ష్యం): మహిళా బిల్లు పేరుతో డీలిమిటేషన్ బిల్లు తీసుకువచ్చారని కేంద్ర ప్రభుత్వంపై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి విమర్శలు గుప్పించారు. మహిళా బిల్లు వీగిపోవడంతో ప్రతిపక్షాలపై అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. మహిళల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ చాలా చేసిందని పేర్కొన్నారు. మహిళా బిల్లు వీగిపోవడం.. భాజపా విధానాల ఓటమిగా భావించాలి. ఈ బిల్లుపై ప్రధాని మోదీకి నిజాయతీ లేదు. నిజాయతీగా మహిళా రిజర్వేషన్ బిల్లు తీసుకువస్తే.. పార్లమెంట్‌లో అందరూ మద్దతు తెలిపేవారని అన్నారు. అయితే మహిళా బిల్లు పేరుతో డీలిమిటేషన్ బిల్లు తీసుకువచ్చి దక్షిణాదికి అన్యాయం చేయాలని చూశారు. ప్రధాని మోదీ.. ఉత్తర, దక్షిణ భారత్ మిగతా 3 లో..

## బయ్యారంలో గ్రీన్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు

- కుమారస్వామికి విజ్ఞప్తి చేసిన సిఎం రేవంత్
- ప్రియాంకను కలిసి బిల్లును ఓడించినందుకు అభినందనలు

న్యూఢిల్లీ,ఏప్రిల్18(సాక్ష్యం): కేంద్ర మంత్రులు కుమారస్వామి, శ్రీనివాసవర్మను సీఎం రేవంత్‌రెడ్డి కలిశారు. బయ్యారంలో గ్రీన్ స్టీల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని కుమారస్వామికి విజ్ఞప్తి చేశారు. దీని ద్వారా ఉక్కు కొరత తగ్గడంతోపాటు.. పర్యావరణానికి మేలు జరుగుతుందని తెలిపారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌లో భాగంగా రూపొందించిన పారిశ్రామిక ప్రతిపాదనలను మిగతా 3 లో..

## మహిళా బిల్లు పేరుతో డీలిమిటేషన్ కుట్ర

- డీలిమిటేషన్‌తో తమిళనాడు ప్రాధాన్యం తగ్గింపు
- అందుకే రాజ్యాంగ సవరణ బిల్లును అడ్డుకున్నాం
- తమిళనాడు ఎన్నికల ప్రచారంలో రాహుల్

చెన్నై,ఏప్రిల్18(సాక్ష్యం): మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లు పార్లమెంటులో వీగిపోవడంపై కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ స్పందించారు. మహిళా రిజర్వేషన్ల వెనుక నియోజకవర్గాల పునర్విభజన దాగి ఉందని, రిజర్వేషన్ల పేరుతో పునర్విభజన బిల్లును ఆమోదించుకోవాలని కేంద్రం చూసిందని అన్నారు. ఈ డీలిమిటేషన్ బిల్లుతో తమిళనాడుకు ప్రాతినిధ్యం తగ్గిపోతుందని చెప్పారు. అందుకే దానిని అడ్డుకున్నామని అన్నారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా తిరువళ్లూరు జిల్లా పొన్నేరిలో జరిగిన ర్యాలీలో రాహుల్ శనివారంనాడు పాల్గొన్నారు. తమిళ భాష, సంస్కృతిని దెబ్బతీసేందుకు ఆర్ఎస్ఎస్, బీజేపీ గత కొన్నేళ్లుగా ప్రయత్నిస్తున్నాయని రాహుల్ విమర్శించారు. మిగతా 2 లో..



## తెలంగాణ ఆత్మగౌరవం దెబ్బతీసిన తేజస్వీసూర్య

- పెదవి విప్పని తెలంగాణ బిజెపి, కాంగ్రెస్ ఎంపిలు
- ఈ వ్యవహారాన్ని ఇంతటితో వదిలే ప్రసక్తి లేదు
- రాబోయేది బిఆర్ఎస్ ప్రభుత్వమే అన్న హరీష్ రావు
- రాజకీయ పునరేకీకరణ ప్రారంభమయ్యిందన్న కేటీఆర్
- జగిత్యాలలో కేసీఆర్ ఆశీర్వాద సభ ఏర్పాట్లు పరిశీలన



జగిత్యాల,ఏప్రిల్18(సాక్ష్యం): బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య లోక్‌సభలో చేసిన వ్యాఖ్యలు తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. ఈ నెల 20న జగిత్యాలలో నిర్వహించనున్న కేసీఆర్' ప్రజా ఆశీర్వాద సభ' ఏర్పాట్లను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీష్‌రావు మాట్లాడారు. బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలకు తెలంగాణ ఎంపీ , కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మిగతా 3 లో..

## మహిళా బిల్లును అడ్డుకోవడం దురదృష్టకరం

- సమాఆనం చెప్పకోలేని స్థితిలో విపక్షాలు
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విమర్శలు



న్యూఢిల్లీ,ఏప్రిల్18(సాక్ష్యం): నియోజకవర్గాల పునర్విభన బిల్లు, మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లు పార్లమెంట్‌లో వీగిపోవడం దురదృష్టకరమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ బిల్లులను అడ్డుకోవడం చారిత్రాత్మక తప్పిదమని మిగతా 3 లో..

## తెలంగాణలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

- కెరిమెరిలో అత్యధికంగా 44.6 డిగ్రీల ఉష్ణోగ్రత
- నిజామాబాద్ జిల్లా మెండోరాలో 44.5 డిగ్రీలు
- ఏప్రిల్‌లో మరింత పెరిగే అవకాశం



హైదరాబాద్,ఏప్రిల్18(సాక్ష్యం): తెలంగాణలో రోజు రోజుకీ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఏప్రిల్ చివరి నాటికి ఉష్ణోగ్రతలు మరింతగా పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ఎప్రిల్ తెలంగాణలో ఎండలు ఠారెత్తిస్తున్నాయి. ఉదయం నుంచే భానుడు భగభగమంటున్నాడు. వివిధ పనుల కోసం బయటకు వెళ్లిన ప్రజలు ఎండవేడిమి తట్టుకోలేక ఆపసోపాలు పడుతున్నారు. శనివారం కుమురంభీం జిల్లా కెరిమెరిలో అత్యధికంగా మిగతా 3 లో..

# సంపాదకీయం


## విపక్షాల ఐక్యతను బలోపేతం చేసిన మోడీ !

ప్రజాస్వామ్యంలో నిరంకుశం చేస్తామంటే కుదరదు. ప్రతి విషయంలోనూ అలాగే వ్యవహరిస్తున్న మోడీ, ఇప్పుడు 131వ రాజ్యాంగ సవరణ విషయంలోనూ అలాగే చేసారు. మహిళా బిల్లు సందర్భంగా సరిగ్గా అదే జరిగింది. బిజెపి నిరంకుశ విధానంపై ఓ రకంగా తిరుగుబాటుగానే భావించాలి. అలాగే విపక్షాలను ఐక్యం చేసిన ఘనత కూడా మోడీదనే చెప్పాలి. వారి ఓటు చెక్కుచెదరకుండా వేయగలిగారు. అలాగే వారంతా ఒక్కటిగా నిలబడేలా చేశారు. ఇది భవిష్యత్ రాజకీయాలకు కీలక మలుపుగా భావించాలి. అందుకే 131వ రాజ్యాంగ సవరణ వీగిపోయింది. ఇకపోతే మహిళా బిల్లు వేరు..డీ లిమిటేషన్ వేరు. 2023లోనే దీనిని ఆమోదించి, 2029 నుంచి అమల్లోకి తీసుకుని వస్తామని గతంలోనే చెప్పారు. అనూహ్యంగా ఇప్పుడు రెండూ కలగలిపి తీసుకుని రావడం ద్వారా బిజెపికి శృంగభంగం తప్పలేదు. నిజానికి ఈ బిల్లులను తీసుకుని వచ్చే ముందు అఖిలపక్షంలో చర్చించలేదు. విపక్షాలను విశ్వాసంలోకి తీసుకోలేదు. సొంతపార్టీలో చర్చించలేదు. ఎన్‌డిఎ పక్షాలతోనూ చర్చించలేదు. బహుశా మోడీ, అమిత్ షాలు మాత్రమే చర్చించుకుని ఈ సవరణ బిల్లుకు యత్నించి ఉంటారు. బహుశా వారు ఇలాంటి పరిణామం ఎదురవుతుందని కూడా ఊహించ ఉంటారు. దీనిని ఆసరాగా చేసుకుని విపక్షాలను ఎండగట్టాలన్న ఉద్దేశం కూడా ఇందులో దాగి ఉంటుంది. అయితే విపక్షాల ఐక్యత ఇప్పుడు మోడీకి సవాల్ కానుంది. మొన్న సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి సంపూర్ణ మెజార్టీ కోల్పోయింది. కేవలం ఎన్‌డిఎ పక్షాల మద్దతుతో ప్రభుత్వం కొనసాగుతోంది. కనీసం ఎన్‌డిఎ పక్షాలతో అయినా మోడీ సమగ్రంగా చర్చించి ఉంటారని అనుకోవడానికి లేదు. ఒకప్పుడు బిజెపిలో మేధావి వర్గం ఉండేది. ఏదైనా సమస్యను ముందు పార్టీలో మేధావి వర్గంతో చర్చించేవారు. ఎత్తులు వేసేవారు. కానీ మోడీ వచ్చాక పెద్దలను దూరం పెట్టారు. ఇప్పుడు పెద్దా, చిన్నా అంతా ఆయనే. అందుకే మహిళా బిల్లు ముసుగులో డీలిమిటేషన్ తీసుకుని రావాలన్న ఎత్తుగడలను ప్రతిపక్షాలు ఉమ్మడి గా చిత్తుచేశాయి. మహిళా బిల్లును ఉన్నపళంగా అమలు చేయడానికి విపక్షాలు సిద్ధంగా ఉన్నాయి. కానీ మోడీ ఎందుకనో అలా చేయకుండా మెలికి పెట్టారు. డీలిమిటేషన్ వల్ల కూడా సభ్యుల సంఖ్య పెరిగితే కూడా నష్టమే. 542 స్థానాలు ఉన్న లోక్‌సభ 600 వరకు పెరిగితే ఫర్వాలేదు. కానీ 816 లేదా 850కి పెంచాలన్న తీరు మాత్రం ఆమోదించదగ్గది కాదు. రాజకీయంగా పదవులు పెరిగితే దేశానికి నష్టమే తప్ప లాభం లేదు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో బిజెపి వ్యవహరించిన తీరు, దానిని తరిస్కరించిన వైనం బిజెపికి గుణపాఠం కావాలి. ఇప్పటికైనా మేల్కొని ప్రజాస్వామ్య బద్దంగా పాలన చేయకుంటే విపక్షాలు మరింత ఐక్యం అవుతాయని నిరూపించాయి. ఇప్పటికే సర్ ప్రక్రియ సెగరేపుతోంది. ఇప్పుడు 131 సవరణ తోడయ్యింది. ప్రజలు ఎప్పుడూ బిజెపి వెంటే ఉంటారని అనుకోవడానికి లేదు. తాజా 131 సవరణ ప్రతిపాదన దక్షిణాదిలో కూడా తీవ్ర చర్చకు దారితీసింది. తమకున్న అధికారం పోతోఉందని, తమ ప్రాతినిధ్యానికి విలువ ఉ ఒడదన్న భావనలో ఇక్కడి నేతలు వచ్చారు. అందుకే దక్షిణ్రాది నేతలు కేంద్ర ప్రభుత్వం హడావిడిగా తెచ్చిన నియోజకవర్గాల పునర్విభజన బిల్లుకు వ్యతిరేకంగా పోరాటం చేసారు. మోదీ సర్కారుకు ఓటమి రుచి చూపించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ముందుపెట్టి.. డీలిమిటేషన్ బిల్లును ఆమోదింపజేసుకోవాలన్న కేంద్ర ఎత్తుగడను లోక్‌సభలో శుక్రవారం మూకుమ్మడిగా తిప్పికొట్టడం వెనక ఈ ఐక్యత స్పష్టంగా కనిపించింది. మహిళా రిజర్వేషన్ చట్ట సవరణ బిల్లు సభలో వీగిపోయేలా చేయటంలో దక్షిణాది రాష్ట్రాల ఎంపీలు కూడా కీలకపాత్ర పోషించారు. ఆంధ్రప్రదేశ్‌లోని పార్టీలు మినహా తెలంగాణ, కేరళ, తమిళనాడు, కర్ణాటకలోని ఎన్డీయే యేతర పార్టీల ఎంపీలంతా ఈ బిల్లును మరో ఆలోచనకు తావులేకుండా తిరస్కరించారు. తమిళనాడుకు చెందిన 38మంది, కేరళలోని 20 మంది, తెలంగాణలోని 9మంది, కర్ణాటకలోని 9 మంది ఎన్డీయే యేతర ఎంపీలు డీలిమిటేషన్ బిల్లును అడ్డుకోవటంలో కీలకపాత్ర పోషించారు. డీలిమిటేషన్ బిల్లును బహిరంగా తగులబెట్టి తమ నిరసన ఏ స్థాయిలో ఉంటుందో చూడాలని కేంద్రాన్ని తమిళనాడు సిఎం స్టాలిన్ సవాల్ చేశారు. పార్లమెంటులోనూ తమిళనాడు ఎంపీలు నల్ల దుస్తులు ధరించి బిల్లుకు వ్యతిరేకంగా బలంగా పోరాటం చేశారు. కొత్తగా జనాభా లెక్కలను సేకరించకుండానే మోదీ సర్కారు ఏకపక్షంగా, హడావిడిగా డీలిమిటేషన్‌కు పూనుకోవటంపై అందరిలోనూ అనుమానాలు బలపడ్డాయి. కేంద్రం దక్షిణాదికి ద్రోహం చేస్తోందని ఎలుగెత్తారు. తమ రాష్ట్రాల ప్రాతినిధ్యం లేకుండానే భవిష్యత్తులో ఉత్తరాది బలంతో కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు జరిగేలా దక్షిణాది ప్రాతినిధ్యంతో పనిలేకుండా చేయటమే మోదీ సర్కారు అసలు లక్ష్యమని విమర్శలు గుప్పించారు. రాజ్యాంగాన్ని బలహీనపర్చి, దేశ ఎన్నికల ముఖచిత్రాన్నే మార్చేయాలని కేంద్రం కుట్ర చేస్తోందని కమ్యూనిస్టు పార్టీలు కూడా పోరాటం చేశాయి. అందుకే కసిగా ఉన్న స్టాలిన్ 'ఢిల్లీని తమిళనాడు ఓడించింది' అని ప్రకటించారు. ఈ క్రమంలో ఇప్పుడు బిజెపి పునరాలోచన చేయాలి. పెద్దలను, మేధావులను గౌరవించడం అలవాటు చేసుకవాలి. కీలకమైన ఇలాంటి సవరణల సందర్భంలో విపక్షాలను విశ్వాసంలోకి తీసుకోవాలి. డీలిమిటేషన్ కూడా లిమిట్ దాటకుండా సీట్లను కుదించాలి. అందరి ఆమోదంతో మళ్లీ బిల్లును ప్రవేశ పెట్టడం ద్వారా ముందుగా మహిళా బిల్లుకు ఆమోదం దక్కేలా చూడాలి. అప్పుడే పోయిన పరువు కొంతయినా దక్కుతుంది. అంతే తప్ప మహిళా బిల్లును వ్యతిరేకించారన్న ప్రచారం ఫలితం ఇవ్వదని గుర్తించాలి.

## హర్మూజ్‌పై మళ్లీ పీటముడి

మొదటిపేజీ తరువాయి..

హోర్ముజ్ జలసంధి తెరుచుకుందనే ఆనందం 24 గంటలు కూడా నిలవలేదు. మళ్లీ హోర్ముజ్ జలసంధిని మూసేస్తున్నట్టు ఇరాన్ ప్రకటించింది. అమెరికా తమ నౌకలపై విధించిన సముద్ర నిర్బంధం కొనసాగు తుండడమే ఇందుకు కారణమని టెహ్రాన్ పేర్కొంది. హోర్ముజ్‌పై కట్టుదిట్టమైన నియంత్రణ విధించినట్లు ప్రకటించింది. అమెరికా తన నిర్బంధాన్ని ఎత్తివేయకపోతే జలసంధి పూర్తిగా తెరవబోమని ఇరాన్ తేల్చి చెప్పింది. హోర్ముజ్‌ను తెరిచినప్పటికీ ఇరాన్ నౌకలపై తమ దిగ్బంధనం కొనసాగుతుందని ట్రంప్ ప్రకటించడం ఉద్రిక్తతలను పెంచింది. హోర్ముజ్ జలసంధి గురించి, శాంతి ఒప్పందం గురించి ట్రంప్ సోషల్ మీడియాలో చేస్తున్న పోస్ట్‌లన్నీ అబద్ధాలేనని, దౌత్య చర్చలపై ముందుకు సాగుతుండగా ఇలాంటి తప్పుడు సమచారాన్ని ఇరాన్ అంగీకరించదని ఆ దేశ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ ఘాలిబఫ్ పేర్కొన్నారు. కాగా, అమెరికా-ఇరాన్ మధ్య ఏప్రిల్ 20న రెండో దఫా శాంతి చర్చలు జరగబోతున్నట్టు వార్తలు వస్తున్నాయి. పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్ వేదికగానే ఇవి జరగబోతున్నట్టు ఇరాన్ మీడియా పేర్కొంటోంది. అయితే ఈ శాంతి చర్చలు వేదిక, తేదీ గురించి అమెరికా ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. ఈ క్రమంలో హర్మూజ్ జలసంధిని తెరుస్తామని ప్రకటించిన ఇరాన్ మళ్లీ ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. శనివారం తాజాగా మళ్లీ మూసివేస్తున్నట్లు ప్రకటించింది. ఇరాన్ ఓడరేవులపై అమెరికా దిగ్బందనం ఉన్నంత వరకు హర్మూజ్ జలసంధిని మూసివేసి రవాణాను అడ్డుకుంటామని ఇరాన్ అమెరికాను హెచ్చరించింది. అమెరికాతో ఇరాన్ అణు ఒప్పందానికి వచ్చే వరకు ఈ జలసంధి దిగ్బంధనం కొనసాగుతుందని ట్రంప్ ప్రకటించిన కొన్ని గంటల్లోనే ఇరాన్ హర్మూజ్‌ని మూసివేస్తున్నట్లు ప్రకటించింది. కాగా, ట్రంప్ శనివారం 'కొన్ని మంచి వార్తలున్నాయని చెప్పుకొచ్చారు. బుధవారంలోగా ఒప్పందం కుదరకపోతే యుద్ధంలో కాల్పుల విరమణను పొడిగించకపోవచ్చని ఆయన అన్నారు. ట్రంప్ వ్యాఖ్యల అనంతరం ఇరాన్ ఈ నిర్ణయం తీసుకుంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. నౌకా దిగ్బంధనం కొనసాగుతుందని ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో ఇరాన్ మళ్లీ హోర్ముజ్ జలసంధిని మూసేసింది. తాజాగా హోర్ముజ్‌లో ప్రయాణిస్తున్న వాణిజ్య నౌకలపై కాల్పులు జరిగినట్లు వార్తలు వస్తున్నాయి. రెండు వాణిజ్య నౌకలపై ఇరాన్ సైన్యం కాల్పులకు పాల్పడినట్టు అంతర్జాతీయ మీడియా పేర్కొంది. వాటిల్లో భారత జెండా ఉన్న ట్యాంకర్ ఒకటి ఉన్నట్టు సమాచారం. హోర్ముజ్ జలసంధి గుండా వెళ్తున్న రెండు వాణిజ్య నౌకలపై ఐఆర్‌జీసీకి చెందిన ఇరాన్ గన్‌బోట్లు కాల్పులు జరిపాయి. అయితే ఈ దాడిలో ట్యాంకర్లు, వాటిల్లోని సిబ్బంది



సురక్షితంగానే ఉన్నారని సమాచారం. ఈ నేపథ్యంలో భారత్‌కు చెందిన మరో రెండు నౌకలను దారి మళ్లించినట్టు 'ట్యాంకర్ ట్రాకర్స్' తెలిపింది. ఇరాక్ నుంచి రెండు మిలియన్ బ్యారెళ్ల ముడి చమురును భారత్‌కు తీసుకొస్తున్న ట్యాంకర్లు హోర్ముజ్ జలసంధి నుంచి వెనక్కి మళ్లినట్టు సమాచారం. కాగా, అమెరికాతో చర్చల సందర్భంగా హోర్ముజ్ జలసంధిని పూర్తిగా తెరుస్తున్నట్టు శుక్రవారం ఇరాన్ ప్రకటించింది. అయితే ఇరాన్ ఓడ రేవుల చుట్టు అమెరికా దిగ్బంధనాన్ని కొనసాగిస్తున్నట్టు ట్రంప్ ప్రకటించారు. దీంతో ఇరాన్ తిరిగి హోర్ముజ్ జలసంధిని మూసేసింది. హోర్ముజ్ జలసంధిని మూసేసినట్టు ఇరాన్ ప్రకటించిన కొద్ది గంటల్లోనే ఈ కాల్పులు జరిగాయి.

## ఎయిర్‌పోర్ట్ పనులు వేగవంతం చేయాలి

మొదటిపేజీ తరువాయి..

రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోందని రాష్ట్ర రెవెన్యూ, హౌ సింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఈ క్రమంలో వరంగల్, ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి ప్రభుత్వం కార్యాచరణను సిద్ధం చేసిందని అన్నారు. ఈ ప్రాజెక్టుల నిర్మాణం వీలైనంత త్వరగా ప్రారంభించేందుకు అవసరమైన భూ సేకరణ, సాంకేతిక అనుమతులు, మౌలిక వసతుల ఏర్పాటుకు చర్యలు వేగవంతం చేస్తున్నట్లు వెల్లడించారు. శనివారం సచివాలయంలోని తన కార్యాలయంలో ఎయిర్‌పోర్ట్ అథారిటీ సదరన్ రీజియన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజ్ కిషోర్, ఏవియేషన్ డైరెక్టర్ భరత్‌రెడ్డి తదితరులతో కలిసి



వరంగల్ , ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో తెలంగాణ ప్రభుత్వం నిర్మించతలపెట్టిన ఎయిర్ పోర్టులపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ కేంద్రప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ పనులను త్వరితగతిన ముందుకు తీసుకువెళ్లాలని సూచించారు. వరంగల్ ఎయిర్ పోర్ట్‌కు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే సుమారు 953 ఎకరాల భూమిని సేకరించి కేంద్రానికి అప్పగించిందని తెలిపారు. వీలైనంత త్వరలో శంకుస్థాపన చేస్తామని వెల్లడించారు. అలాగే ఆదిలాబాద్ విమానాశ్రయాన్ని డిఫెన్స్ (రక్షణ శాఖ) సివిల్ ఏవియేషన్ (పౌర విమానయాన శాఖ) , తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించాయని ఇందుకు సంబంధించి మాస్టర్ ప్లాన్ తక్షణమే సిద్ధం చేయాలని సూచించారు. ఈ ఎయిర్ పోర్ట్‌కు అవసరమైన భూ సేకరణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ విమానాశ్రయం అందుబాటులోకి వస్తే ఉత్తర తెలంగాణలో రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గతంలో ప్రతిపాదించిన స్థలం విమానాశ్రయ నిర్మాణానికి అనుకూలంగా లేదని కేంద్ర పౌర విమానయాన శాఖ తెలిపిన నేపథ్యంలో దీనిపై మరింత లోతైన అధ్యయనం చేసి సాధ్యాసాధ్యాలపై ఒక నివేదిక రూపొందించాలని సూచించారు.

# బిల్లుపై రాజకీయం

మొదటిపేజీ తరువాయి..

అడ్డుకున్న పాపం వారిని వదిలిపెట్టదన్నారు. అన్ని విషయాలను మహిళలు గమనిస్తూనే ఉన్నారు. మహిళలు తమ హక్కు కోసం 40 ఏళ్లుగా పోరాడుతున్నారు. రిజర్వేషన్ల కోసం ఎందరో మహిళలు పోరాటం చేశారు. ఎంతో నిజాయతీతో తెచ్చిన బిల్లును ప్రతిపక్ష నేతలు అడ్డుకున్నారు. మహిళా బిల్లు క్రెడిట్ తీసుకోవాలని విపక్ష నేతలకు విజ్ఞప్తి చేశాం. అన్ని రాష్ట్రాలకు సమాన బలం దక్కేలా బిల్లు తీసుకొచ్చాం. మహిళా బిల్లును అడ్డుకొని విపక్షాలు భ్రూణహత్యకు పాల్పడ్డాయి. ఈ భ్రూణహత్యలో ప్రధాన పాపం కాంగ్రెస్, టీఎంసీ, డీఎంకే, ఎస్పీ పార్టీలదే. మహిళలకు రిజర్వేషన్ ఇవ్వడం విపక్షాలకు ఇష్టం లేదు. కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు ప్రాయశ్చిత్తం చేసుకోవాలి. కాంగ్రెస్ పార్టీ.. మహిళా రిజర్వేషన్ బిల్లును గతంలో చాలాసార్లు అడ్డుకుంది. మహిళా బిల్లును అడ్డుకొని విపక్ష పార్టీలు నిజస్వరూపం చూపించాయి. కాంగ్రెస్ పార్టీ పరాన్న జీవిలా బతికేస్తోంది. స్థానిక పార్టీలపై ఆధారపడి ఆ పార్టీ జీవిస్తోంది.

మహిళా బిల్లుపై అవే కుట్రలు, కుతంత్రాలు చేశారు. కాంగ్రెస్, తృణమూల్, సమాజ్‌వాదీ, డీఎంకేకు ప్రజలు బుద్ధి చెబుతారు. నారీశక్తి వందన్ అధినియం బిల్లు వ్యతిరేకులు తగిన మూల్యం చెల్లించుకుంటారు. డీలిమిటేషన్‌పై కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు అసత్యాలు ప్రచారం చేశాయి. స్వార్థ రాజకీయాలతో ఆయా రాష్ట్రాల ప్రజలనూ మోసం చేస్తున్నాయి. డీలిమిటేషన్ వల్ల ఏ రాష్ట్రానికీ నష్టం జరగదని స్పష్టంగా చెప్పాను. అన్ని రాష్ట్రాలకు లోక్‌సభలో ప్రాతినిధ్యం పెరుగుతుందని హామీ ఇచ్చాను. బిల్లు ఆమోదం పొందితే అన్ని రాష్ట్రాల్లో సీట్లు పెరిగేవి. సీట్లు పెరిగితే కాంగ్రెస్, టీఎంసీ, ఎస్పీ వంటి అన్ని పార్టీలకు ప్రయోజనమే. రామ్ మనోహర్ లోహియా స్వప్నాలను సమాజ్‌వాదీ పార్టీ తుంగలో తొక్కింది. కాంగ్రెస్ పార్టీ సంస్కరణలకు ఎప్పుడూ వ్యతిరేకమే. జన్‌ధన్, డిజిటల్ పేమెంట్స్, జీఎస్టీని, ఆర్టికల్ 370 రద్దు, ట్రిపుల్ తలాక్ రద్దును కూడా కాంగ్రెస్ వ్యతిరేకించిందని ఈ సందర్భంగా మోడీ ప్రస్తావించారు. ఉగ్రవాదం, నక్సలిజం విషయాల్లోనూ కాంగ్రెస్ వైఖరి మర్చిపోలేం. సంస్కరణ పేరు వింటే చాలు.. కాంగ్రెస్ వెంటనే వ్యతిరేకిస్తుందని మండిపడ్డారు. ఆ పార్టీవన్నీ నెగటివ్ రాజకీయాలు. ఏ సంస్కరణ వచ్చినా కాంగ్రెస్ అడ్డుకుంటుంది.. దుష్ప్రచారం చేస్తుంది. ప్రజలను తప్పుదోవ పట్టించడం కాంగ్రెస్‌కు వెన్నతో పెట్టిన విద్య అని అన్నారు. దేశానికి మేలు చేసే ప్రతి నిర్ణయాన్నీ అడ్డుకోవడం కాంగ్రెస్ నైజం. సైనికుల వన్ ర్యాంక్, వన్ పెన్షన్‌ను 40 ఏళ్లపాటు కాంగ్రెస్ అడ్డుకుంది. దేశంలోని మహిళలు, యువతులు కలిసి కాంగ్రెస్‌కు గట్టిగా జవాబిస్తారని మోదీ అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకున్న విపక్షాలపై కోయంబత్తూర్ సభలో ప్రధాని నరేంద్ర మోదీ నిప్పులు చెరిగారు. మహిళల కోసం చేసిన మంచి ప్రయత్నాన్ని విపక్షాలు అడ్డుకున్నాయని, చేసిన తప్పులకు విపక్షాలు మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. మహిళల అభ్యున్నతి కోసం తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. బిల్లును అడ్డుకున్నందుకు డీఎమ్‌కే నేతలను ప్రజలు ప్రశ్నించాలన్నారు. సామాన్య మహిళలను ఎంపీ, ఎమ్మెల్యేలను చేయడమే తన సంకల్పమన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు క్రెడిట్‌ను విపక్షాలే తీసుకోవాలని కోరానని చెప్పారు. మోదీ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ .. 'మహిళా రిజర్వేషన్ల కోసం పార్లమెంట్‌లో బిల్లు పెట్టాం. కాంగ్రెస్, డీఎంకే కలిసి బిల్లును అడ్డుకున్నాయి. డీఎమ్‌కే నేతల చీకటి పనులు ప్రజలకు తెలుసు. నా బాధను పంచుకోవడానికే ఇక్కడికి వచ్చా. రిజర్వేషన్ల కోసం మా పోరాటం ముగియలేదు. మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకోవడం దారుణం. ఈ నెల 23న కాంగ్రెస్, డీఎమ్‌కే నేతలకు ఓటు ద్వారా సమాధానం చెప్పాలని తమిళనాడు ప్రజలకు పిలుపునిచ్చారు. మహిళా బిల్లును వ్యతిరేకించి విపక్షాలు తప్పు చేశాయని అన్నారు. మహిళలకు ప్రతిపక్షాలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బిల్లును వ్యతిరేకించిన విపక్షాలు శిక్ష అనుభవిస్తా యని అన్నారు.

## మహిళలకు విపక్షాలు వ్యతిరేకం


మొదటిపేజీ తరువాయి..

విషయాన్ని ప్రతి గ్రామానికి చేరేలా తెలియజేయాలని పిలుపునిచ్చారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ 131వ రాజ్యాంగ సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం శుక్రవారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. అయితే, 298-230 ఓట్ల తేడాతో ఇది వీగిపోయింది. ఇకపోతే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. కరవు భత్యం (డీఏ) 2 శాతం పెంచడానికి నిర్ణయం తీసుకుంది. దీనికి కేంద్ర క్యాబినెట్ ఆమోద ముద్ర వేసింది. ఏటా రెండుసార్లు కేంద్ర ప్రభుత్వం డీఏను సవరిస్తుంది. పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా ఉద్యోగులు, పెన్షనర్లకు ఈ భత్యాన్ని అందజేస్తారు. ఏటా జనవరి, జులైలో ఈ సవరింపు ఉంటుంది. అయితే ఈసారి డీఏ పెంపు ప్రకటన ఆలస్యమైంది. దాంతో ఉద్యోగుల నుంచి ఆందోళన వ్యక్తమైంది. అలాగే ఈ క్యాబినెట్ సమావేశంలో సావరిన్ మారిటైమ్ ఫండ్ ఏర్పాటుకు కూడా ఆమోదం లభించింది. దీనికోసం రూ.13వేల కోట్లు కేటాయించనున్నారు. దీనికింద భారత జెండా నౌకలు, భారత్ నుంచి రాకపోకలు సాగించే నౌకలకు బీమా కవరేజీ అందించడమే లక్ష్యం. పశ్చిమాసియా ఉద్రిక్తతలతో హర్మూజ్ జలసంధిలో రవాణా నౌకలపై దాడులు జరిగిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ నిధిని ఏర్పాటుచేయడం గమనార్హం.

## 20నుంచి 26 వరకు వెల్ఫేర్ వీక్

మొదటిపేజీ తరువాయి..

కార్యదర్శి కె. రామకృష్ణా రావు తెలిపారు. ఈ సందర్భంగా కార్యక్రమం అమలు తీరుపై ఆయన శనివారం సచివాలయం నుండి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ ఈసందర్భంగా స్పెషల్ చీఫ్ సెక్రెటరీ సబ్యసాచి ఘోష్ రోజువారీ షెడ్యూల్‌ను వివరించారు జిల్లా



కలెక్టర్లు ప్రతి కార్యక్రమం అమలును క్షుణ్ణంగా పర్యవేక్షించి సమగ్ర నివేదికను ప్రభుత్వానికి అందించాలని ఘోష్ సూచించారు. ప్రజాప్రతినిధులను అన్ని కార్యక్రమాల్లో చురుకుగా భాగస్వామ్యం చేయాలని, తద్వారా విస్తృత ప్రచారం, పారదర్శకత పెరుగుతుందని ప్రణాళిక కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ తెలిపారు. ప్రభుత్వ ప్రధాన పథకాలు సంక్షేమ కార్యక్రమాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని అన్నారు. వ్యవసాయ కార్యదర్శి సురేంద్ర మోహన్, సిహెచ్. ప్రియాంక, ఇతర అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

# రెండోవిడత రైతుభరోసా విడుదలకు సిద్ధం

మొదటిపేజీ తరువాయి..

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు సంక్షేమమే ధ్యేయంగా కీలక నిర్ణయం తీసుకున్నారు. వానాకాలం సాగుకు అన్నదాతలు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో రైతు భరోసా నిధులు విడుదల చేయాలని సీఎం నిర్ణయించారు. భూపాలపల్లి జిల్లా కాటారంలో ఈనెల 20వ తేదీన నిర్వహించనున్న భారీ బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఈ నిధులను విడుదల చేయనున్నారు. బటన్ నొక్కి నేరుగా రైతుల బ్యాంక్ ఖాతాల్లోకి నగదును జమ చేయనున్నారు. రెండో విడత నిధుల విడుదల ద్వారా రాష్ట్రంలోని మెజారిటీ రైతులకు లబ్ధి చేకూరనుంది. ప్రతి ఎకరానికి రూ. 6,000 చొప్పున పెట్టుబడి సాయం అందనుంది. ఈ విడతలో 45,11,947 మంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.50 కోట్ల ఎకరాలకు ఈ సాయం వర్తించనుంది. ప్రభుత్వం రైతు భరోసా కోసం భారీగా నిధులను వెచ్చిస్తోంది. దీనికి సంబంధించిన గణాంకాలు కింది విధంగా ఉన్నాయి. ఇప్పటికే ప్రభుత్వం రూ. 3,590 కోట్లను రైతుల ఖాతాల్లో సక్సెస్‌ఫుల్‌గా జమ చేసింది. 20వ తేదీన రూ. 5,653 కోట్లు జమ కానున్నాయి. మొత్తం 73 లక్షల మంది రైతులకు ఈ పథకం ద్వారా ప్రయోజనం చేకూరనుంది. మిగిలిన రైతుల కోసం మూడో విడత నిధులను విడుదల చేయడానికి కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించింది. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసే సమయంలో ఈ నగదు అందడం వల్ల రైతన్నలకు వడ్డీ వ్యాపారుల భారం తప్పుతుంది. నిధులు సకాలంలో అందడం వల్ల అన్నదాతలు సాగు పనులను వేగవంతం చేసే అవకాశం ఉంటుంది. తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చే క్రమంలో రైతు భరోసా నిధుల విడుదలకు ప్రాధాన్యం ఇస్తోంది. కాటారం సభ వేదికగా జరగనున్న ఈ కార్యక్రమం రాష్ట్ర వ్యవసాయ రంగంలో కొత్త ఉత్సాహాన్ని నింపనుంది.

# మహిళా బిల్లు పేరుతో డీలిమిటేషన్ కుట్ర

మొదటిపేజీ తరువాయి..

తమిళనాడుతో తనకున్న అనుబంధాన్ని వివరిస్తూ 'చాలా ఏళ్లుగా తమిళనాడు ప్రజలతో నాకు అనుబంధం ఉంది. నేను తమిళనాడులో పుట్టలేదు. నా కుటుంబం కూడా తమిళనాడు నుంచి వచ్చినది కాదు. అయినప్పటికీ ఇది నా సొంతిల్లులా అనిపిస్తుంది. తమిళ భాష, సంస్కృతిపై ఆర్ఎస్ఎస్, బీజేపీ దాడికి ప్రయత్నిస్తున్నాయి. వీళ్లకెంత ధైర్యం అని నాకు అపిస్తుంటుంది' అని రాహుల్ అన్నారు. పార్లమెంటులో పరిణామాలపై మాట్లాడుతూ, కొత్త బిల్లు పేరుతో వాళ్లు పార్లమెంటు ముందుకు వచ్చారని, దానిని మహిళా బిల్లు అని చెబుతున్నారని, అయితే మహిళా బిల్లును 2023లోనే ఆమోదించడం జరిగిందని తెలిపారు. బిల్లు వెనుక అసలు ఉద్దేశం నియోజకవర్గాల పునర్విభజనేనని అన్నారు. పార్లమెంటులో తమిళనాడుకు ప్రాతినిధ్యం తగ్గించడం, దక్షిణాది, ఈశాన్య రాష్ట్రాలను బలహీనపరచడం బిల్లు ఉద్దేశమని, అందువల్లే ఆ బిల్లును తాము ఓడించామని చెప్పారు. భారతదేశం రాష్ట్రాల యూనియన్ అనీ, అన్ని రాష్ట్రాల ను సమానంగా చూడాలని, కేంద్రంలో ప్రతి రాష్ట్రానికి మాట్లాడే అవకాశం, భాష, సంప్రదాయాలను స్వేచ్ఛగా ప్రకటించుకునే వీలుండాలని అన్నారు. బీజేపీ పాలనా విధానం ఇందుకు భిన్నంగా ఉందని, ప్రధానమంత్రి ఒకే దేశం, ఒకే నేత, ఒకే భాష, ఒకే ప్రజ అంటూ రాజ్యాంగంపై దాడి చేస్తున్నారని విమర్శించారు. కేంద్రం గుత్తాధిపత్యాన్ని తమ కూటమి అడ్డుకుంటుందని చెప్పారు. ఢిల్లీ నుంచి తమిళనాడును శాసించాలని బీజేపీ, ఆర్ఎస్ఎస్ అనుకుంటున్నాయని రాహుల్ విమర్శించారు. అయితే ఇందుకు తాము ఎంతమాత్రం అనుమతించేది లేదన్నారు. తమిళనాడు తన భవిష్యత్తును తానే నిర్దేశించుకుంటుందని, తమిళ సంస్కృతి, హక్కులు, భాషా పరిరక్షణలో తాము ప్రజలకు బాసటగా ఉంటామని చెప్పారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఏప్రిల్ 23న జరుగనుండగా, మే 4న ఫలితాలు వెలువడతాయి.

# కాంగ్రెస్‌కు ఉద్యోగుల ఉసురు తప్పదు

**ఉద్యోగుల జీతభత్యలు సకాలంలో ఇవ్వడం లేదు**

**పెన్షనర్లకు సకాలంలో అందని బకాయిలు**

**ఐదు డిఎలు పెండింగ్‌లోనే ఉన్నాయి**

**ఉద్యోగ సంఘాల జేఏసీ మాజీ నేత జి దేవీ ప్రసాద్**

హైదరాబాద్,ఏప్రిల్18(సాక్ష్యం): తెలంగాణలో ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులను ఇబ్బందులపాలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉసురు తగులుతుందని ఉద్యోగ సంఘాల జేఏసీ మాజీ నేత , జి దేవీ ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగులు,ఉపాధ్యాయుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చిందని, ఏ ఒక్క హామీ అమలుకు నోచుకోలేదని ఆరోపించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఉద్యోగులకు 5 డీఎలు పెండింగ్‌లో ఉన్నాయని,సీపీఎస్ రద్దుపై ఇప్పటి వరకు కమిటీ వేయలేదని విమర్శించారు. ఉద్యోగులకు డిజిటల్ హెల్త్ కార్డులు ఏమయ్యాయని ప్రశ్నించారు. రిటైర్డ్ ఉద్యోగులు 86 మంది చనిపోయారని,రిటైర్డ్ ఉద్యోగులకు చావు పరిష్కారం అయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు ఉద్యోగులకు ఇవ్వాల్సిన రూ. 14 వేల కోట్లు పెండింగ్ లో ఉన్నాయని తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగుకు హైకోర్టు మెట్లు ఎక్కాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల చనిపోయిన రిటైర్డ్ ఉద్యోగులకు కోటి 20 లక్షల నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల్లో ఆంధ్రా పెత్తనం నడుస్తోందని, ఎక్సైజ్ శాఖలో కమిషనర్ వేధింపులు తట్టుకోలేక తెలంగాణ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం చేశారని వెల్లడించారు. చంద్రబాబు, రేవంత్ రెడ్డి మధ్య సోదర బంధం ఉందని, బీజేపీ రాజకీయంతోనే మహిళా రిజర్వేషన్ల అమలు బిల్లు ఆగిపోయింది డీలిమిటేషన్, మహిళా బిల్లును లింక్ చేశారని ఆరోపించారు. టీజీపీఎస్సీ మాజీ సభ్యురాలు సుమిత్రానంద్ మాట్లాడుతూ 30 ఏళ్లుగా మహిళా బిల్లును కాంగ్రెస్, బీజేపీ అడ్డుకుంటున్నాయని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్ల అమలు కావడం బీజేపీకి ఇష్టం లేదని అన్నారు. ఉపాధ్యాయ సంఘం మాజీ నాయకులు భుజంగ రావు తదితరులు మీడియా సమావేశంలో పాల్గొన్నారు.

## దక్షిణాదిని దెబ్బతీసే కుట్రను

# అడ్డుకున్నాం



మొదటిపేజీ తరువాయి..

మధ్య అంతరాలు సృష్టించే విధానాన్ని విరమించుకోవాలన్నారు. మహిళా రిజర్వేషన్ల బిల్లుపై మాకు చిత్తశుద్ధి ఉంది. 2023 నాటి మహిళా బిల్లును పార్లమెంట్‌లో పెట్టాలి. ఆ బిల్లు పెడితే మద్దతు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం. ఇందులోనూ ఎస్సీ, ఎస్టీ ఓబీసీ రిజర్వేషన్లు అమలు చేయాలి. మహిళా రిజర్వేషన్ల బిల్లు విషయంలో రాజకీయం చేయాల్సిన అవసరం లేదని సీఎం రేవంత్ అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రధాని నరేంద్ర మోదీ సర్కార్ నిజాయితీగా తీసుకురాలేదని రేవంత్ రెడ్డి అన్నారు. మూడు బిల్లుల పేరుతో డీలిమిటేషన్ అమలుకు కుట్ర చేశారని ఆరోపించారు. రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ కుట్ర చేసిందని.. దక్షిణాదికి జరిగే అన్యాయాన్ని లోక్ సభ సాక్షిగా అడ్డుకున్నామని పేర్కొన్నారు. విపక్షాల ఐక్యతతో మోదీ సర్కార్ ఓడిపోయిందన్నారు. ఇది రాజకీయ ఓటమి కాదని, బీజేపీ విధానాల ఓటమి అంటూ వ్యాఖ్యానించారు. మహిళా రిజర్వేషన్ల బిల్లు ఇప్పటికే పాసైందని.. చిన్న సవరణలతో రిజర్వేషన్లు అమలు చేయవచ్చని రేవంత్ అన్నారు. రిజర్వేషన్లు తొలగించేందుకే బీజేపీ కుట్ర చేసిందని.. బీజేపీకి 400 సీట్లు వచ్చి ఉంటే రాజ్యాంగాన్ని మార్చేవారని తీవ్రంగా మండిపడ్డారు. విపక్షాలపై బురద జల్లేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని విమర్శించారు. 2023 మహిళా బిల్లును యథాతథంగా అమలు చేయాలని బీజేపీకి సూచించారు. అలా చేస్తే ఇండి కూటమి ఏకగ్రీవంగా మద్దతు ఇచ్చేందుకు సిద్ధమని ఆయన పేర్కొన్నారు. దక్షిణాది రాష్ట్రాలను ఒప్పించి తీసుకువచ్చే బాధ్యత తనదని ఈ సందర్భంగా రేవంత్ హామీ ఇచ్చారు. మహిళా రిజర్వేషన్లపై తమకు చిత్తశుద్ధి ఉందని, యూపీ ఎన్నికల్లోపు వాటిని అమలు చేయాలని ముఖ్యమంత్రి డిమాండ్ చేశారు. దీంతో ప్రజల్లో ఎవరికి మద్దతు ఉందో ప్రజాక్షేత్రంలోనే తేలుతుందని రేవంత్ రెడ్డి సవాల్ చేశారు. బిల్లును అడ్డుకోకుంటే డీలిమిటేషన్ పేరుతో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేసేవారని ధ్వజమెత్తారు. నార్త్, సౌత్ మధ్య అంతరాలు పెట్టే విధానం ఇకనైనా మార్చుకోవాలని బీజేపీకి సీఎం రేవంత్ రెడ్డి హితవుపలికారు. ఇకపోతే బీజేపీతో పొత్తు పెట్టుకున్న పార్టీల మనగడ భవిష్యత్తులో కష్టంగా ఉంటుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. తెలుగుదేశం, చంద్రబాబు నాయుడు పరిస్థితి కూడా అలాగే అవుతుందని పేర్కొన్నారు. నితీశ్ కుమార్, ఏక్ నాథ్ షిండేలా పరిస్థితి మనం ఇప్పుడు చూస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం బీజేపీకి కేంద్రంలో సీట్లు తక్కువగా ఉన్నాయి కాబట్టి టీడీపీకి ఇంపార్టెన్స్ ఇస్తోందని పేర్కొన్నారు. లోక్‌సభ, రాజ్యసభ ఉన్నది చట్టాలు చేయడానికి మాత్రమేనని చెప్పుకొచ్చారు. వాటిని ఇంప్లిమెంట్ చేసేది స్థానికంగా ఉండే రాష్ట్ర ప్రభుత్వాలు అధికార యంత్రాంగమని తెలిపారు. 2/3 మెజార్టీ వచ్చినంత మాత్రాన అన్నింటిని చట్టాలు చేయలేమని పేర్కొన్నారు. కేంద్రంలో మెజార్టీ ఉందని ప్రధానిగా ఉన్న ఎవరైనా తనకు తనకు రాజుగా 2/ 3 మెజార్టీతో చట్టం చేసుకుంటే ఒప్పుకోరు కదా అని ప్రశ్నించారు. డిక్టేటర్‌షిప్‌ని ఎవరు ఒప్పుకోరని చెప్పారు. ఏపీలో ప్రతిపక్షానికి కేవలం 11 సీట్లే ఉన్నాయని తెలిపారు. 2011 జనాభా లెక్కల ప్రకారం మహిళలకు రిజర్వేషన్ కల్పించాలని సీఎం రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు.

## మహిళా బిల్లును అడ్డుకోవడం దురదృష్టకరం

మొదటిపేజీ తరువాయి..

పేర్కొన్నారు. ప్రతిపక్షాలు చరిత్రలో మహిళా ద్రోహు లుగా మిగిలిపోతాయని విమర్శించారు. శనివారం ఢిల్లీలో మీడియాతో కిషన్‌రెడ్డి మాట్లాడారు. ఈ బిల్లులను ఎందుకు వ్యతిరేకిస్తున్నారో ప్రజలకు ఇండియా కూటమి నేతలు చెప్పలేకపోయారని పేర్కొన్నారు. మహిళలకు కాంగ్రెస్ పార్టీ మరోసారి అన్యాయం చేసిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. 50 శాతం సీట్లు పెంచాల్సిన అవసరం ఉందని చెప్పామని, ఈ విషయంపై అన్ని పార్టీలతో తాము మాట్లాడామని కిషన్‌రెడ్డి ప్రస్తావించారు. లోక్‌సభలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి వాళ్లకు తెలియజేసే ప్రయత్నం చేశామని తెలిపారు. ఈ బిల్లులపై కేంద్ర ప్రభుత్వం స్పష్టంగా ఒక పార్టీకి సంబంధించిన అంశం కాదని చెప్పిందని అన్నారు. ఇండియా కూటమి నేతలు కుట్ర చేసి మహిళా రిజర్వేషన్ బిల్లు, నియోజకవర్గాల బిల్లును అడ్డుకున్నారని ఆగ్రహించారు. కాంగ్రెస్ అనేకసార్లు మహిళా రిజర్వేషన్ బిల్లులో ద్వంద్వ వైఖరి అవలంబించిందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ఇప్పటి వరకు 7 సార్లు బిల్లు పాస్ కాకుండా అడ్డుకుందని కిషన్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ÷యోజకవర్గాల పునర్విభజన జరగాలని గతంలో చేసిన చట్టంలోనే ఉందని, దక్షిణాది రాష్ట్రాలకు న్యాయం జరిగేలా మంచి ఫార్ములాను మోదీ తీసుకొచ్చారని అన్నారు. కానీ, 131వ రాజ్యాంగ సవరణ బిల్లును అడ్డుకొని కాంగ్రెస్ పార్టీ చారిత్రక తప్పిదం చేసిందన్నారు. వరుసగా ఎన్నికల్లో ఓడిపోతున్నామనే నిరాశ, నిస్పృహ కాంగ్రెస్‌లో కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. మహిళలు, దక్షిణాది రాష్ట్రాలకు మేలు జరిగే బిల్లును అడ్డుకొని విపక్షాలు తప్పు చేశాయన్నారు. రాజకీయాల్లోకి రావాలనుకునే మహిళల ఉత్సాహంపై నీళ్లు చల్లారు. సర్జికల్ స్ట్రైక్స్, ఆపరేషన్ సిందూర్‌ను కూడా అవమానించేలా రాహుల్ గాంధీ మాట్లాడారు. ప్రధాని మోదీని జాదుగర్ అంటూ అవమానించారని కిషన్‌రెడ్డి మండిపడ్డారు.

# తెలంగాణ ఆత్మగౌరవం దెబ్బతీసిన తేజస్వీసూర్య

మొదటిపేజీ తరువాయి..

సపోర్టుగా నిలిచారని ఆరోపించారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కించపరిచేలా మాట్లాడితే తెలంగాణలో 8 మంది బీజేపీ, 8 మంది కాంగ్రెస్ ఎంపీలు ఉన్నా ఏం లాభమని అన్నారు. బీజేపీ ఎంపీ బేషరతుగా తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఆత్మగౌరాన్ని దెబ్బ తీసిన ఎంపీ విషయంలో బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదని వెల్లడించారు. బడేబాయి, చోటే బాయి బంధం మరో సారి బయటపడిందని అని స్పష్టం చేశారు. రాజకీయల్లో విలువలతో కూడిన రాజకీయం చేసిన వ్యక్తి జీవన్ రెడ్డి అని కొనియాడారు.మహిళా బిల్లును డీలిమిటేషన్‌తో ఎందుకు ముడి పెట్టారని ప్రశ్నించారు. మెజారిటీ లేకున్నా బిల్లు పెడతారా అని నిలదీస్తూ.. రాజకీయం కోసమే బిల్లు ప్రవేశపెట్టారని మాజీ మంత్రి హరీశ్ రావు వ్యాఖ్యలు చేశారు. మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు టి.జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరబోతున్న సందర్భంగా జిల్లాలో పండుగ వాతావరణం కనిపిస్తుందని బీఆర్ఎస్



పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఎంపీ లు పార్లమెంట్లో లేని లోటు నిన్న స్పష్టంగా కన్పించిందని హరీష్‌రావు వెల్లడించారు. తెలంగాణ ఉద్యమం, ప్రజల మీద విషం చిమ్మే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. భారత్ – పాక్ విభజనతో తెలంగాణ ఏర్పాను పోల్చుతారా అంటూ మాజీ మంత్రి మండిపడ్డారు. ఇది తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిందన్నారు. పార్లమెంట్‌లో బిల్లు పాస్ అయి.. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయ్యిందని హరీశ్ రావు తెలిపారు. ఎంపీ తప్పు మాట్లాడితే.. క్షమాపణ చెప్పాల్సింది పోయి వెనుకేసుకుని వస్తున్నారని మండిపడ్డారు. లోక్ సభలో బీఆర్ఎస్ ఎంపీలు లేని లోటు తెలుస్తోందన్నారు. బీజేపీ ఎంపీ వ్యాఖ్యలపై కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు పెదవులు మూసుకుని కూర్చున్నారని మండిపడ్డారు. తేజస్వి సూర్య మూతి పగిలే సమాధానం చెప్పలేకపోయారని అన్నారు. తెలంగాణ ప్రజల మనోభావాలను గాయపరిచారన్నారు. మహిళా బిల్లు విషయంలో కాంగ్రెస్, బీజేపీ పార్టీలు నాటకామాడుతున్నాయని విమర్శించారు. ఎంపీ తేజస్వి యాదవ్ వ్యాఖ్యలను సీఎం రేవంత్ ఇప్పటి వరకు ఖండించలేదని,రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం రాబోతుందని, దానికి నిదర్శనం బీఆర్ఎస్‌లో జీవన్ రెడ్డి చేరిక వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఈ నెల 20న జగిత్యాలలో జరగనున్న కేసీఆర్ ' ప్రజా ఆశీర్వాద సభ' ఏర్పాట్లను మాజీ మంత్రి హరీష్‌రావు, కొప్పుల ఈశ్వర్ , ఎమ్మెల్సీ రమణ, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తదితరులతో కలిసి పరిశీలించారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో రాజకీయ పునారేకీకరణ జరుగుతుందని వెల్లడించారు. జగిత్యాల నుంచి బీఆర్ఎస్ జైత్రయాత్ర ప్రారంభం అవుతుందని, జగిత్యాల నుంచి బీఆర్ఎస్ పార్టీకి పూర్వ వైభవం వస్తుందని దీమాను వ్యక్తం చేశారు.కేసీఆర్ బయటకు వస్తే గుంట నక్కలు బయపడుతున్నాయని పేర్కొన్నారు.కేసీఆర్ జగిత్యాలలో సభ ఉంటే మేడి గడ్డలో రేవంత్ సభ ఏర్పాటు చేసుకున్నాడని విమర్శించారు. రేవంత్ హైట్‌లో చిన్న అనుకున్న. కానీ రేవంత్‌ది చిన్న మెదడని, ఇక్కడ ఉన్న ఎమ్మెల్యే హై బ్రిడ్, క్రాస్ బ్రిడ్ ఎమ్మెల్యేనా అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసిన కేసీఆర్ సభ విజయవంతమవుతుందని, కేసీఆర్ సీఎం కావడం ఖాయమని అన్నారు. ఈనెల 20న కేసీఆర్ సాయంత్రం 5,30 నిముషాలకు చేరుకుంటారని వివరించారు. సుమరు గంట సేపు కేసీఆర్ సభ ఉంటుందని కేటీఆర్ వెల్లడించారు.

## భూముల మార్కెట్ విలువ పెంచే ప్రతిపాదన

**రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

హైదరాబాద్,ఏప్రిల్18(సాక్ష్యం): త్వరలోనే భూముల మార్కెట్ విలువలను పెంచేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటివరకు భూముల ధరల పెంపు జరగలేదని, త్వరలో ఈ విషయంలో నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. రెవెన్యూ శాఖలో కొత్త పాలసీ తీసుకురావడానికి కసరత్తు జరుగుతోందని, త్వరలోనే దీనిపై పూర్తి వివరాలు వెల్లడిస్తామని మంత్రి చెప్పారు. అలాగే కేబినెట్ విస్తరణపై చర్చ జరుగుతోందని, అది విడతల వారీగా జరిగే అవకాశం ఉందని తెలిపారు.ధరణి పోర్టల్‌కు సంబంధించిన సమస్యలను 'భూ–భారతి' ద్వారా పరిష్కరించనున్నట్లు వెల్లడించారు. చిట్‌చాట్‌లో పలు కీలక అంశాలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. భూముల ధరల పెంపు, రిజిస్ట్రేషన్ విధానంలో మార్పులు, రెవెన్యూ పాలసీ వంటి విషయాలపై స్పష్టత ఇచ్చారు. మంత్రి మాట్లాడుతూ, భూముల రిజిస్ట్రేషన్‌ను మ్యాప్‌తో అనుసంధానం చేస్తూ ఈ నెల 20వ తేదీ నుంచి కొత్త విధానం ప్రారంభమవుతుందని చెప్పారు. మ్యాప్‌తో కూడిన తొలి రిజిస్ట్రేషన్ పాలేరు ప్రాంతంలో ప్రారంభం కానుందని తెలిపారు. నామినేటెడ్ పోస్టుల భర్తీ కూడా త్వరలోనే చేపడతామని పేర్కొన్నారు. సమ్మర్ తర్వాత జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు జరిగే అవకాశముందని ఆయన తెలిపారు. అసైన్డ్ భూములపై వచ్చిన ఫిర్యాదులను త్వరలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇప్పటికే నాలుగు రకాల ఫిర్యాదులను గుర్తించి వాటి పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు ఇచ్చామని వెల్లడించారు. ఏ శాఖ ఎవరికీ శాశ్వతం కాదని, శాఖలపై ఆశలు పెట్టుకోవడం సహజమని మంత్రి వ్యాఖ్యానించారు. అసెంబ్లీలో తనపై ప్రతిపక్షం విమర్శలు చేసినప్పుడు ఇతర మంత్రులు తనకు మద్దతుగా నిలిచారని తెలిపారు. ప్రతిపక్షం ట్రాప్‌లో పడకుండా ఓపికగా సమాధానాలు ఇచ్చానని అన్నారు. ఇక బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలపై లిస్ట్ తయారు అవుతోందని, సరైన సమయంలో అన్ని విషయాలు బయటకు వస్తాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.

## బయ్యారంలో గ్రీన్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు

మొదటిపేజీ తరువాయి..

సీఎం వివరించారు. పాత వాహనాల స్క్రాప్‌ను రీసైక్లింగ్ చేసే పరిశ్రమను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈవీ బ్యాటరీల తయారీ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. హైదరాబాద్‌ను కాలుష్యం లేని నగరంగా మార్చేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో బిజీబిజీగా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామితో సమావేశమయ్యారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా బయ్యారంలో గ్రీన్ స్టీల్ ప్లాంట్ నెలకొల్పాలని విజ్ఞప్తి చేశారు. హైడ్రోజన్ టెక్నాలజీతో గ్రీన్ స్టీల్ క్లస్టర్ ఏర్పాటుకు ప్రతిపాదన చేశారు. పాత వాహనాల స్క్రాప్‌తో ఉక్కును రీసైక్లింగ్ చేసే పరిశ్రమను తెలంగాణలో ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్ర పారిశ్రామిక విజన్ డాక్యుమెంట్‌ను కేంద్ర మంత్రికి సీఎం వివరించారు. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరుగుతున్న దృష్ట్యా ఈవీ బ్యాటరీ తయారీ కేంద్రం ఏర్పాటుకు విన్నవించారు. ఆటో, రక్షణ రంగాల ఉత్పత్తులు, రోబోటిక్స్ తయారీకి ప్రత్యేక పార్కుల కోసం ప్రతిపాదించారు ముఖ్యమంత్రి. 2034 నాటికి హైదరాబాద్‌ను కాలుష్య రహిత నగరంగా మార్చేందుకు కేంద్రం సహకారం కోరారు. ఆధునిక పరిశ్రమలకు అనుగుణంగా జాతీయ స్థాయి స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థలను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రి కుమార స్వామికి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. అలాగే వయనాడ్ ఎంపీ, కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం ఉదయం సమావేశమయ్యారు. 131వ రాజ్యాంగ సవరణ బిల్లును ఓడించినందుకు ప్రియాంకకు సీఎం ధన్యవాదాలు తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లు వెనుక ఉన్న అసలు విషయాలను ప్రియాంక గాంధీ బయటపెట్టారని ముఖ్యమంత్రి అన్నారు. తెలంగాణ ప్రజల తరఫున రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేకు ధన్యవాదాలు తెలియజేశారు. 'దక్షిణాది రాష్ట్రాలను ఏకీకృతం చేయడంలో నా కృషిని ప్రియాంక గాంధీ అభినందించారు' అని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు.



## తెలంగాణలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

మొదటిపేజీ తరువాయి..

44.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నిజామాబాద్ జిల్లా మెండోరాలో 44.5 డిగ్రీలు, జగిత్యాల జిల్లా ఎండపల్లిలో 44.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రోజు రోజుకూ ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో చిన్నారులు, వృద్ధులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లొద్దని వాతావరణ శాఖ సూచించింది. ఉదయం నుంచే ఎండ తీవ్రత విపీతరంగా ఉంటోంది. ఉక్కపోత వాతావరణం పెరిగి రాత్రిపూట కూడా ఉష్ణోగ్రతలు తగ్గడం లేదు. మార్చి చివరి నుంచి సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఏప్రిల్ మొదటి వారంలో కొన్ని ప్రాంతాల్లో వర్షాల వల్ల కొంత ఉపశమనం లభించినప్పటికీ, ఎండలు మళ్లీ తీవ్రరూపం దాల్చాయి. ప్రస్తుతం సాధారణం కంటే 3 డిగ్రీల వరకు అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ పరిస్థితులకు ప్రధాన కారణంగా ఎల్ నినో ఏర్పడే సూచనలు కనిపిస్తున్నాయి. పసిఫిక్ మహాసముద్రంలో ఉష్ణోగ్రతలు 0.5 నుంచి 1 డిగ్రీ పెరగడంతో ఎల్ నినో ప్రభావం ఏర్పడి, దక్షిణ భారతదేశంపై ఎండల ప్రభావం ఎక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఎల్ నినో కారణంగా నైరుతి రుతుపవనాలు బలహీనపడి, వర్షపాతం తగ్గే అవకాశం ఉంది. వేసవి కాలం మరింత తీవ్రంగా ఉండవచ్చని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. రానున్న రోజుల్లో ముఖ్యంగా మే, జూన్ నెలల్లో ఎండల తీవ్రత మరింత పెరిగే సూచనలు ఉన్నాయి. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ అధికారులు సూచించారు. చెదురుమదురు వర్షాలు కురిసే అవకాశమూ ఉందని అధికారులు చెబుతున్నారు.



# మహిళా బిల్లుపై నిరసనలకు పిలుపు

బిజెపి అధ్యక్షుడు రామచంద్రరావు గృహనిర్బంధం

హైదరాబాద్,ఏప్రిల్18(సాక్ష్యం): తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావును పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఇంటిని ముట్టడించేందుకు పిలుపునివ్వడంతో శనివారం ఉదయాన్నే రాంచందర్ రావు ఇంటికి వెళ్లిన పోలీసులు గుహ నిర్బంధం చేశారు. లోక్ సభలో శుక్రవారం మహిళా రిజర్వేషన్ బిల్లును కాంగ్రెస్ అడ్డుకుందంటూ రేవంత్ ఇంటి ముట్టడికి బీజేపీ సిద్ధమైంది. దీంతో పోలీసులు రంగంలోకి దిగారు. మరోవైపు పోలీసులు తనను నిర్బంధించడంపై ఆయన ఆగ్రహించారు. నారీ శక్తికి ద్రోహం చేసిన కాంగ్రెస్‌ను వదిలిపెట్టేది లేదని రాంచందర్ రావు హెచ్చరించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు మాట్లాడారు. కాంగ్రెస్ వైఖరికి నిరసనగా ఈరోజు దేశ వ్యాప్త ఆందోళనకు పిలుపునిచ్చామన్నారు. పోలీసులు తనను హౌస్ అరెస్ట్ చేశారని, అయినా తమ పార్టీ శ్రేణులు, నాయకులు రేవంత్ రెడ్డి ఇంటిని ముట్టడిస్తారని హెచ్చరించారు. దేశంలో ఇంకా రాచరిక పాలన కావాలని కాంగ్రెస్ భావిస్తోందని మండిపడ్డారు. ఒక్క ముస్లిం సమాజానికి మేలు చేసేందుకు ఈ డ్రామా ఆడుతున్నారని ఆరోపించారు. దేశ ప్రజలు, తెలంగాణ సమాజం కాంగ్రెస్ పార్టీకి తగిన విధంగా బుద్ధి చెప్పాలని అన్నారు.

**SUMMONS TO DEFENDANTS
IN THE COURT OF HON'BLE XI JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT::
AT:: SECUNDERABAD**

**O.S.NO. 236 OF 2026**

**BETWEEN:**
**Kanneganti Dhanalakshmi and Two Others ...PLAINTIFF**
**AND**
**Tahasildar, Tirumalgiri (Bowenpally)**
**And All Concerned ...DEFENDANTS**

**To,**
**All Concerned ...DEFENDANTS**

Whereas the Plaintiff above named has filed the above O.S. No.236 of 2026 to declare the Plaintiffs as legal heirs of deceased Kanneganti Sambhasiva Rao and the matter stands posted on 08-05-2026 for your appearance.

You all are Concerned are hereby required to appear in this court in person or by a pleader on 08-05-2026 at 10.30.a.m. failing which the matter would be decided in your absence in accordance with law.

**(BY ORDER OF THE HON'BLE COURT)**

**K. SUBBA RAO**
**K. HARIKRISHNA**
**ADVOCATES FOR PLAINTIFF**
**H.No.24-143/11, Vimaladevi Colony, Malkajgiri, Hyderabad-500 047.**
**Email: ksubbarao755@gmail.com**

## ఆవుపై దాడి చేసి చంపిన పెద్దపులి

### పోలవరం ప్రాంతంలో తొలగని భయాందోళన

ఏలూరు,ఏప్రిల్18: పోలవరం ప్రాజెక్ట్ పరిసర ప్రాంతాల్లో పెద్ద పులి సంచారం కలకలం రేపుతోంది. ప్రాజెక్ట్ సమీపంలోని పాత చేగొండపల్లి గ్రామం వద్ద ఒక ఆవుపై పులి దాడి చేసి చంపిన ఘటన స్థానికంగా భయాందోళనకు దారితీసింది. ఆవు మృతదేహాన్ని గమనించిన గ్రామస్తులు వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న అధికారులు పరిశీలించగా, అక్కడ పులి పాదముద్రలను గుర్తించారు. ఈ నేపథ్యంలో పులి కదలికలను పర్యవేక్షించేందుకు అటవీశాఖ సిబ్బంది ఘటన చోటుచేసుకున్న ప్రాంతంలో ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేశారు. పులి ఏ దిశగా సంచరిస్తోందో తెలుసుకునేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. పులి సంచారం కారణంగా గ్రామస్తులు, అలాగే పోలవరం ప్రాజెక్ట్ కార్మికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. రాత్రి సమయంలో బయటకు రావద్దని, పశువులను సురక్షితంగా ఉంచాలని అటవీశాఖ అధికారులు సూచించారు. అలాగే పరిస్థితిని నిశితంగా గమనిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## అగ్నిప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన

### విశాఖ ఆర్కే బీచ్‌లో అవగాహనలో హోంమంత్రి అనిత

విశాఖపట్నం,ఏప్రిల్18: అగ్నిప్రమాదాలు, వాటి నివారణ గురించి రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. ఏప్రిల్ 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు, ప్రజలు ఏ విధంగా జాగ్రత్తగా ఉండాలో డెమోలో అధికారులు వివరించారుని తెలిపారు. జాతీయ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం విశాఖపట్నం ఆర్కే బీచ్‌లో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హోం మంత్రి అనిత హాజరయ్యారు. అగ్నిప్రమాదాలు, వాటి నివారణ గురించి అధికారులు వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మెగా ఫైర్ సర్వీస్ డెమో ఆకట్టుకుంది. మెగా ్గ÷ర్ సర్వీస్ డెమోను అతిథులు, నగరవాసులు ఆసక్తిగా తిలకించారు. అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో ప్రాణాలను, ఆస్తులను రక్షించడంలో అగ్నిమాపక సిబ్బంది పోషించే అమూల్యమైన పాత్రను అగ్నిమాపక శాఖ అధికారులు వివరించారు. జాతీయ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను హోం మంత్రి అనిత పరిశీలించారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడారు. 2018లో అగ్నిమాపక శాఖకు పరికరాలు కొనుగోలు చేశామని చెప్పుకొచ్చారు. 2019 నుంచి 2024 వరకు అగ్నిమాపక శాఖను వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదని అన్నారు. ఇటీవల రూ. 232 కోట్లతో ్గ÷ర్ వెహికల్స్ కొనుగోలు చేశామని ప్రస్తావించారు. సీఎం చంద్రబాబు ఈ వాహనాలను కూడా ప్రారంభించారని అన్నారు. అత్యాధునిక పరికరాలను ఉపయోగిస్తున్నామని వివరించారు. టెక్నాలజీని ఉపయోగిస్తూ, డ్రోన్లు వాడుతున్నామని హోం మంత్రి అనిత పేర్కొన్నారు.

## పవన్ కల్యాణ్‌కు శస్త్రచికిత్స


అమరావతి,ఏప్రిల్18: ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు శస్త్రచికిత్స జరిగింది. పది రోజులు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు. శుక్రవారం ఉదయం పాలనా పరమైన అంశాలపై అధికారులతో చర్చిస్తున్న సమయంలో పవన్ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో వ్యక్తిగత వైద్యుల సలహాతో కార్యక్రమాలను రద్దు చేసుకున్న ఆయన ఆస్పత్రికి వెళ్లారు. పలు వైద్యపరీక్షలు నిర్వహించిన వైద్యులు.. శనివారం సాయంత్రం శస్త్రచికిత్స చేశారు. కనీసం 10 రోజుల పాటు పూర్తి విశ్రాంతి తీసుకోవాలని, దీర్ఘకాలం పాటు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచించారు. పూర్తి స్వస్థత చేకూరేందుకు కాస్త ఎక్కువ సమయం పడుతుందని తెలిపారు. ఈ మేరకు పార్టీ కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. హైదరాబాద్ అపోలోలో ఆయన ముక్కుకు శస్త్రచికిత్స జరిగినట్లు తెలుస్తోంది.

## దత్తపుత్రుడి బండారం బయట పడింది

### బిజెపితో అనుబంధం బట్టబయయలు

### జగన్ తీరుపై మండిపడ్డ వైఎస్ షర్మిల

అమరావతి,ఏప్రిల్18: జగన్ చేసిన నీచపు పనికి వైఎస్సార్ ఆత్మ నిజంగా ఘోషిస్తోందని పిసిసి చీఫ్ వైఎస్ షర్మిల విమర్శించారు. మహిళా బిల్లును, డీ లిమిటేషన్‌కి లింక్ పెట్టడం జగన్ అవివేకానికి



నిదర్శనమని ఎద్దేవా చేశారు. ఈ మేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై షర్మిల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దత్తపుత్రుడు జగన్ తెర తొలగిందని విమర్శించారు. బీజేపీతో ఆయన పెట్టుకున్న అక్రమపొత్తు తేటతెల్లమైందని ఎద్దేవా చేశారు. ఈ మేరకు షర్మిల ఓ ప్రకటన విడుదల చేశారు. విపక్షం ముసుగులో ఉన్నది సైతం బిజెపి పక్షమేనని నిజ నిర్ధారణ జరిగిందని తెలిపారు. వైసీపీ హయాంలో చేసిన అవినీతి కోసం ఇంతలా బీజేపీతో అంటకాగాలా..? అని ప్రశ్నించారు. కేసుల నుంచి రక్షణ కోసం బానిసగా బతకాలా..? అని ఎద్దేవా చేశారు. ఇదేనా జగన్ చెప్పే వైఎస్సార్ ఆశయాలు, వారసత్వం..? అని నిలదీశారు. మహానేత వైఎస్సార్ సిద్ధాంతాలను మంట గలిపినందుకు, విలువలకు తూట్లు పొడిచినందుకు జగన్ ఆత్మవిమర్శ చేసుకోవాలని హితవు పలికారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లకు ఎవరు వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. మహిళలకు అగ్రతాంబూలం అందిస్తుంటే అభ్యంతరం ఎవరికీ లేదని అన్నారు. కాంగ్రెస్‌తో సహా దేశవ్యాప్తంగా విపక్షాల ఐక్యత ఒకటేనని చెప్పుకొచ్చారు. మహిళా బిల్లు పాస్ అయ్యింది 2023లోనేనని ప్రస్తావించారు. నియోజకవర్గాల పునర్విభజనపై, మహిళా రిజర్వేషన్లపై కాంగ్రెస్ స్టాండ్ క్లియర్‌గా ఉందని వ్యాఖ్యానించారు. 2026 జనాభా లెక్కలు అందుబాటులోకి రావాలని షర్మిల సూచించారు. కులగణన ద్వారా ÷ూఅ, ÷ు, క్షఃఅల సంఖ్య తేలాలని అన్నారు. కులాల ఆధారంగా డీ లిమిటేషన్‌లో రిజర్వేషన్లు పాటించాలని డిమాండ్ చేశారు. వెనుకబడిన కులాలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించి న్యాయం చేయాలని కోరారు. ప్రస్తుత 543 స్థానాలకు తక్షణం మహిళా రిజర్వేషన్లను పాటించాలని సూచించారు. చిన్న రాష్ట్రాల వాదనలను పరిగణనలోకి తీసుకొని సమ్మతమైన పరిష్కారం చూపాలని అన్నారు. అధికారిక గణాంకాలు లేకుండా 50 శాతం పెంచి? దేశాన్ని అభివృద్ధి చేస్తున్నామని బీజేపీ చెబితే గుడ్డిగా జగన్ సైతం నమ్మడం రాష్ట్ర ప్రజలను మోసం చేయడమేనని షర్మిల పేర్కొన్నారు.

# మహిళలను మోసం చేయడంలో కాంగ్రెస్ ఫస్ట్

- ఇప్పటికే 30 ఏళ్లుగా మోసం చేస్తోంది
- మహిళా బిల్లును అడ్డుకోవడం దుర్మార్గం
- నిడదవోలులో ఎన్డీఏ కూటమి ఆధ్వర్యంలో నిరసన
- ర్యాలీలో పాల్గొన్న చంద్రబాబు కాంగ్రెస్‌పై ధ్వజం

నిడదవోలు,ఏప్రిల్18: మహిళలను మోసం చేయడం కాంగ్రెస్ పార్టీకి అలవాటైపోయిందని సీఎం చంద్రబాబు విమర్శించారు. ఇప్పటికే 30 ఏళ్లు కాంగ్రెస్ మోసం చేసిందని, మహిళా రిజర్వేషన్లు ఎప్పుడు అమలవుతాయో ఆ దేవుడికే తెలియాలని వ్యాఖ్యానించారు.

131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో వీగిపోవడంతో మహిళా రిజర్వేషన్ల అమలు 2034కి వెళ్తుందని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ఇండియా కూటమి వ్యతిరేకించినందుకు నిరసనగా శనివారం నిడదవోలులో ఎన్డీఏ కూటమి పక్షాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీలో సీఎం చంద్రబాబు, బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, మంత్రులు నిమ్మల రామ్మోహన్ నాయుడు, క ందుల దుర్గేశ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ప్రసంగించారు. మహిళలు సరిగా చేయలేరని కొందరు విమర్శిస్తున్నారని, ఆడబిడ్డలే మగవారికంటే ఎక్కువగా సంపాదిస్తున్నారంటే అది మహిళల శక్తి కాదా అని అన్నారు. తల్లికి వందనం, స్త్రీ శక్తి కార్యక్రమాల ద్వారా మహిళలకు చేయూతనిస్తున్నట్లు చెప్పారు. కాంగ్రెస్, మిత్రపక్షాలు సహకరిస్తే మహిళా బిల్లు ఆమోదం పొందేది. మహిళా బిల్లును ఎందుకు ఆమోదించలేదో చెప్పాలని విపక్షాలను నిలదీస్తున్నా. 1996లో దేవెగౌడ హయాంలో బిల్లుకు కాంగ్రెస్ మద్దతిచ్చినా వాళ్లు ఒప్పుకోలేదు. ఆ తర్వాత నాలుగుసార్లు బిల్లు వచ్చినా ఆమోదం పొందకుండా కాంగ్రెస్ అడ్డుకుంది. యూపీఏ హయాంలో రాజ్యసభలో బిల్లు ఆమోదించారు. రాజ్యసభలో భాజపా



సమర్థించింది.. మరి అప్పుడు లోక్‌సభలో ఎందుకు తీసుకురాలేదు. అప్పుడే లోక్‌సభలో తీసుకువచ్చి ఉంటే ఆ క్రెడిట్ కాంగ్రెస్‌కే దక్కేది కదా అని ఆన్నారు. 2023లో మహిళా బిల్లు వచ్చినా.. 2026లో జనగణన జరగాల్సి ఉ ంది. జనగణన, డీలిమిటేషన్ తర్వాత మహిళా బిల్లుపై ముందుకెళ్లాలి. దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని ఆరోపిస్తున్నారు. వాజ్‌పేయీ హయాంలో 1971 జనాభా లెక్కల ప్రకారం ముందుకెళ్లారు. ప్రజలను తప్పుదోవ పట్టించి మహిళలకు రిజర్వేషన్లు దక్కకుండా చేశారు. ఇది దేశద్రోహం.. మహిళలకు చేసిన దగా, మోసమని హెచ్చరిస్తున్నా అని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా సాధికారతలో ఏపీ ముందంజలో ఉందని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్లు పెట్టాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తే కాంగ్రెస్ అడ్డుపడిందని పేర్కొన్నారు. ఈ పోరాటానికి దేశవ్యాప్త నిరసన నిడదవోలు నుంచి మొదలైందని తెలిపారు. నిడదవోలు పర్యటన చరిత్రలో నిలిచిపోతుందని చెప్పుకొచ్చారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రధానమంత్రి నరేంద్రమోదీ 2023లో తీసుకువచ్చారని సీఎం చంద్రబాబు ప్రస్తావించారు. ఈ బిల్లు అమల్లోకి రావాలంటే, 2026లో జనగణన జరగాల్సి ఉ ందని తెలిపారు. అలాంటి బిల్లుకు ఇండియా కూటమి నేతలు ఎందుకు మద్దతు ఇవ్వలేదని నిలదీశారు. దక్షిణాది రాష్ట్రాలకు నియోజకవర్గాల పునర్విభజన బిల్లుతో నష్టం జరుగుతోందని ఇండియా కూటమి నేతలు అంటున్నారని.. ఈ విషయంలో ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమాధానం చెప్పారని తెలిపారు. ప్రస్తుత పరిణామాలు చూస్తుంటే తనకు బాధ వేస్తోందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. మహిళలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు, సమాన ఆస్తి హక్కును దివంగత మాజీ సీఎం నందమూరి తారక రామారావు కల్పించారని ఉద్ఘాటించారు. ఏపీ డ్వాక్రా మహిళలు దేశ వ్యాప్తంగా నెంబర్ వన్‌గా పనిచేస్తున్నారని ప్రశంసించారు. వరకట్న సమస్య పోయిందని చెప్పుకొచ్చారు. ఆడబిడ్డలే భర్త కంటే ఎక్కువ సంపాదిస్తున్నారంటే, అది ఆడబిడ్డల శక్తి అని తెలిపారు. కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు అనుకుని ఉంటే మహిళా రిజర్వేషన్ బిల్లు పార్లమెంట్‌లో పాసయ్యేదని.. కానీ ఎందుకు అడ్డుకున్నారని ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్ల బిల్లు ఈ నాటిది కాదని చెప్పుకొచ్చారు. మహిళలకు ఎప్పుడు న్యాయం చేయని పార్టీ, ద్రోహం చేస్తున్న పార్టీ కాంగ్రెస్ అని సీఎం చంద్రబాబు ధ్వజమెత్తారు. మహిళలకు రిజర్వేషన్లు వచ్చేవరకు పోరాటం చేస్తానని స్పష్టం చేశారు.

# మూడుసార్లు గోదావరి పుష్కరాలు నిర్వహించే అదృష్టం

- పుష్కరాలకు ముందే పోలవరం పూర్తి చేస్తాం
- రాజధాని అమరావతి రైతుల త్యాగం మరువలేనిది
- రాష్ట్రంలో గొడ్డలి పార్టీ అభివృద్ధిని అడ్డుకుంటోంది
- మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో చంద్రబాబు

నిడదవోలు,ఏప్రిల్18: గోదావరి పుష్కరాలను వచయ్చే యేడు బ్రహ్మాండంగా నిర్వహిస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. అప్పటిలోగా పోలవరం పూర్తి చేస్తామని అన్నారు. గోదావరి పుష్కరాలను మూడోసారి నిర్వహించే అదృష్టం తనకే దక్కిందని అన్నారు. పుష్కరాల కంటే ముందుగానే పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తామని అన్నారు.

తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన 50 ఏళ్ల రాజకీయ జీవితంలో, 2024లో వచ్చిన మెజార్టీ ఎప్పుడూ చూడలేదని ప్రస్తావించారు. తెలిపారు.

అమరావతి రాజధానిగా కేంద్రం ఓ బిల్లు తెచ్చిందని పేర్కొన్నారు. అమరావతి రైతుల త్యాగం మరువలేనిదన్నారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో అన్న క్యాంటీన్లు మూసేసి, పేదలకు అన్నం లేకుండా చేశారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీలో గొడ్డలి పార్టీ ఉందని.. పేదల సమస్యలు పట్టవని ధ్వజమెత్తారు. పేదలకు కడుపునిండా అన్నం పెట్టడానికి జగన్ అండ్ కోకు మనసొప్పదని విమర్శించారు. పేదలకు అన్నం పెట్టలేని పార్టీలు ఉన్నా ఒక్కటే.. లేకున్నా ఒక్కటేనని ఆగ్రహించారు. అందరినీ నరుకుతామని చెప్పి, నరబలి ఇస్తామని ఆ



పార్టీ శ్రేణులు అంటున్నాయని దుయ్యబట్టారు. ఇక్కడ ఉన్నది 1995 సీబీఎన్.. ఆ గొడ్డలి పార్టీ ఆగడాలను సాగనివ్వనని సీఎం హెచ్చరించారు.

ఆడబిడ్డలను చట్టసభల్లో చూడాలనేదే తన ఆకాంక్ష అని చెప్పుకొచ్చారు. మహిళలకు వ్యతిరేకంగా పనిచేసే పార్టీలు మనుగడ సాగించలేకుండా చేయాలని అన్నారు. విధ్వంసమైన రాష్ట్రాన్ని బాగు చేసే బాధ్యత తాను తీసుకుంటానని ఎన్నికల ముందు చెప్పానని తెలిపారు. 'మన ఇల్లు - మన వీధి - మన ఊరు' అనే ఆలోచన ప్రజలకు రావాలని సూచించారు. స్వచ్ఛాంధ్ర కోసం 15 నెలలుగా కష్టపడుతున్నానని పేర్కొన్నారు. ఈ శనివారం 'జలధార జలహారతి' అనే థీమ్‌తో ముందుకు వచ్చానని.. వంద రోజులు కార్యాచరణతో పనిచేస్తానని స్పష్టం చేశారు. త్వరలోనే రాష్ట్రంలో నూటికి నూరు శాతం చెత్తను సేకరించే బాధ్యతను తీసుకుంటామని తెలిపారు. చెత్తే మన సమస్య.. మన ఆరోగ్యానికి సమస్య అని చెప్పారు. 13 నగరాల్లో స్వీపింగ్ యంత్రాలు తెస్తున్నామని.. టెండర్లు పిలిచామన్నారు. సంక్షేమ కార్యక్రమాలకు పెద్దపీట వేస్తున్నామని వెల్లడించారు.

సూపర్ సిక్స్ ను సూపర్ హిట్ చేశామని ఉ ద్ఘాటించారు. ప్రతీనెల పేదల సేవలో 60 లక్షల మందికి, ఏడాదికి రూ.33వేల కోట్లతో పెన్షన్లు ఇస్తున్నామని వివరించారు. అక్వాకల్చర్‌ను పరిశ్రమగా తీసుకెళ్లాలని సూచించారు. అక్వా కల్చర్‌తో కొంత కాలుష్య సమస్యలు వస్తున్నాయని ప్రస్తావించారు. ఆ కాలుష్యం లేకుండా చర్యలు తీసుకుని, అక్వాను అభివృద్ధి చేస్తామని చెప్పుకొచ్చారు. సీఎం చంద్రబాబు నిడదవోలు పర్యటనలో తక్కువ అభివృద్ధి చూపించిన శాఖల పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. త్వరలోనే ఆకస్మిక తనిఖీలకు వస్తానని తెలిపారు. బాగా పనిచేస్తే అభినందిస్తానని.. లేకపోతే పని నేర్పిస్తానని.. అప్పటికీ బాగాలేకపోతే.. ఇక బాగుండదని హెచ్చరించారు. అధికారులు, తాను ప్రజలకు సేవకులం మాత్రమేనని.. పెత్తందార్లం కామని స్పష్టం చేశారు. కొన్ని శాఖలకు వ్యసనాలు ఉ న్నాయని.. ఆ వ్యసనాలు పోవాలని సీఎం చంద్రబాబు మందలించారు. కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, కందుల దుర్గేశ్‌లు పాల్గొన్నారు.

# రామునిపై అనుచిత వ్యాఖ్యలు.. బేషరతుగా క్షమాపణలు చెప్పాలి

### లేదంటే క్రిమినల్ కేసులు ఎదుర్కోవాలి: విశ్వహిందూపరిషద్ తీవ్ర హెచ్చరిక

అమరావతి,ఏప్రిల్18: సినీ నటుడు ప్రకాష్ రాజ్.. శ్రీరాముడిపై చేసినట్లు ఆరోపిస్తున్న వ్యాఖ్యలు ప్రస్తుతం వివాదాస్పదంగా మారా యి. ఈ వ్యాఖ్యలపై విశ్వ హిందూ పరిషత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. హిందూ సమాజానికి ప్రకాష్ రాజ్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. క్షమాపణలు చెప్పకపోతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించింది. అమరావతిలో మీడియాతో మాట్లాడిన విశ్వహిందూ పరిషత్ భాగ్యనగర క్షేత్ర కార్యదర్శి తనికెళ్ల సత్యరవి కుమార్, సినీ నటుడు ప్రకాష్ రాజ్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ప్రకాష్ రాజ్ తన వ్యాఖ్యలతో హిందువుల మనోభావాలను దెబ్బతీశారని విమర్శించారు.. ప్రకాష్ రాజ్ జాతీయతకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని, దేశ భావజాలాన్ని అవమానించే విధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు సత్యరవ



కుమార్.. ఆయన ప్రవర్తన హిందూ సమాజాన్ని కించపరిచేలా ఉందని అన్నారు. శ్రీరాముడిని అవమానించినందుకు హిందువులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని వీహెచ్‌పీ స్పష్టం చేసింది. లేనిపక్షంలో ఃజీతీసజీనిణ ఆజీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించింది.

ప్రకాష్ రాజ్‌పై హిందూ సమా జం మొత్తం కలిసి క్రిమినల్ కేసులు వేస్తామని, ఆయన సినిమాలను బహిష్కరించాలని కూడా పిలుపునిచ్చారు. దర్శకులు, నిర్మాతలు, ఇతర హీరోలు తమ సినిమాల్లో ప్రకాష్ రాజ్‌కు అవకాశాలు ఇవ్వవద్దని విజ్ఞప్తి చేశారు. ఈ వ్యవహారం ప్రస్తుతం రాజకీయ, సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ప్రకాష్ రాజ్ నుంచి దీనిపై స్పందన రావాల్సి ఉంది.

# రాముడిపై నోరు పారేసుకున్న ప్రకాశ్ రాజ్

## నటుడి వ్యాఖ్యలపై తీవ్ర దుమారం.. మండిపడ్డ జనసేన నేత నాగబాబు

అమరావతి,ఏప్రిల్18: ఇటీవల కేరళ సాహిత్యోత్సవంలో ప్రకాశ్ రాజ్ రామాయణం గురించి చేసిన వ్యాఖ్యలు చినికి చినికి గాలివానగా మారుతున్నాయి. రాముడు ఉత్తరాది కూలీ అని, దక్షిణాదికి వలస వచ్చాడని దుర్మార్గపు వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలో పలు ప్రాంతాలలో ఆయనపై రామభక్తులు కేసులు వేస్తున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డ్ సభ్యులు భానుప్రకాశ్ రెడ్డి సైతం ప్రకాశ్ రాజ్‌పై పరువునష్టం దావా వేసి, లీగల్ నోటీసులు పంపారు. ఆయన సహ నటీనటులు ప్రకాశ్ రాజ్ వ్యాఖ్యలను ఖండిస్తున్నారు. మరికొందరైతే ప్రకాశ్‌రాజ్ నటిస్తున్న సినిమాలను బాయ్‌కాట్ చేయాలని పిలుపు నిస్తున్నారు. ప్రకాశ్ రాజ్‌ను సినిమాల నుండి తొలగించాలని సోషల్ మీడియా వేదికగా కోరుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రముఖ నటుడు, నిర్మాత, జనసేన శాసనమండలి సభ్యులు నాగబాబు సైతం ప్రకాశ్ రాజ్ వ్యాఖ్యలపై పరోక్షంగా స్పందించారు. ట్విట్టర్ వేదికగా ఆయన తన మనసులోని భావాలను వ్యక్తం చేశారు. 'శ్రీరాముడు కేవలం హిందువుల దేవుడు మాత్రమే కాదు. ఆయన ధర్మానికి ప్రతీక. ఆయనను అవమానించడం లేదా తగ్గించాలని చూడటం ధైర్యం కాదు... అహంకారం! మానసిక అంధత్వం వల్ల జరిగే పొరపాటు అది' అని అన్నారు.రాముడిని ఎగతాళి చేసేవారు తమని తాము



నష్టపర్చుకుంటున్నారని, అజేయమైన ధర్మాన్ని కాపాడే శక్తులు నిరంతరం పని చేస్తుంటాయని నాగబాబు అభిప్రాయ పడ్డారు. చరిత్రలో న్యాయానికి వ్యతిరేకంగా నిలిచినవారు పతనమయ్యారని, అదే విధంగా రాముడిపై విషం చిమ్మే వారి భవిష్యత్తు కూడా అదే అవుతుందని నాగబాబు అన్నారు. 'రాముడి పేరే ఓ కవచమని, ఆయన కథ ఖడ్గమని, ఆయన ఉనికి నాగరికతకు అచంచలమైన కోట' అని నాగబాబు ఆ పోస్ట్‌లో పేర్కొంటూ, ఇన్ డైరెక్ట్‌గా ప్రకాశ్ రాజుకు స్ట్రాం÷-రగ్ కౌంటర్ ఇచ్చారు. తాజాగా ప్రకాశ్ రాజ్‌ను ఉద్దేశించి నాగబాబు మరో ట్వీట్‌ను పోస్ట్ చేశారు. 'ప్రకాశ్ రాజ్‌గారూ మీరు... నాస్తికుడినని చెప్పారు. అయితే మీ తల్లి అంత్యక్రియలను ఆవిడ విశ్వాసాన్ని పరిగణనలోకి తీసుకుని క్రైస్తవ పద్ధతిలో మీరు నిర్వహించారు. అది కొడుకుగా మీ బాధ్యత అని మేం గౌరవించాం. అదే భావనతో మీరు కోట్లాదిమంది నమ్మకాన్ని గౌరవించాలి. నాస్తికత్వం అంటే దేవుళ్ళను లేదా విశ్వాసాలను ఎగతాళి చేయడం కాదు. అది ఒక తార్కిక ఆలోచనా విధానం. హిందూమతం మాత్రమే నాస్తికత్వాన్ని కూడా ఓ తాత్విక ఆలోచనగా అంగీకరిస్తుంది. అలాంటి సంప్రదాయాన్ని నిర్లక్ష్యం చేయడం తార్కికత కాదు... అగౌరవపర్చడం. ఇతర దేశాల్లో అయితే ఇలాంటి మాటలు చెప్పినందుకు మీరు తీవ్రమైన ఇబ్బందులకు లోనయ్యేవారు. నేను మీ గురించి చేస్తున్న చివరి వ్యాఖ్య ఇదే. ఇక మీదట మీతో వాదించను' అని నాగబాబు తెలిపారు. మరి దీనిపై ప్రకాశ్ రాజ్ ఎలా స్పందిస్తాడో చూడాలి.

# పునర్వికకు పునర్జన్మ.. నూరేళ్లు జీవించు చిట్టితల్లీ

## ఖరీదైన ఇంజక్షన్‌కు లోకేశ్ సాయం

అమరావతి,ఏప్రిల్18: అరుదైన స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ (ఎస్ఎంఏ టైప్-1) వ్యాధితో బాధపడుతున్న కర్నూలుకు చెందిన పునర్విక అనే చిన్నారికి శనివారం వైద్యులు రూ.16 కోట్ల విలువైన ఇంజెక్షన్ చేసినట్లు మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. ఈ మేరకు తాను ఇచ్చిన హామీ నెరవేరిందంటూ 'ఎక్స్'లో ఆయన పోస్టు పెట్టారు. అరుదైన వ్యాధితో బాధపడుతున్న ఈ చిన్నారికి ఇంజెక్షన్ కోసం రూ.16 కోట్లు అవసరమైన విషయం తెలిసిందే. దాతలు స్పందించి రూ.10 కోట్లు మేర సమకూర్చగా.. చిన్నారి తల్లిదండ్రులు 'ఎక్స్'లో చేసిన అభ్యర్థనకు స్పందించిన మంత్రి నారా లోకేశ్ . మిగతా రూ.6 కోట్లు సమకూర్చడం తన బాధ్యత అని ఆ కుటుంబానికి ఫిబ్రవరిలో హామీ ఇచ్చారు. ఈ మేరకు విదేశాల నుంచి జోల్ జెన్ స్మా ఇంజెక్షన్‌ను లోకేశ్ తెప్పించగా.. ఆయన సమక్షంలోనే హైదరాబాద్‌లోని రెయిన్‌బో ఆసుపత్రిలో వైద్యులు శనివారం పునర్వికకు ఇంజెక్షన్ చేశారు. ఈ నేపథ్యంలో 'నా హామీ నెరవేరింది. పునర్వికకు ఈ రోజు ఇంజెక్షన్ చేశారు. నూరేళ్లు జీవించు చిట్టి తల్లీ' అని పేర్కొంటూ లోకేశ్ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. తమకు అండగా నిలిచి, తమ పాప ప్రాణాల్ని కాపాడేందుకు సాయం చేసిన మంత్రి లోకేశ్‌కు చిన్నారి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల సోషల్ మీడియాలో పునర్వికను బతికించాలని డొనేషన్స్ పేరుతో మహా యజ్ఞమే జరిగింది. ఎట్టకేలకు ప్రభుత్వం సైతం దిగి వచ్చింది. సోషల్ మీడియాలో



వచ్చిన డోనేషన్‌తో పాటు ప్రభుత్వం సహాయం చేసిన విషయం తెలిసిందే. ముఖ్యంగా మంత్రి నారా లోకేష్ ముందుకు వచ్చారు. ఇంజక్షన్ అమెరికా నుంచి హైదరాబాద్ తెప్పించడానికి సాయం చేశారు. రూ. 16 కోట్లలో రూ. 10 కోట్ల విరాళాలు సేకరించగా.. మిగిలిన రూ.6 కోట్లు సమీకరించారు. పుర్విక భవిష్యత్తుకు సైతం హామీ ఇచ్చారు. కర్నూలు జిల్లా వెల్దుర్తికి చెందిన జంపాల మంగలి సురేశ్‌కుమార్, పుష్పావతి దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తె పునర్వికశ్రీ 2025 మే 12న జన్మించింది. పునర్విక ఆరు నెలలైన తన శరీరాన్ని కదిలించలేక పోయింది. దీంతో కంగారు పడిన పేరెంట్స్ సమీప కర్నూలు ఆసుపత్రుల్లో చికిత్స చేయించారు. ఆ డాక్టర్ల సిఫార్స్ మేరకు హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ హాస్పటల్‌కు తీసుకెళ్లారు.. చిన్నారిని పరిస్థితి, రిపోర్ట్స్‌ను పూర్తిగా పరిశీలించిన వైద్యులు అరుదైన సమస్యను గుర్తించారు. స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ అనే జన్యుపరమైన సమస్య ఉందని స్పష్టం చేశారు. అది వెన్నెముకలోని నరాల కణాలను దెబ్బతీసే ఒక జన్యుపరమైన వ్యాధి. ఇది కండరాల బలహీనత, క్షీణతకు దారితీస్తుంది. ఈ వ్యాధి వల్ల నడక, శ్వాస, మింగడం, కదలికలు కష్టమవుతాయి. ఇది తరచుగా పిల్లలలో కనిపిస్తుంది. దీనికి న్యూసినెర్సెన్, జో÷-జలెన్స్మా, రిస్డిఏ÷-లామ్ వంటి చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. అయితే.. ఒక్క ఇంజెక్షన్ విలువ రూ. 16 కోట్లు ఉంటుంది. ఆ ఇంజెక్షన్ ద్వారా పునర్విక బతుకుతుందట. ఇక ఆ పాప బతకాలంటే రూ.16 కోట్ల విలువైన ఇంజెక్షన్ అవసరమని ఓ ఇన్స్టాగ్రామ్ కంటెంట్ క్రియేటర్ గతంలో ఓ వీడియో రిలీజ్ చేశాడు. దీంతో తెలుగు యువత ఒక్కసారిగా ముందుకు వచ్చింది. ప్రభుత్వం సైతం స్పందించడంతో పునర్విక ప్రాణం నిలబడింది.

# దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురి అరెస్ట్

## విలువైన బంగారం, వెండి ఆభరణాలు స్వాధీనం

## జిల్లా ఎస్పీ బిందు మాధవ్ వెల్లడి

కాకినాడ,ఏప్రిల్18: ఇంటి నేరాలకు పాల్పడుతున్న ఒక దొంగను, అలాగే మోటార్ సైకిల్ దొంగతనాలకు పాల్పడుతున్న మరో



ఇద్దరు దొంగలను కాకినాడ జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.25 లక్షల ముప్పై వేలకు పైగా విలువైన 117 గ్రాముల బంగారం, 629 గ్రాముల వెండి అభరణాలు, 1 లక్ష 95 వేల నగదు ఐదు లక్షలు ఆరు విలువైన ఆరు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు కాకినాడ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ జి బిందు మాధవ్ తెలిపారు. అలాగే కాకినాడ జిల్లాలో కాకినాడ వన్ టౌన్, టూ టౌన్, కోరంగి, సామర్లకోట పోలీస్ స్టేషన్ ప్రాంతాలలో జరిగిన పది కేసులను ఛేదించి ఐదుగురు నిందితులను అరెస్టు చేసినట్లు ఆయన వెల్లడించారు. శనివారం కాకినాడలోని జిల్లా పోలీస్ కార్యాలయం లో ఎస్పీ బిందు మాధవ్ విలేకరులతో సమావేశం నిర్వహించి కేసులు వివరాలు వెల్లడించారు. కాకినాడ ఏటిమొగకు చెందిన రేకాడి వెంకటేశ్వర్లు అనే వ్యక్తిపై కాకినాడ పోర్ట్ పోలీసు స్టేషన్లో కేసు ఉన్నదని శనివారం కోరంగి వంతెన వద్ద ఉండగా ఎస్సై పి సత్యనారాయణ అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. అలాగే మోటార్ సైకిల్ దొంగతనాలుకు పాల్పడుతున్న కాకినాడ రామారావు పేటకు చెందిన వనమాడి జానకిరామ్, మాడుగుల మండలం సత్యవరం గ్రామానికి చెందిన రేఖ సతీష్ అనే ముద్దాయిలను సామర్లకోట కాకినాడ రోడ్డులో ఈరోజు ఉదయం సామర్లకోట సీఐ ఎ కృష్ణ భగవాన్ అరెస్టు చేశారని వీరి నుంచి రూ.ఐదు లక్షల విలువైన ఆరు మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ ముద్దాయిలు తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తించి తాళాలు పగలగొట్టి ఇంటిలో ప్రవేశించి దొంగతనాలకు పాల్పడుతుంటారని చెప్పారు. కోర్టులో ముద్దాయిలను హాజరు పరిచినట్లు వెల్లడించారు. ప్రజలు బయటకు వెళ్లేటప్పుడు తాళాలు బయటకు కనపడేలా వేసి ఉంచవద్దని ఆ తాళాలను అక్కడే దాచవద్దని పోలీసులు సూచించారు.

అలాగే ఊరికి వెళుతున్న వారు దగ్గర్లో ఉన్న పోలీస్ స్టేషన్ కు తెలియజేస్తే వారు ఎల్హెచ్ఎంఎస్ అనే పరికరాన్ని అమర్చి దొంగతనాలు జరగకుండా కాపాడుతారన్నారు. విలువైన వస్తువులను బ్యాంకు లాకరులలో దాచుకోవాలని, అవకాశం ఉన్నంతవరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ బిందు మాధవ్ సూచించారు. ఈ సమావేశంలో కాకినాడ డిఎస్పి మనీష్ దేవరాజ్ పాటిల్, ఎస్బి డిఎస్పి కే వి సత్యనారాయణ, సిసిఎస్ ఇన్స్పెక్టర్ వి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు. కేసులు సాధనలోను ముద్దాయిలని పట్టుకోవ దంలో ప్రతిభ కనబరిచిన సిబ్బందిని ఎస్పీ బిందు మాధవ్ అభినందించారు.

# ప్రకాశ్ రాజ్‌పై వందకోట్లకు పరవునష్టం

## కేసు దాఖలు చేసిన టిటిడి బోర్డ్ సభ్యుడు భాను

తిరుపతి,ఏప్రిల్18: నటుడు ప్రకాశ్ రాజ్‌పై టీటీడీ బోర్డు మెంబర్ భాను ప్రకాశ్ రెడ్డి పరువు నష్టం దావా వేశారు. రామలక్ష్మణులపై వివాదాస్పద వ్యాఖ్యలు చేయడంపై నటుడు ప్రకాశ్ రాజ్‌పై రూ.100 కోట్లకు దావా వేశారు. భాను ప్రకాశ్



తరఫు న్యాయవాది.. ప్రకాశ్ రాజ్‌కు లీగల్ నోటీసులు పంపించారు. హిందువుల మనోభావాలు కించపరిచేలా ఆయన వ్యాఖ్యలు చేశారని భాను ప్రకాశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజుల్లోగా హిందువులకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఓ ప్రైవేట్ ఈవెంట్‌లో రామ లక్ష్మణులపై ప్రకాశ్ రాజ్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. రామలక్ష్మణులు ఉత్తరభారతదేశం నుంచి వచ్చిన వలస కూలీలు అంటూ వ్యాఖ్యానించారు. ఉత్తరభారత దేశానికి చెందిన రామలక్ష్మణులు.. దక్షిణాదికి చెందిన రావణుడి పొలంలో పండ్లను దొంగతనం చేశారని అన్నారు. అయితే రామలక్ష్మణులను వలస కూలీలు అంటూ ప్రకాశ్ రాజ్ చేసిన వ్యాఖ్యలపై హిందూ సంఘాలు తీవ్రంగా మండిపడుతున్నాయి.

# మాదక ద్రవ్య రహిత సమాజం కోసం పోరు

## ఐద్వా రాష్ట్ర కార్యదర్శి పిలుపు

కర్నూలు,ఏప్రిల్18: గంజాయి మాదకద్రవ్యాల రహిత సమాజం కోసం కలిసి పోరాడాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి బి సావిత్రి పిలుపునిచ్చారు. శనివారం సుందరయ్య భవన్ లో జరిగిన జిల్లా కమిటీ సమావేశానికి జిల్లా అధ్యక్షురాలు శ్యామల అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి సావిత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో యువత డ్రగ్స్ కి మద్యనీ అలవాటయ్యి మహిళల పైన హత్యలు, మానభంగాలు దాడులు చేస్తున్నారని విమర్శించారు. నెల్లూరు, కడప, విశాఖ, మదనపల్లి, కర్నూలు జిల్లాలో, ఇలా చెప్పుకుంటూపోతే రాష్ట్రవ్యాప్తంగా కూడా అనేక హత్యలు మహిళలపైన ఎక్కువ జరుగుతున్నాయి. ఒక్క నెలలో 18 కేసులు అత్యాచారాలకు మర్డర్లకి మహిళలు గురయ్యారు .దీనిని అరికట్టడానికి ప్రభుత్వాలు విఫలమయ్యాయి. ఏ రాజకీయ పార్టీలోఉన్న నాయకులు డ్రగ్స్ మాఫియాకుఅండగా ఉంటారో వారిని ఆ పార్టీ ప్రజా ప్రతినిధులకు గాని పార్టీ సభ్యత్వానీ నుండి తొలగించాలని పార్టీ సభ్యత్వాన్ని రద్దు చేయాలి. వాళ్లపైన పార్టీలు కఠినమైన చర్యలు తీసుకోవాలని కూడా డిమాండ్ చేస్తుంది. మద్యాన్ని కంట్రోల్ చేయాల్సిన ప్రభుత్వాలే నాణ్యమైన మద్యాన్ని అందిస్తామని ఎన్నికల ముందు ప్రచారం చేశారు,ఇది సరైనది కాదని తెలియజేశారు. ఏదైనా యువతకు నాణ్యమైన విద్య నాణ్యమైన ఆహారము నాణ్యమైన వైద్యం అందించాలని ఐద్వా డిమాండ్ చేసింది.మహిళలకుఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కూటమి ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. మద్యం, డ్రగ్స్ , కంట్రోల్ చేసి యువతకు మంచి భవిష్యత్తు అందించాలని మహిళల మానప్రాణాలను కాపాడాలని అన్నారు. కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని పరువు హత్యలు ఎక్కువైనాయని చిన్న పిల్లలకి ఎక్కడ రక్షణ లేకుండా పోయిందని ఇవన్నీటికీ పూర్తి బాధ్యత ప్రభుత్వం తీసుకొని ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసి అగత్యాలకు పాల్పడిన వాళ్ళని కఠినంగా శిక్షించాలని విమర్శించారు. భవిష్యత్తులో ప్రజలందరూ గంజాయి, డ్రగ్స్ మాదకద్రవ్యాల పైన కలిసి వచ్చే సంఘాలతో కలిసి వచ్చే మేధావులు అందరిని కలుపుకొని ఆందోళనకు సిద్ధమవుతమన్నారు. ప్రజా సంఘాలు మద్యానికి డ్రగ్స్ కి వ్యతిరేకంగా ప్రచారం చేయాలని ఇది ప్రతి ఒక్కరి బాధ్యత గా స్వీకరించాలని తెలియజేశారు.

# విజేత హై స్కూల్ లో ఘనంగా పట్టభద్రుల దినోత్సవం

నారాయణఖేడ్, ఏప్రిల్ 18:( సాక్ష్యం న్యూస్ ): విద్యార్థుల పరీక్షలు పూర్తయి నూతన ఉత్తేజంతో ఉన్నత తరగతిలోకి వెళుతున్న సందర్భంగా నారాయణఖేడ్ విజేత హై స్కూల్ ప్రిన్సిపల్ ఎం.





శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం పట్టభద్రుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఎం. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ..విద్యార్థులు తమ లక్ష్యాలను స్పష్టంగా నిర్ణయించుకుని క్రమశిక్షణతో చదువుతూ ముందుకు సాగాలని సూచించారు. పట్టుదల, సమయ పాలన, కష్టపడి చదవడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయుల సహకారంతో విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని అన్నారు. ఇలాంటి ప్రోత్సాహక కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, భవిష్యత్తులో మంచి పౌరులుగా ఎదగడానికి దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఐదు రోజుల శిక్షణకు ముగింపు

## వార్డు సభ్యులకు సర్టిఫికెట్లు అందజేత

## టేక్మాల్ మండలంలో తొలి విడత శిక్షణ పూర్తి

టేక్మాల్, ఏప్రిల్ 18 (సాక్ష్యం న్యూస్): టేక్మాల్ మండలంలోని వివిధ గ్రామపంచాయతీల వార్డు సభ్యులకు ఐదు రోజులుగా ఎంపీడీఓ సమావేశ మందిరం లో కొనసాగిన శిక్షణ





కార్యక్రమం శనివారంతో ముగిసింది. ప్రజా పాలనా కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ శిక్షణలో పెద్ద సంఖ్యలో వార్డు సభ్యులు పాల్గొని తమ బాధ్యతలపై అవగాహన పెంపొందించుకున్నారు. శిక్షణలో పాల్గొన్న వార్డు సభ్యులకు ముగింపు సందర్భంగా సర్టిఫికెట్లు అందజేశారు. గ్రామాభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారం, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలపై శిక్షణ ఇచ్చినట్లు మండల అధికారులు తెలిపారు. మండలంలోని పలు గ్రామపంచాయతీల వార్డు సభ్యులకు తొలి విడత శిక్షణ విజయవంతంగా పూర్తయిందని, ఇంకా మిగిలిన పంచాయతీల వార్డు సభ్యులకు త్వరలోనే తదుపరి విడతల్లో శిక్షణలు నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు.

# డీలిమిటేషన్‌కు మహిళా బిల్లు ముసుగు

## దక్షిణాదిని దెబ్బతీసే కుట్ర విఫలం

## బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్

హైదరాబాద్,ఏప్రిల్18( : నియోజకవర్గాల పునర్విభజన కోసం కేంద్రం ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు పార్లమెంట్‌లో దక్షిణ భారతదేశ ప్రాధాన్యాన్ని తగ్గిస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంటు ఇప్పటికే 2023లో ఆమోదించిందని, ఆ బిల్లుకు నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియతో ముడిపెట్టాల్సిన అవసరమే లేదని వ్యాఖ్యానించారు. నియోజక వర్గాల పునర్విభజనకు 2011 జనాభా లెక్కలను పరిగణలోకి తీసుకున్నా, తాజా జనాభా గణనను ప్రాతిపదికగా తీసుకున్నా దక్షిణ భారతదేశం తీవ్రంగా నష్టపోతుందని కేటీఆర్ అన్నారు. ఈ విషయం కేంద్రంలోని పాలకులకు కూడా బాగా తెలుసని చెప్పారు. రాజ్యాంగ సవరణకు అవసరమైన మూడింట రెండు వంతుల మెజారిటీని తాజా బిల్లు పొందలేదని స్పష్టంగా తెలిసినప్పటికీ, మోదీ ప్రభుత్వం బిల్లును ప్రవేశపెట్టిందని విమర్శించారు. పార్లమెంటులో దక్షిణ భారతదేశ గళాన్ని అణచివేస్తున్న తీరుపై బిఆర్ఎస్ తరపున తాము తీవ్ర ఆందోళనను, నిరసనను వ్యక్తంచేస్తున్నామని కేటీఆర్ చెప్పారు. మహిళా రిజర్వేషన్లకు సంబంధించిన బిల్లు ఇప్పటికే ఆమోదం పొందింది కాబట్టి, ఈ దేశ మహిళలకు ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. మహిళా రిజర్వేషన్‌ను అమలు చేయాలనుకుంటే ప్రస్తుతం ఉన్న 543 స్థానాలతోనే అమలు చేయవచ్చని చెప్పారు. పార్లమెంటులో దక్షిణ భారతదేశానికి ప్రస్తుతం 24? స్థానాలు ఉన్నాయని, ఆ 24 శాతం స్థానాలు యథాతథంగా కొనసాగేలా చూడాలని అన్నారు. ఒకవేళ దక్షిణ భారత ప్రాధాన్యాన్ని 24 శాతం కంటే తగ్గిస్తే ఈ దేశ నిర్మాణంలో విశేష కృషిచేసిన దక్షిణ భారత ప్రజల నుంచి తీవ్రమైన నిరసనలు, ఆగ్రహం వ్యక్తమవుతాయని కేటీఆర్ హెచ్చరించారు.

## కాంగ్రెస్ పార్టీ నాడు మహిళా బిల్లును వ్యతిరేకించడం వలనే బాబా సాహెబ్ అంబేద్కర్ రాజీనామా

– జాడి రామరాజు నేత



**ఏటూరునాగారం, ఏప్రిల్ 18, (సాక్ష్యం);** ఏటూరునాగారం మండల కేంద్రం లో బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు డా,, జాడి రామరాజు నేత శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ పార్టీ మహిళా రిజర్వేషన్ ను వ్యతిరేకించడం కొత్తమి కాదన్నారు. అదేవిదంగా 1952లో మొదటి న్యాయ శాఖ మంత్రి బాబా సాహెబ్ అంబేద్కర్ రాజీనామా చెయ్యడానికి రాహుల్ బాబా ముత్తాత జహర్ లాల్ నెహ్రు అన్నారు. నేడు కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ లో భారత దేశ మహిళాలను చట్ట సభలోకి తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ లో బిల్లు ప్రవేశ పెట్టడాన్ని అడ్డుకున్నది కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్ బాబా అన్నారు. అదే విదంగా ఇప్పటికైనా భారత దేశ ప్రజలు మేధావులు పత్రిక మిత్రులు ఆలోచించండన్నారు. కాంగ్రెస్ పార్టీ మహిళా బిల్లు ను అడ్డుకోవడం వలన 73 కోట్ల మహిళలను కించపరిచి కాంగ్రెస్ పార్టీ ఏమి సాధించరాన్నారు. అంతేకాకుండా కాంగ్రెస్ పార్టీ బిల్లును వ్యతిరేకం చేసి సాధించింది ఏమిలేదని అదేవిదంగా మహిళ సాధికారత సాధించడానికి ఇంకో 30 సంత్సరాలు మహిళ లను అభివృద్ధి కాకుండా అడ్డుకున్నారు. ఇప్పటికైనా ఆదివాసీ దళిత బహుజన మైనార్టీ మహిళ మణులు అలోచించి కాంగ్రెస్ బి ఆర్ ఎస్ పార్టీ లను భూ స్థాపితం చెయ్యడం కోసం మహిళ లు కట్టుబడి పని చెయ్యాలన్నారు. బి ఆర్ ఎస్ నాయకులు కెసిఆర్ కుమారుడు కేటీఆర్ మహిళా ను మహిళాబిల్లులు ఇష్టం వచ్చినట్టు మాట్లాడకుండా ముందుగా నీ ఇంట్లో మీ చెల్లకి న్యాయం చెయ్యని మీరు మహిళా బిల్లు గురించి మాట్లాడం సిగ్గు చేటని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు డా జాడి రామరాజు నేత అన్నారు.

## డీఎస్పీగా ఎంపికైన ప్రవీణ్ కుమార్‌కు సన్మానం



**ఏటూరునాగారం, ఏప్రిల్ 18,:( సాక్ష్యం) ;** గ్రూప్–1 ఫలితాల్లో సత్తా చాటి డీఎస్పీ స్థాయికి ఎంపికై, ప్రస్తుతం శిక్షణ పొందుతున్న ఏటూరునాగారం వాసి దైనంపల్లి ప్రవీణ్ కుమార్‌ను ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు, ఏటూరునాగారం సర్పంచ్ కాకులమర్రి శ్రీలత శాలువతో సన్మానించారు. హైదరాబాద్‌లోని తమ నివాసానికి శనివారం ప్రవీణ్ కుమార్‌ను ఆహ్వానించిన వారు ఆయన సాధించిన విజయాన్ని అభినందిస్తూ శాలువా కప్పి గౌరవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతో కష్టపడి డీఎస్పీగా ఎంపికై శిక్షణ పొందుతున్న దైనంపల్లి ప్రవీణ్ కుమార్ మన ప్రాంతానికి గర్వకారణమని కొనియాడారు. ఉన్నతమైన పోలీస్ అధికారిగా బాధ్యతలు నిర్వహించి మన ఊరికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. దైనంపల్లి ప్రవీణ్ కుమార్ పట్టుదల నేటి యువతకు గొప్ప మార్గదర్శకమని వారు పేర్కొన్నారు. ప్రవీణ్ కుమార్‌కు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని మనస్ఫూర్తిగా శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఘనంగా మూర్తి అయ్యగారి పుట్టినరోజు కార్యక్రమం



**యాదగిరిగుట్ట సాక్ష్యం న్యూస్.** యాదగిరిగుట్ట దేవస్థానం ఉప ప్రధాన అర్చకుడు మూర్తి అయ్యగారి పుట్టిన రోజు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ ఇబ్బంది ఆయనకు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలియజేశారు. యాదగిరిగుట్ట దేవస్థానంలో ఆయన గత అనేక సంవత్సరాలుగా ఎన్ఎంఆర్ గా అర్చకులుగా పనిచేస్తూ ముందుకు సాగుతూ ప్రస్తుతం ఉప ప్రధాన అర్చకులుగా కొనసాగుతున్నారు. ఆయన పుట్టిన రోజు సందర్భంగా ఆయన మిత్రులు, దేవస్థానం ఇబ్బంది వీరికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. 2000 సంవత్సరం నుంచి వారి నాన్నగారు పాతగుట్ట దేవస్థానంలో ప్రధాన అర్చగోలుగా పనిచేయడం జరిగిందని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. ఆయన పుట్టిన రోజు సందర్భంగా దేవస్థానం అర్చకులు, సిబ్బంది ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు.

## సొంత స్థలం మీదికి వచ్చి దౌర్జన్యం చేస్తున్నారని బాధితుడు వేముల శ్రీనివాస్ ఆవేదన





**కోదాడ ఏప్రిల్ 18, (సాక్ష్యం)** తమ సొంత స్థలం పైకి కొంత మంది నాయకులు వచ్చి దౌర్జన్యం చేస్తున్నారని కోదాడ పట్టణానికి చెందిన మెకానిక్ వేముల శ్రీనివాస్ విలేకరుల సమావేశంలో రోధిస్తూ వెల్లడించారు. కోదాడ పరిధిలోని గుడిబండ రోడ్డుకు సర్వేనెంబర్ 552 లో 152 గజాల స్థలం 2008లో గఫూర్ మేస్త్రి వద్ద కొనుగోలు చేశానని స్థలం డాక్యుమెంట్లను చూపించారు. గత 50 ఏళ్లుగా లింకు డాక్యుమెంట్లు తో బ్యాంకు రుణాలు కూడా తీసుకున్నానని ఆయన పేర్కొన్నారు. కాగా తన స్థలం వెనకాల ఉన్న ఈ నాయకులు తమ ప్లాట్లకు మరింత ధర రావాలని దురుద్దేశంతో దారి పేరుతో కబ్జాకు యత్నిస్తున్నారని కన్నీరు మున్నీరయ్యారు. గత మూడు రోజుల క్రితం మున్సిపల్ కార్యాలయం నుండి జెసిబిలను తెప్పించి తన స్థలంలో ఉన్న డబ్బాలను తొలగించారని వెల్లడించారు. కాగా తనకున్న ఆధారాలతో హైకోర్టును ఆశ్రయించగా తన స్థలం వద్దకు వచ్చేందుకు హక్కు లేదని ఇచ్చిన ఇంజక్షన్ ఆర్డర్ ను చూపించారు. ఈ సమావేశంలో 25 వ వార్డు నాయకుడు సయ్యద్ బాబా పాల్గొన్నారు.

## చండూరులో విద్యుత్‌లో ఓల్టేజ్ సమస్యకు పరిష్కారం

కరెంట్ సమస్య తీర్చేందుకు ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు



**చండూరు (సాక్ష్యం )ఏప్రిల్ 18.** మున్సిపాలిటీ పరిధిలోని సర్దార్ కాలనీలో విద్యుత్ లో వోల్టేజి సమస్యకు నూతనంగా అదనపు 100 కె .వి. ఏ విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేసినట్లు మునుగోడు విద్యుత్ శాఖ ఏ.డి.ఈ అశోక్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా చండూరు విద్యుత్ ఏ.ఈ సాయి గణేష్ మాట్లాడుతూ ఓవర్ లోడ్ కారణంగా తరచూ లైన్లు , జంపర్లు కాలిపోవడం జరిగేదని ఈ సమస్యను దృష్టిలో ఉంచుకొని అట్టి కాలనీకి ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎక్కడైనా విద్యుత్ సమస్య ,లో ఓల్టేజ్ సమస్య తలెత్తితే తక్షణమే అధికారులతో సమన్వయం చేసుకొని పరిష్కరిస్తున్నామని ఆయన అన్నారు. ఇట్టి సమస్యను పరిష్కరించినందుకు సర్దార్ కాలనీవాసులు విద్యుత్ అధికారులను అభినందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో చండూరు టౌన్ లైన్ మాన్ షరీఫ్ పాషా, లైన్ ఇన్ స్పెక్టర్ ముత్తయ్య ,చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

## మన సంస్కృతికి చిహ్నాలు మన కవులు

– ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా బమ్మెర పోతనకు ఘన నివాళి అర్పించిన జిల్లా కలెక్టర్ సత్య శారద





**వరంగల్ కరెస్పాండంట్ 18 ఏప్రిల్ (సాక్ష్యం)** ప్రపంచ వారసత్వ దినోత్సవాన్ని పురస్కరించుకుని వరంగల్ జిల్లాలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు సాహిత్య శిఖరం, సహజ కవి బమ్మెర పోతనను స్మరించుకుంటూ జిల్లా కలెక్టర్ ఘనంగా నివాళులర్పించారు. నగరంలోని పోతన ఆడిటోరియంలో కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, తొలుత బమ్మెర పోతన విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మన సంస్కృతికి మూలస్తంభాలైన కవులను గౌరవించుకోవడం మన బాధ్యత అని ఆమె ఈ సందర్భంగా పేర్కొన్నారు. మన వారసత్వ సంపదను భావి తరాలకు అందించడంలో ఇలాంటి సాహిత్య కార్యక్రమాలు కీలకమని అన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలు చారిత్రక కట్టడాలే మన నిజమైన ఆస్తి. వీటిని కాపాడుకోవడంలో విద్యార్థుల పాత్ర చాలా కీలకం అన్నారు. విద్యార్థులు చిన్నతనం నుంచే మన గొప్ప వారసత్వంపై అవగాహన పెంచుకోవాలని చెప్పారు. ప్రపంచ వారసత్వ దినోత్సవం రోజున పోతన వంటి మహనీయుడిని స్మరించుకోవడం మనందరికీ గర్వకారణమని కలెక్టర్ తెలిపారు. ఈ వేడుకల్లో వివిధ పాఠశాలల నుండి వచ్చిన విద్యార్థులు అలరించిన విద్యార్థుల పద్య పఠనంలో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. పోతన రచించిన భాగవత పద్యాలను విద్యార్థులు మధురంగా ఆలపించి సభికులను ముగ్ధులను చేశారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ పాండురంగారావు , శ్రీధర్ రావు కో కన్వీనర్ తో పాటు పలువురు విద్యావేత్తలు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, సాహిత్య అభిమానులు జిల్లా అధికారులు పాల్గొన్నారు..

## నీటిపారుదల శాఖ ఆస్తులు జప్తు చేసిన రంగారెడ్డి కోర్టు

– కాంట్రాక్టర్‌కు బిల్లుల చెల్లింపులో ఆలస్యం – వరంగల్ కోర్టు ఆదేశాలు బేకాతర్ చేసిన ఇరిగేషన్ శాఖ

– కోర్టులో డిపాజిట్ చేయాలన్న అలసత్వం ప్రదర్శించిన అధికారులు

– కరీంనగర్ ఎల్ఎండి నిజామాబాద్ పోచంపాడు కార్యాలయాల్లోని ఆస్తులు జప్తు చేయాలని ఆదేశం




**హనుమకొండ 18 ఏప్రిల్ (సాక్ష్యం)** వరంగల్ శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్ కాకతీయ కెనాల్ సంబంధించి పూర్తిచేసిన పనులకు కూడా బిల్లులు చెల్లించకుండా అలసత్వం ప్రదర్శించడంపై రంగారెడ్డి కోర్ట్ ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు ఆ కార్యాలయం ఆస్తులు జప్తు చేసే విధంగా ఆదేశాలు జారీ చేసింది. కరీంనగర్ ఎల్ ఎం డి నిజామాబాద్ పోచంపాడ్ నీటిపారుదల శాఖ కార్యాలయంలోని ఆస్తులు పై జప్తు చేయాలని ఆదేశించింది. వెంకటేశ్వర ఇంజనీర్స్ అండ్ కాంట్రాక్టర్స్ పేరుతో దాదాపు 16 కోట్ల పనులు చేసింది. ఈ బిల్లుల చెల్లింపు విషయంలో నీటిపారుదల శాఖ నిర్లక్ష్యం చేసింది దీంతో పనులు చేసిన కంపెనీ వరంగల్ కోర్టును ఆశ్రయించింది పూర్తిస్థాయిలో విచారణ చేసిన వరంగల్ కోర్ట్ బిల్లు చెల్లింపులపై డబ్బులను కోర్టులో డిపాజిట్ చేయాలని ఆదేశాలు జారీ చేసింది అయినప్పటికీ కూడా కోర్టులో నీటిపారుదల శాఖ అధికారులు డబ్బులు డిపాజిట్ చేయకుండా నిర్లక్ష్యం చేసారు. దీంతో నీటిపారుదల శాఖకు సంబంధించి సమస్యలను పరిశీలిస్తున్న రంగారెడ్డి కోర్టుకు వెళ్లిన కాంట్రాక్టర్ కు అనుకూలంగా తీర్పునిస్తూ నీటి పారుదల శాఖ అధికారులు కావాలని నిర్లక్ష్యం చేస్తున్నారని 50 లక్షలు విలువచేసే రెండు కార్యాలయాలలోని మూవబుల్ ఆస్తులు జప్తు చేయాలని న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. దీంతో కరీంనగర్లోని ఎల్ఎండి కార్యాలయం నిజామాబాదు నుండి కార్యాలయంలో కోర్టు ఆదేశాల మేరకు సిబ్బంది కార్యాలయంలోని ఫర్నిచర్ తో పాటు 24ఏసీలు 2కార్లు జప్తు చేసేందుకు అనుమతులు ఇచ్చింది.. ఈ తీర్పుతో షాక్ తిన్న ఉన్నతాధికారులు డిపాజిట్ చేసే ప్రయత్నంలో ఉన్నట్టు తెలుస్తుంది ఒకటి రెండు రోజుల్లో ఇది జరగకపోతే రెండు కార్యాలయంలోని ఆస్తులను కోర్ట్ సిబ్బంది జప్తు చేస్తారు.

## రూల్స్ పాటించి గమ్యస్థానాలకు చేరుకోండి

– ట్రాఫిక్ అదనపు డీసీపీ ప్రభాకర్ రావు



**హనుమకొండ 18 ఏప్రిల్ (సాక్ష్యం)** ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని ట్రాఫిక్ అదనపు డీసీపీ తెలిపారు. కాజీపేట ట్రాఫిక్ పోలీసులు రోడ్డు ప్రమాదాల నివారణను ప్రధాన ధ్యేయంగా తీసుకుని నిర్వహిస్తున్న "అరైవ్ అలైవ్" కార్యక్రమంలో భాగంగా కాజీపేట ట్రాఫిక్ పోలీసులు వినూత్న అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సుబేదారి అదాలత్ సెంటర్లో హెల్మెట్ ధరించని వాహనదారులకు అవగాహన కల్పించేందుకు యమధర్మరాజు, చిత్రగుప్తుడి వేషధారణలో ఉన్న కానిస్టేబుళ్లు రహదారులపై ప్రచారం నిర్వహిస్తూ వాహనదారుల దృష్టిని ఆకర్షించి, హెల్మెట్ ధరించాల్సిన అవసరాన్ని స్పష్టంగా తెలియజేసింది. ట్రాఫిక్ నియమాలను పాటించకపోతే ఎదురయ్యే ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అదనపు డీసీపీ ప్రభాకర్ రావు మాట్లాడుతూ, "రోడ్డు ప్రమాదాలు అనేవి క్షణాల్లో ప్రాణాలను కోల్పోయే ప్రమాదకర సంఘటనలు. వాటిని నివారించాలంటే ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలి. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం తమ ప్రాణ రక్షణకు అత్యంత కీలకం. అలాగే కారులో ప్రయాణించే వారు సీట్‌బెల్ట్ ధరించడం అలవాటు చేసుకోవాలి. ట్రాఫిక్ నియమాలు మన భద్రత కోసం రూపొందించబడ్డాయి కాబట్టి వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయకూడదు" అని తెలిపారు. అదేవిధంగా, "ప్రతి ఒక్కరూ క్షేమంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవడం మా లక్ష్యం. 'అరైవ్ అలైవ్' కార్యక్రమం ద్వారా ప్రజల్లో అవగాహన పెంపొందించి రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు కృషి చేస్తున్నాము. ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించి ట్రాఫిక్ నియమాలను పాటిస్తేనే ఈ లక్ష్యం సాధ్యమవుతుంది" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, కాజీపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకన్నతో పాటు ఇతర ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మేడారంలో దందాల పై అధికారులు నిఘా పెంచాలి

– మల్యాల మనోహర్ ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి



**తాడ్వాయి, ఏప్రిల్ 18, ( సాక్ష్యం) ;** ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతర, కోరిన కోరికలు తీర్చే కొంగు బంగారంగా ప్రసిద్ధి చెందిన మేడారం సమ్మక్క సారలమ్మ జాతర ప్రధాన పూజారి పేరుతో చేసే అరాచకాలకు హద్దు అదుపు లేకుండా సమ్మక్క తల్లి పేరు ప్రతిష్టలకే భంగం కలిగించేలా ప్రవర్తిస్తున్న సిద్దబోయిన జగ్గారావును ప్రధాన పూజారి పదవి నుండి తొలగించాలని ధర్మసామాజ్ పార్టీ ప్రధాన కార్యదర్శి మనోహర్ ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో ఇలా పేర్కొన్నారు. మేడారం ప్రధాన పూజారి సిద్ధబోయిన జగ్గారావు అతని అనుచరుడు గిరిజనేతరుడైన ముదురుకోల సదానందం అనే వ్యక్తులు స్థానిక గిరిజనుడైన మల్లెల లింగరాజు భూమి కబ్జాకు ప్రయత్నిస్తూ తన అనుచరులతో బెదిరింపులకు గురి చేస్తూ భయభ్రాంతులకు పాల్పడుతున్నారని డిసెంబర్ 8 వ తేదీ 2025 లో తన అనుచరుడైన ముదురుకోల్ల సదానందం మాకు సంబంధించిన భూమిని అక్రమంగా రెంటుకి ఇచ్చి అడ్డుకోబోయిన భూయజమానుల పై స్థానికులతో దాడి చేయించడానికి బెదిరింపులకు గురి చేయడం జరిగిందని ములుగు జిల్లా ఎస్పీ ఆఫీసులో, డిఎస్పీ ఆఫీసులో పిర్యాదు ఇవ్వడం జరిగింది. పిర్యాదు ఇచ్చి 4 నెలలు గడిచినా ఇంతవరకు నిందితుల పై ఎలాంటి చర్యలు తీసుకోలేదు స్థానిక ఎమ్మెల్యే మంత్రి సీతక్క ఆదివాసి బిడ్డ స్పందించి బాధితులకి న్యాయం చేయాలని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పిలుపునివ్వడం జరిగింది. ఇప్పటివరకు పేదలకు న్యాయం చేయాల్సిన జిల్లా యంత్రాంగం పోలీసులు చర్యలు తీసుకోకపోవడానికి కారణం ఏమిటని, మంత్రి సీతక్క అండదండలతోనే మేడారంలో ఇన్ని దందాలు చేస్తున్నారా అనే కోణంలో అనుమానం వ్యక్తపరిచారు. అంతేకాకుండా గ్రామపంచాయతీకి ప్రభుత్వానికి ఆదాయం రాకుండా టెండర్ల నిర్వహణ ఒకే వ్యక్తి చేతిలో ఉండడానికి గల కారణం ఎవరు. 251 కోట్ల అభివృద్ధి పనులలో రోడ్డు వెడల్పుల్లో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వకుండా అధికారులకు మంత్రులకు చెడు పేరు తెచ్చే విధంగా రైతుల పేర్లు బయట పెట్టకుండా ఉన్న ప్రధాన పూజారి. తరతరాలుగా వస్తున్న వనం దేవర ను అవమానించి వనంగుట్ట నుంచి రావాల్సిన వనం ను చరిత్రను సాంప్రదాయాన్ని విస్మరించి వేరే గుట్ట నుంచి తీసుకురావడం, మేడారంలో కొన్ని ఇల్లు బఫర్ జోన్ లో ఉన్నాయి వాటిని తీసివేయాలని నోటీసులు ఇవ్వడం వారి అభివృద్ధిని ఓర్వలేని ఓ పెద్దమనిషి చేసిన పని అని స్థానికులు ఆరోపణలు. 30 ఎకరాల ఫారెస్ట్ భూమిని ఆక్రమించిన జిల్లా అటవీ శాఖ అధికారి స్పందించక పోవడం కోర్టు ఆర్డర్ ను సైతం లెక్క చేయకపోవడం పూజారులు వారి వంశపారంపర్య ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ను పరిశీలించిన తర్వాతనే వారికి హుండీలో వాటా వన్ బై థర్డ్ పంచాలని కోర్టు ఆర్డర్ ను ధిక్కరించడం, స్థానిక గిరిజన పూజారుల ఆడబిడ్డలు కొబ్బరికాయలు అమ్ముకోవాలన్న పూజార్ల సంఘానికి ఒకరికి 5000 చొప్పున వసూలు చేయడం ఇన్ని దందాలు జరుగుతున్న ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవట్లేదు, జిల్లా స్థాయి ప్రజా ప్రతినిధులు ఎవరో అతని వెనుక ఉండి నడిపిస్తున్నారని కోణంలో స్థానికుల ఊహాగానాలు గిరిజనుల మధ్య ఇన్ని దారుణాలు జరుగుతున్న పేదలను రక్షించాల్సిన జిల్లా యంత్రాంగం కొంత మంది నియంత నిందితులను కాపాడుతున్నారని మనోహర్ మండిపడ్డారు. గ్రామపంచాయతీకి ప్రభుత్వానికి టెండర్ల ద్వారా రావలసిన ఆదాయాన్ని శానిటైజేషన్ అభివృద్ధి పనులకు ఉపయోగించే విధంగా టెండర్లు నిర్వహించాలని జిల్లా యంత్రాంగాన్ని ప్రజా ప్రతినిధులను కోరుకుంటున్నాం. జగ్గారావు అరాచకాల పై త్వరగా విచారణ జరిపి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

## తెలంగాణ ఎలక్ట్రికల్ ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శివాజీకి అభినందన



**కోదాడ ఏప్రిల్ 18, (సాక్ష్యం)** తెలంగాణ ఎలక్ట్రికల్ ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా నాలుగోసారి ఎన్నికైన ఎం శివాజీని శనివారం హైదరాబాద్ లో సన్మానించడం జరిగింది. లంబాడి హక్కుల పోరాట సమితి నేషనల్ జనరల్ సెక్రెటరీ భూక్యా కోట్యా నాయక్ ఈ సందర్భంగా శివాజీకి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో గుగులోతు రామారావు ఇస్లావత్ బాలునాయక్ తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలక భూమిక పోషించిన ఎస్. శివాజీ నాల్గవ సారి తెలంగాణ ఎలక్ట్రికల్ ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఆవిర్భవించిన తెలంగాణ ఇంజనీర్స్ అసోసియేషన్ (టీఈ ఈఏ) తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక భూమిక పోషించింది. 2020 సంవత్సరం నుంచి 2014 సంవత్సరం వరకు రాష్ట్రం సాధన కోసం ఉవ్వెత్తున జరిగిన రాష్ట్ర సాధన ఉద్యమంలో శివాజీ ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యోగులు కీలక భూమిక పోషించారు. రాష్ట్రం సాధించుకున్న తర్వాత ప్రతి తెలంగాణ ఉద్యోగికి అండగా ఉంటు విద్యుత్ సంస్థలో అందరిలో ఒకడుగా ఉంటు రాష్ట్రంలోనే తనకంటు ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. రాష్ట్ర విభజన తర్వాత సీమాంధ్ర మూలాలు ఉన్న ఉద్యోగులను ఇక్కడి నుంచి పంపించడానికి విశ్వప్రయత్నం చేశారు. సుప్రీంకోర్టు వరకు వెళ్లారు. తెలంగాణ ఉద్యోగులకు పదోన్నతుల విషయంలో, కొత్త ఉద్యోగ నియామకాలలో టీఈ ఈఏ తరపున శివాజీ ముఖ్యపాత్ర పోషించారు. ఉద్యోగులకు ఏ సమస్య వచ్చినా విద్యుత్ సంస్థల యాజమాన్యాలతో పోరాడి సమస్యలను సాధించుకున్నారు. టీఈఈఏ అంటే శివాజీ, శివాజీ అంటే టీఈఈఏ అనే స్థాయికి ఎదగడమే కాకుండా అసోసియేషన్లో ఉన్న ఐదు వేలకు పైగా ఉన్న సభ్యులతో మమేకమయ్యారు. అందరి వాడుగా ఎదిగిన శివాజీకి వ్యతిరేకంగా టీఈఈఏలో పోటీ చేయడానికి ఎవరు ముందుకు రాలేదు. నాల్గవ సారి కూడా 12 సంవత్సరాలుగా శివాజీని ఏకగ్రీవంగా ఎన్నుకుని తమ ప్రేమాభిమానాలను చాటుకున్నారు.

#### లిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లులకు మద్దతు

## ఇవ్వని కాంగ్రెస్, ఇండియకూటమి పక్షాలకు భవిష్యత్‌లో పుట్టగతులుండవు: అన్నెపర్తి యాదగిరి



**చండూర్ (సాక్ష్యం )ఏప్రిల్ 18** పార్లమెంట్ లో కేంద్రం ప్రవేశపెట్టిన డీ లిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లులకు కాంగ్రెస్, ఇండియా కూటమి పక్షాలు మద్దతివ్వకపోవడం సిగ్గుచేటని, మహిళల సాధికారతకు మద్ధతివ్వని పార్టీలకు భవిష్యత్తులో పుట్టగతులుండవని భారతీయ జనతా పార్టీ జిల్లా నాయకులు అన్నెపర్తి యాదగిరి విమర్శించారు. నియోజకవర్గాల పునర్విభజన, మహిళా బిల్లులకు మద్దతివ్వకపోవడాన్ని నిరసిస్తూ చండూరు మున్సిపల్ కేంద్రంలో కాంగ్రెస్ తో పాటు విపక్షాల దిష్టిబొమ్మ దహనం చేస్తుండగా పోలీసులు అక్కడకు చేరుకుని బిజెపి శ్రేణులను అడ్డుకున్నారు. దిష్టిబొమ్మ తగలపెట్టే క్రమంలో బిజెపి నాయకులకు పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు ముదిగొండ ఆంజనేయులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు బిజెపి నాయకులు మాట్లాడుతూ డీ లిమిటేషన్ తో యువతరం రాజకీయాలలో సేవచేసే అవకాశం ఉంటుందని, మహిళా రిజర్వేషన్ బిల్లుకు విపక్షాలలో ఉన్న మహిళలు కూడా ఓటేయకపోవడం దౌర్భాగ్యమని, కాంగ్రెస్ పార్టీ కుటుంబ రాజకీయ స్వార్ధంతో మహిళలను వంటింటికే పరిమితం చేయాలనే ఆలోచనతో మహిళలను చట్టసభలకు రాకుండా అడ్డుకుంటున్నారని విమర్శించారు. మహిళాలోకం కాంగ్రెస్ పార్టీని క్షమించదని అన్నారు. తెలంగాణలో మహిళలకు 2500/- ఇవ్వలేని అబద్ధాల ముఖ్యమంత్రి ఉత్తర దక్షిణ దేశాల పేరిట కుటిల రాజకీయం చేస్తున్నారని, రాష్ట ప్రభుత్వాన్ని గద్దె దించడానికి ప్రజలు సిద్ధమౌతున్నారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కౌన్సిల్ సభ్యులు భూతరాజు శ్రీహరి, ఉప సర్పంచ్ పల్లపు స్వామి, పార్టీ ప్రధాన కార్యదర్శులు ఆవుల అశోక్ యాదవ్, పద్మనబోయిన శ్రీను, సోమ శంకర్, జిల్లా నాయకులు పేర్ల గణేష్, దోటి కిరణ్, తడకమళ్ళ శ్రీధర్, గంజి వెంకటేశం, బొబ్బల శివ, నలపరాజు యాదగిరి, దోటి శివ, చెరిపల్లి కృష్ణ, నలపరాజు సత్తయ్య, భూతరాజు వేణు, పగిళ్ళ చంద్రశేఖర్, గొల్లూరి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## పెద్ద ఎత్తున లక్ష్మీనరసింహస్వామి వారి కళ్యాణం



**యాదగిరిగుట్ట సాక్ష్యం న్యూస్..** యాదగిరిగుట్ట మున్నూరు కాపు సత్రం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున లక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణాన్ని నిర్వహిస్తున్నామని మున్నూరు కాపు సత్రం ట్రస్టు అధ్యక్షులు నీతి విద్యాసాగర్ అన్నారు. శనివారం యాదగిరిగుట్ట మున్నూరు కాపు సత్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 19 అనగా ఆదివారం రోజున మున్నూరు కాపు సత్రం ఆవరణలో 108 మంది దంపతులతో సుదర్శన నరసింహ హోమం అనంతరం ఒక వెయ్యి ఎనిమిది మంది దంపతులతో లక్ష్మీ నరసింహ స్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని భారీ ఎత్తున నిర్వహిస్తున్నామని అన్నారు. లోక కళ్యాణార్ధం, విశ్వశాంతి కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. మున్నూరు కాపు సామాజిక బంధువులతో పాటు అనేక మంది పెద్ద ఎత్తున పాల్గొననున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఈ కార్యక్రమానికి మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన బంధువులతోపాటు, ప్రముఖులు, వీఐపీలు వస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశామని వసతి భోజన సదుపాయాలతో పాటు ఇతర ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా అన్ని రకాల ఏర్పాటు చేశామని అన్నారు. పెద్ద ఎత్తున మున్నూరు కాపు సామాజిక వర్గ బంధువులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, యాదగిరిగుట్ట మాజీ ప్రధానార్చకులు నల్ల దీగల్ లక్ష్మీ నరసింహచార్యులు శ్రీనివాస్, విక్రమ్, అనిల్, వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఏపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**చిట్యాల ఏప్రిల్ 18 (సాక్ష్యం);** చిట్యాల మండలం ఏపూర్ గ్రామంలో గుండ్రాంపల్లి పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏఎంసి చైర్మన్ నర్ర వినోద్ మోహన్ రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. రైతులు కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకువచ్చి ప్రభుత్వం అందజేస్తున్న మద్దతు ధరను పొందాలని తెలిపారు. రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతు సంక్షేమం కోసమే ప్రభుత్వం కృషి చేస్తుందని,రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంట వెంటనే మిల్లులకు తరలించే ఏర్పాట్లు చేయాలని అలాగే కొనుగోలు కేంద్రాలలో వేసవికాలంని దృష్టిలో పెట్టుకొని రైతులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరం అధ్యక్షులు కాటం వెంకటేశం,మండల కాంగ్రెస్ అధ్యక్షులు గుడిపాటి లక్ష్మీనరసింహ,ఏఎంసీ డైరెక్టర్ యాదగిరి ఏపూరు గ్రామ శాఖ అధ్యక్షుడు పాలెం కృష్ణ,ఏపూర్ మాజీ ఉప సర్పంచ్ సుర్వీ లింగస్వామి గౌడ్,మాజీ సర్పంచ్ గడకారు సైదులు,కార్యదర్శి బండ శేఖర్ రైతులు గుమ్మి వెంగలరెడ్డి,టేకుల నర్సిరెడ్డి కొండే వెంకటేశు కొండే లింగస్వామి,బండ మచ్చ గిరి, బియ్యపు వెంకటేశం,సురిగి లింగస్వామి, వలిగొండ నరసింహ,మందుల కిష్టయ్య గోపగోని, మల్లయ్య బండ కిష్టయ్య మందుల వెంకటేష్ బచ్చగొని నరసింహ పంతంగి గణేష్ దేవరపల్లి శీను రెడ్డి తదితరులు పాల్గొనడం జరిగింది.

# కురుమ ఆత్మ గౌరవ భవనాన్ని లీజుకు ఇస్తే సహించం

- కేసీఆర్ ఆనవాళ్లు చెరిపే కుట్ర
- కోకాపేట కురుమ సంఘం భవనం లీజుకు ఇవ్వడం పట్ల తీవ్ర అభ్యంతరం.
- యాదగిరిగుట్టలో చండీశ్వర సదనం కురుమ సంఘానికి చెందినదే
- తక్షణమే లీజును రద్దు చేయాలి
- మాజీ ఎమ్మెల్సీ యేగ్గె మల్లేష్, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకు గుణపాఠం తప్పదు.
- కురుమ సంఘం రాష్ట్ర నాయకులు కర్రె వెంకటయ్య



**యాదగిరిగుట్ట సాక్ష్యం న్యూస్.** రాష్ట్ర తొలి సీఎం కేసీఆర్ కోకాపేటలో ఐదు ఎకరాల భూమి కేటాయించి, రూ. 5 కోట్ల నిధులను మంజూరు చేసి కురుమ కులస్తుల ఆత్మగౌరవ భవనమైన దొడ్డి కొమురయ్య కురుమ భవనాన్ని ఆంధ్ర పెత్తందారులకు లీజుకు ఇస్తామంటే సహించేది లేదని కురుమ సంఘం రాష్ట్ర నాయకులు కర్రె వెంకటయ్య మండిపడ్డారు. కురుమ సంఘం అధ్యక్షుడు రాష్ట్ర అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్సీ ఎగ్గ మల్లేశా, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కలిసి కురుమ సంఘం భవనాన్ని విక్రయించేందుకు కుట్ర చేస్తున్నట్ల అనుమానం కలుగుతుందన్నారు. వెంటనే లీజును రద్దు చేసి కురుమ కులస్తులకు అప్పగించాలని లేనిచో రాష్ట్రవ్యాప్తంగా కురుమ కులస్తులను ఏకం చేసి ఉద్యమానికి శ్రీకారం చుడుతామని హెచ్చరించారు. శనివారం యాదగిరిగుట్ట పట్టణంలో రాష్ట్ర కురుమ సంఘ నాయకులతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్సీ యేగే మల్లేష్, బీర్ల ఐలయ్య ఒక కురుమ కులాలకు చెందిన వారుగా చలామనవుతున్న కులానికి వారు చేసింది ఏమీ లేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో కురుమ కులస్తులకు లక్ష 25 వేల నిధులతో గొర్ల యూనిట్ల అందజేస్తే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం గొర్లకు టీకా మందులు కూడా ఇవ్వడం లేదని తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. యాదగిరిగుట్ట పట్టణంలో కురుమ కులస్తుల నిధులతో నిర్మించిన చండీశ్వర సదనం ముమ్మాటికి కురుమ కులస్తులకు చెందిందన్నారు. కానీ ఎగ్గ మల్లేశా కురుమ కులస్తులకు ఇక్కడ భవనం లేకుండా చండీశ్వర సదనాన్ని ఒక ప్రైవేటు సంస్థకు లీజుకి ఇవ్వడం సరైనది కాదన్నారు. పవిత్ర యాదగిరిగుట్ట క్షేత్రంలో కురుమ కులస్తులకు భవనం లేకపోవడం సిగ్గుచేటు అన్నారు. రాష్ట్ర తొలి సీఎం కేసీఆర్ ఆనవాళ్లను చెరిపేందుకు కుట్ర చేస్తున్నట్టుగా కనిపిస్తుందని అన్నారు. గుట్ట ప్రెసిడెన్సీయల్ సూట్ పక్కనే సర్వే నంబర్ 327 లో కురుమ సంఘం భవన నిర్మాణానికి గత ఎమ్మెల్యే గొంగిడి సునీతా మహేందర్ రెడ్డిని ప్రభుత్వం స్థలం కోరితే సానుకూలంగా స్పందించారని అన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే కురుమలకు స్థలం లేకుండా చేశారన్నారు. అదే స్థలాన్ని ముదిరాజ్ కులస్తులకు కేటాయించాలని గుర్తు చేశారు. కురుమ కులస్తుడు డైన ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య స్పందించి పక్కనే ఉన్న స్థలంలో కుర్మ సంఘ భవన నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు డి శ్రీనాథ్ కురుమ, కర్కే సత్యనారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ మాదారం కృష్ణ, యూత్ ప్రెసిడెంట్ ఏ సంతోష్, మంగ నరసింహులు, గౌడ శ్రీశైలం, కర్ర సిద్ధులు, కర్రే చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమిలో అక్రమ మట్టి తరలింపు నిలిపివేసిన తహసిల్దార్

– మాటలు తరలిస్తున్న వాహనాలు సీజ్





**చిట్యాల ఏప్రిల్ 18(సాక్ష్యం);** చిట్యాల మండలంలో నేరడ గ్రామపంచాయతీ పరిధిలో గాదిరెడ్డి పల్లె లో సర్వేనెంబర్ 392 కు సంబంధించి ప్రభుత్వ భూమిలో టిప్పర్లతో అక్రమ మట్టి తరలింపు జరుగుతుండడంతో సమాచారం తెలుసుకున్న తహసిల్దార్ వెనువెంటనే స్పందించి ఆర్ఐ జానీ షరీఫ్ ను సంఘటన స్థలానికి పంపించి అక్కడ జరుగుతున్న మట్టి తరలింపును నిలిపివేసి అనుమతి పత్రాలు చూపించాలని అడగడంతో మట్టి తరలిస్తున్న దళారుల వద్ద ఎలాంటి అనుమతి పేపర్లు లేకపోవడంతో అక్కడ పనిచేస్తున్నటువంటి ఒక టిప్పర్ రెండు ఇటాచి వాహనములను సిజు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించడం జరిగింది. అనంతరం తహసిల్దార్ మాట్లాడుతూ స్థానికుల సమాచారం ప్రకారం వెంటనే సంఘటన స్థలానికి ఆర్ ఐ పంపించి వివరాలు సేకరించి మట్టి తరలింపును తక్షణమే నిలిపి వేయడం జరిగింది. ఈ మట్టి తరలింపు ఎలాంటి అనుమతి లేకుండా పది రోజుల నుంచి అక్రమంగా మట్టి తరలింపు కొనసాగిస్తున్నారని అన్నారు. వెంటనే మట్టి తరలిస్తున్న వాహనం లను సీజ్ చేసి జిల్లా మైనింగ్ ఏడికి,ఎస్ఐకి సమాచారం అందజేయడం జరిగింది. పూర్తి విచారణ చేసి తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని తెలిపారు.

#### మల్లాపూర్‌లో విజ్ఞాన భారతి

## హైస్కూల్ సమ్మర్ క్యాంప్ ప్రారంభం






**ఉప్పల్, ఏప్రిల్ 18 (సాక్ష్యం):** మల్లాపూర్ డివిజన్ పరిధిలోని విజ్ఞాన భారతి హైస్కూల్‌లో ఈ ఏడాది నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌ను మాజీ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి, స్కూల్ డైరెక్టర్ బుచ్చిరెడ్డి కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పన్నాల దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకుని క్రీడలతో పాటు కళలు, వివిధ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. పాఠ్యపుస్తకాలతో మాత్రమే పరిమితం కాకుండా సమగ్ర అభివృద్ధి కోసం ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని అన్నారు. స్కూల్ డైరెక్టర్ బుచ్చిరెడ్డి మాట్లాడుతూ, ఈ సమ్మర్ క్యాంప్ ద్వారా విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలు, సృజనాత్మకత పెంపొందించడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఫిజికల్ ట్రైనర్లు, స్థానిక నాయకులు తండా వాసుగౌడ్, ఫైళ్ల ప్రవీణ్ కుమార్, ఉస్మాన్, రాపోలు శ్రీనివాస్, మెండ రఘు, లింగాల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా శక్తి పోరాటాన్ని ఎవరు ఆపలేరు

బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బండ కార్తీక చంద్రారెడ్డి



**సికింద్రాబాద్, ఏప్రిల్ 18 (సాక్ష్యం):** మహిళా రిజర్వేషన్ బిల్లుపై కాంగ్రెస్ పార్టీ వైఖరిని నిరసిస్తూ సీఎం రేవంత్ రెడ్డి నివాసం ముట్టడికి బీజేపీ పిలుపునిచ్చిన నేపథ్యంలో, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బండ కార్తీక చంద్రారెడ్డి గృహనిర్బంధానికి గురయ్యారు. ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులు ఆమెను, బండ చంద్రారెడ్డిని ముందస్తుగా హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా బండ కార్తీక చంద్రారెడ్డి మాట్లాడుతూ, నిరసనలను అణిచివేయడానికి గృహనిర్బంధం విధించినప్పటికీ మహిళా శక్తి పోరాటాన్ని ఎవరూ ఆపలేరని స్పష్టం చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకోవడం ద్వారా కాంగ్రెస్ తన మహిళా వ్యతిరేక వైఖరిని బయటపెట్టిందని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ గృహనిర్బంధాలతో మహిళల గొంతును అణిచివేయలేరని, మహిళల హక్కుల కోసం తమ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో రానున్న రోజుల్లో మహిళా రిజర్వేషన్ సాధించి తీరుతామని ఆమె ధీమా వ్యక్తం చేశారు. ఈ ఘటనలో ఉపేందర్ యాదవ్, మల్లి కంటి వీరన్న, కొన్నే సంపత్, పొలాస నరేష్, టెంపుల్ సాయి, కృష్ణ, బండ శివారెడ్డి తదితరులను కూడా పోలీసులు గృహనిర్బంధం చేసినట్లు సమాచారం.





#### గీతాంజలి స్కూల్‌లో

## విద్యార్థులకు అవార్డుల పంపిణీ

అత్యధిక అవార్డులు పొందిన–వల్లభనేని వేదశ్రీ





**నర్సంపేట ఏప్రిల్ 18 ( సాక్ష్యం న్యూస్ ) :** ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి జీవితంలో ఏదో ఒకటి సాధించాలని ప్రతి ఒక్కరి స్వప్నం. అలాంటి వారిలో విద్యార్థులు ఇంకా ఎక్కువగా సాధించాలని ఆశిస్తారు. అలాంటి వారి స్వప్నాలను గీతాంజలి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ నెరవేర్చడానికి ఎల్లప్పుడూ కృషి చేస్తుంది. ఈ విద్యా సంవత్సరం చివరి రోజును పురస్కరించుకొని పాఠశాలలో విద్యార్థులకు విభాగాల వారీగా అవార్డులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గీతాంజలి విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ వేములపల్లి సుబ్బారావు పాల్గొని విద్యార్థులకు అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ బహుమతులు అనేవి మన బాధ్యతను మరింత పెంచుతాయని బహుమతులు అందుకున్న ప్రతి ఒక్క విద్యార్థి వాటిని స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్తులో ఇంకా ఎన్నో విజయాలు సాధించి మరెన్నో బహుమతులను పొందాలని తెలిపారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపల్ ఎం రాజేష్ మాట్లాడుతూ ఈ అవార్డు పంపిణీ కార్యక్రమం సర్వసాధారణంగా నిర్వహించకుండా ప్రతి తరగతిలో ఉండే ఒక్కో విద్యార్థికి ఒక్కో కళా ఉంటుంది వారికి ఏ విభాగంలో ఆసక్తి ఉండి రాణిస్తున్నారో గుర్తించి వారికి తగిన విధంగా బహుమతులను ప్రధానం చేయడం జరిగింది. కనుక మీలో ఉన్న ప్రతిభకు సాన పెడితే మీరు అద్భుతాలు సాధిస్తారని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు విద్యార్థులు కనబరిచిన ప్రతిభను కొనియాడారు. కార్యక్రమం అనంతరం అందరూ విద్యార్థులతో కలిసి ఆనందంగా గడిపారు. విద్యా సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ వచ్చే విద్యా సంవత్సరం ఇంకా ఎన్నో అనుభూతులను పంచుతుందని ఆశిస్తూ భారమైన హృదయాలతో ఎవరి గమ్యస్తానాలకు వారు వెడలిపోయారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రాధ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





#### ఘనంగా శ్రీ సీతారామచంద్రస్వామి

## విగ్రహ ప్రతిష్ట మహోత్సవ వేడుకలు





**చిట్యాల ఏప్రిల్ 18(సాక్ష్యం);** చిట్యాల మండలం ఆరెగూడెం గ్రామంలో శ్రీ సీతారామచంద్రస్వామి సహిత దుర్గా మల్లేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం ఈనెల 20న నిర్వహించబడును అని గ్రామ సర్పంచ్ నాగంపల్లి శ్యాంసుందర్ తెలిపారు. ఈనెల 18 నుండి 20 వరకు గ్రామంలో స్వామివారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం వేడుకలు అట్టహాసంగా నిర్వహించబడును మండల వ్యాప్తంగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ఈ కార్యక్రమం విజయవంతం చేయాల్సిందిగా కోరారు.

శాంతి భద్రతల

## పరిరక్షణే న్యాయపాలిక ధ్యేయం కావాలి

జిల్లా జడ్జి మహమ్మద్ అబ్దుల్ రఫీ






**మహబూబాబాద్ జిల్లా కరస్పాండెంట్ సాక్ష్యం (ఏప్రిల్ 18)** సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా పోలీసులు,ప్రాసిక్యూటర్లు మరియు న్యాయమూర్తులు పనిచేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి మహమ్మద్ అబ్దుల్ రఫీ అన్నారు.జిల్లా కోర్ట్ ప్రాంగణంలో పోలీస్,ప్రాసిక్యూటర్లు మరియు న్యాయమూర్తుల తో సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరారోపణ రేటు తో పోలిస్తే నేర నిర్ధారణ రేటు తక్కువతుందని ఆవేదన వ్యక్తం చేశారు.తప్పు చేసిన వారు ఎట్టి పరిస్థితుల్లోనూ తప్పించుకోకుండా కట్టుదిట్టమైన నేరారోపణ పత్రాలను కోర్టులలో దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించారు.ప్రస్తుత ఏడాది తదుపరి జాతీయ లోక్ అదాలత్ చాలా దూరంలో జూన్ 20 న ఉన్నందున్న ఎక్కువగా కేసులు పరిష్కారమయ్యేలా పోలీస్ యంత్రాంగం కృషి చేయాలన్నారు.ఈ సమావేశంలో జూనియర్ సివిల్ న్యాయ మూర్తులు స్వాతి మురారి,ధీరజ్ కుమార్, ఏ. కృష్ణ తేజ్, జాయింట్ కలెక్టర్ (రెవిన్యూ ) అనిల్ కుమార్,మహబూబాబాద్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ తిరుపతి రావు,తొర్రురు డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కృష్ణ కిషోర్,కోర్ట్ ముఖ్య పరిపాలన అధికారి ఎం.క్రాంతి కుమార్, పోక్సో పబ్లిక్ ప్రాసెక్యూటర్ కొంపెల్లి వెంకటయ్య,జిల్లా పరిధిలో ని సీఐ లు, ఎస్సై లు పాల్గొన్నారు.

## ప్రపంచ వారసత్వ దినోత్సవం!

– బమ్మెర పోతనకు ఘన నివాళి అర్పించిన జిల్లా కలెక్టర్ సత్య శారద



**వరంగల్, ఏప్రిల్ 18 (సాక్ష్యం) :** ప్రపంచ వారసత్వ దినోత్సవాన్ని పురస్కరించుకుని వరంగల్ జిల్లాలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు సాహిత్య శిఖరం, సహజ కవి బమ్మెర పోతనను స్మరించుకుంటూ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆయనకు ఘనంగా నివాళు లర్పించారు. వరంగల్ నగరంలోని పోతన ఆడిటోరియంలో నిట్ రిటైర్డ్ ప్రొఫెసర్ పాండురంగారావు గారి ఆధ్వర్యంలో ఈ ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, తొలుత బమ్మెర పోతన విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మన సంస్కృతికి మూలస్తంభాలైన కవులను గౌరవించుకోవడం మన బాధ్యత అని ఆమె ఈ సందర్భంగా పేర్కొన్నారు. మన వారసత్వ సంపదను భావి తరాలకు అందించడంలో ఇలాంటి సాహిత్య కార్యక్రమాలు కీలకమని అన్నారు . మన సంస్కృతి, సంప్రదాయాలు మరియు చారిత్రక కట్టడాలే మన నిజమైన ఆస్తి. వీటిని కాపాడుకోవడంలో విద్యార్థుల పాత్ర చాలా కీలకం అన్నారు. విద్యార్థులు చిన్నతనం నుంచే మన గొప్ప వారసత్వంపై అవగాహన పెంచుకోవాలని చెప్పారు. ప్రపంచ వారసత్వ దినోత్సవం రోజున పోతన వంటి మహనీయుడిని స్మరించుకోవడం మనందరికీ గర్వకారణమని కలెక్టర్ తెలిపారు.ఈ వేడుకల్లో వివిధ పాఠశాలల నుండి వచ్చిన విద్యార్థులు అలరించిన విద్యార్థుల పద్య పఠనంలో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. పోతన రచించిన భాగవత పద్యాలను విద్యార్థులు మధురంగా ఆలపించి సభికులను ముగ్ధులను చేశారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ పాండురంగారావు , శ్రీధర్ రావు కో కన్వీనర్ తో పాటు పలువురు విద్యావేత్తలు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, సాహిత్య అభిమానులు మరియు జిల్లా అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమం చివరలో పద్య పఠనంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు.

## ప్రతి ఆరోగ్యవంత వ్యక్తి రక్తదానం చేయాలి





**నారాయణఖేడ్, ఏప్రిల్ 18:( సాక్ష్యం న్యూస్ )** ప్రతి ఆరోగ్యవంత వ్యక్తి రక్తదానం చేయాలని ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఓంప్రకాష్, సంగారెడ్డి,మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎం.ఏ ఖైసర్,సంతోష్ రావు పాటిల్ అన్నారు. శనివారం నారాయణఖేడ్ పోలీస్ స్టేషన్ ఆవరణలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో, లయన్స్ క్లబ్ సహకారంతో నిర్వహించిన రక్తదాన శిబిరం విజయవంతంగా జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రక్తదానం మహాదానం అని, ఇది ప్రాణాలను కాపాడే అత్యంత విలువైన సేవ అని అన్నారు. ప్రతి ఆరోగ్యవంతుడు కనీసం మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయాలని సూచించారు. ప్రమాదాలు, అత్యవసర పరిస్థితులు, శస్త్రచికిత్సలు వంటి సందర్భాల్లో రక్తం అవసరం పెరుగుతుందని, రక్త నిల్వలు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేందుకు యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, యువకులు,స్వచ్ఛంద సేవకులు ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి నిర్వాహకులు ప్రశంసలు తెలియజేసి, భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ వెంకట్ రెడ్డి, సిఐలు శ్రీనివాస్ రెడ్డి, వెంకట్ రెడ్డి ఆయా మండలాల ఎస్సైలు, లయన్స్ క్లబ్ నారాయణఖేడ్ అధ్యక్షులు సాయి సంగమేశ్వర్, బాధ్యులు రాజు, శేఖర్, యూసుఫ్ , జర్నలిస్ట్ పరమేష్, ఫయాజ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## మండుటెండల్లో మానవత్వం..బొడ్మట్‌పల్లిలో చలివేంద్రం

ప్రజాసేవలో ముందంజ
చలి వేంద్రాన్ని ప్రారంభించిన బొడ్మాట్ పల్లి సర్పంచ్
సర్పంచ్ ఫోరమ్ రాష్ట్ర కార్యదర్శి అవినాష్ కుమార్





**మెదక్ జిల్లా, టేక్మాల్, ఏప్రిల్ 18 (సాక్ష్యం న్యూస్):-** మండుటెండలు మండిపోతున్న వేళ ప్రజల దాహార్తిని తీర్చేందుకు బొడ్మట్‌పల్లి గ్రామ చౌరస్తాలో చలివేంద్రం ఏర్పాటు చేయడం విశేషంగా నిలిచింది. గ్రామ సర్పంచ్, సర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర కార్యదర్శి తలారి అవినాష్ కుమార్ ఆధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమం శనివారం నాడు ఘనంగా ప్రారంభమైంది.ఎండల తీవ్రతతో ప్రయాణికులు, కార్మికులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న తరుణంలో చల్లని తాగునీరు అందించాలనే సంకల్పంతో ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ అవినాష్ కుమార్ తెలిపారు. ప్రజల సంక్షేమమే తన లక్ష్యమని, అవసరమైన ప్రతి సమయంలో ప్రజల పక్కనే నిలుస్తామని ఆయన స్పష్టం చేశారు. గ్రామ చౌరస్తాలో ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రం రోజూ వందలాది మంది దాహార్తిని తీర్చే కేంద్రంగా మారనుందని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సేవా కార్యక్రమాలతో గ్రామ అభివృద్ధికి కొత్త దిశ చూపుతున్న సర్పంచ్ అవినాష్ కుమార్ పై ప్రజలు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈ కార్యక్రమంలో బొడ్మాట్ పల్లి పంచాయతీ కార్యదర్శి మౌనిక, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు శంకరప్ప, ఉప సర్పంచ్ మాధవి నాగభూషణం, వార్డు సభ్యులు శ్రీశైలం, పెంటయ్య, నర్సింలు, తలారి రాందాస్, అందోలు విఠల్, గతంగారి ఈశ్వరప్ప, పాండు, సత్యం, అబ్బాస్, పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ తగిన మూల్యం చెల్లించక తప్పదు

– జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్





**మంచిర్యాల జిల్లా ప్రతినిధి,ఏప్రిల్ 18(సాక్ష్యం)** 2029లో మహిళా బిల్లును అమలు చేయాలని కోరుతూ ప్రవేశపెట్టిన బిల్లును తిరస్కరించిన కాంగ్రెస్ హిందీ కూటమి నాయకులు తగిన మూల్యం చెల్లించక తప్పదని భాజపా జిల్లా అధ్యక్షులు నగులూరు వెంకటేశ్వర్ గౌడ్ అన్నారు. చెన్నూరు మండలం కిష్టంపేట జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించి అనంతరం రాహుల్ గాంధీ ఇండికూటమి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1996 నుంచి నేటి వరకు మహిళా బిల్లును అమలు కాకుండా తాను స్వయంగా కుట్రలు చేస్తూ ఇతరులను కూడా బిల్లును అడ్డ గించమని ప్రోత్సహిస్తున్నది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని కాంగ్రెస్ పార్టీకి మహిళలకు రిజర్వేషన్ ఇవ్వడం ఇష్టం లేదని మరోసారి రుజువైందని అన్నారు.2013లో కాంగ్రెస్ పార్టీ రాజ్యసభలో మహిళా బిల్లు ప్రవేశపెడితే బహిరంగ మద్దతు ప్రకటించి రాజ్యసభలో బిల్లు పాస్ చేయించిన ఘనత భారతీయ జనతా పార్టీకి దక్కుతుందని కానీ ఆ బిల్లు అలా ఆమోదం పొందుతుందో అని భయంతో పార్లమెంటులో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టలేదని ఆయన అన్నారు. బిజెపికి నిరంతరం మహిళల పట్ల ఉన్న ఆధారాభిమానాలతో నరేంద్ర మోడీ ప్రభుత్వం 2023లో ప్రవేశపెట్టి విజయం సాధించిన తరుణంలో 2029 లో అమలు చేయడానికి ప్రయత్నిస్తుంటే కాంగ్రెస్ మరోసారి అడ్డగించి 50 శాతం మహిళల ఆశలపై నీళ్లు చల్లిందని దీనికి కాంగ్రెస్ పార్ట హిండి కూటమి తగిన మూల్యం చెల్లించక తప్పదని ఆయనే హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మండల పట్టణ పార్టీ అధ్యక్షులు బుర్ర రాజశేఖర్ ,18వ వార్డు కౌన్సిలర్ ఏతం శివకృష్ణ, సీనియర్ నాయకులు వెంకటేశ్వర్, రత్న లక్ష్మీనారాయణ రెడ్డి ,మహిళా నాయకురాలు ఎడ్ల స్వరూప రాణి, ముత్యాల శ్రావణి ,చెన్నూరు మండల పట్టణ ప్రధాన కార్యదర్శి వెంకటేష్, మాణికరావు శంకర్, మండల నాయకులు కొఠారి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## విజ్ఞానం వినోదం మేళవించే సమయం

వేసవి సెలవులు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ





**మహబూబాబాద్ జిల్లా కరస్పాండెంట్ సాక్ష్యం (ఏప్రిల్ 18)** మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ (వీజీూదీజఔ) మరియు తెలంగాణ ప్రభుత్వ గిరిజన సంక్షేమ అప్‌గ్రేడెడ్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల (౧+ఔఖ=జీజ) లోని విద్యార్థుల కోసం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో న్యాయవాది చెన్న మల్లా రెడ్డి విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ వేసవి సెలవులు కేవలం వినోదం కోసమే కాకుండా విజ్ఞాన్ని పెంచుకునేలా ప్రయత్నం చేయాలని పిలుపునిచ్చారు.అదేవిధంగా కొత్త నైపుణ్యలను అలవార్చుకోడానికి సిద్ధమవాలన్నారు. భారత రాజ్యాంగ మౌలిక స్వరూపము మరియు నిత్యజీవితంలో ఉపయోగపడే చట్టాలను గురించి తెలుసుకోవాలని సూచించారు.ముఖ్యంగా బాల్య వివాహాల పట్ల అప్రమత్తతతో ఉండి ఎక్కడైనా బాల్య వివాహం జరుగుతున్నట్లయితే సంబంధిత అధికారులకు కానీ1098 టోల్ ఫ్రీ నెంబర్ కు గాని సమాచారం అందించాలని సూచించారు.అనంతరం అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ వి రాజ్ కృష్ణ మాట్లాడుతూ లైంగిక నేరాల నుండి పిల్లల రక్షణ(పోక్సో) చట్టంలోని నిబంధనలు అందుబాటులో ఉన్న న్యాయపరమైన రక్షణల గురించి వివరించారు.ర్యాగింగ్‌కు పాల్పడితే ఎదుర్కోవాల్సిన తీవ్రమైన చట్టపరమైన పరిణామాలను విద్యార్థులకు తెలిపారు.డిజిటల్ లెర్నింగ్ పెరుగుతున్న నేపథ్యంలో,ఆన్‌లైన్ మోసాల పట్ల విద్యార్థులను అప్రమత్తం చేశారు.డిజిటల్ ప్రైవసీ ప్రాముఖ్యతను వివరించారు.ఉచిత మరియు నిర్బంధ విద్య అనేది ప్రతి ఒక్కరి ప్రాథమిక హక్కని,ఇది సామాజిక-ఆర్థిక సాధికారతకు ఎలా ఉపయోగపడుతుందో వివరించారు.ఈ కార్యక్రమం లో పాఠశాల ప్రిన్సిపాల్ వెంకట్ నారాయణ,బోధన సిబ్బంది సారిక,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## 7 రోజుల సంక్షేమ వారాన్ని సమర్ధవంతంగా అమలు చేయాలి

– రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు






**మంచిర్యాల జిల్లా ప్రతినిధి(సాక్ష్యం)ఏప్రిల్ 18;** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ నెల 20వ తేదీ నుండి 26వ తేదీ వరకు 7 రోజుల పాటు సంక్షేమ వారాన్ని సమర్ధవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంక్షేమ శాఖల అధికారులతో సంక్షేమ వారం నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా ఈ నెల 20వ తేదీ నుండి 26వ తేదీ వరకు ప్రభుత్వ వసతి గృహాలు, గురుకుల పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలలలో షెడ్యూల్డ్ కులములు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన తరగతులు, మైనారిటీ గురుకులాలలో, విద్యాలయాలలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని తెలిపారు. విద్యార్థులకు క్విజ్, విద్య విశ్లేషణ, చిత్రలేఖనం, పెయింటింగ్ పోటీలు నిర్వహించాలని, వసతి గృహాలలో మరమ్మత్తు పనులను చేపట్టాలని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి వసతులపై చర్చించాలని సూచించారు. స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలు చేపట్టాలని, వేసవి శిబిరం, బడిబాట కార్యక్రమాలు నిర్వహించాలని, రైతు రిజిస్ట్రీ 100 శాతం పూర్తి చేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఈనెల 20వ తేదీ నుండి 26వ తేదీ వరకు 7 రోజుల పాటు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలోని 102 ఎస్.సి., ఎస్.టి., బి.సి., మైనారిటీ గురుకులాలలో, వసతి గృహాలలో వంటగది, పారిశుద్ధ్యం, మరమ్మత్తు పనులు చేపడుతామని, విద్యార్థులకు వివిధ విభాగాలలో పోటీలు నిర్వహిస్తామని, స్కిల్ డెవలప్మెంట్, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. వేసవి శిబిరాలు, బడిబాట కార్యక్రమాలను జిల్లాలో అధికారుల సమన్వయంతో పకడ్బందీగా చేపడతామని, రైతుల రిజిస్ట్రీ 100 శాతం పూర్తి చేసేందుకు అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి భాగ్యవతి, గృహ నిర్మాణ శాఖ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వాహనదారులు నిబంధనలు ఖచ్చితంగా పాటించాలి

– జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల జిల్లా ప్రతినిధి(సాక్ష్యం)ఏప్రిల్ 18:** వాహనదారులు రహదారి భద్రతా నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వేంపల్లి లో గల జిల్లా రవాణా శాఖ అధికారి కార్యాలయ ఆవరణలో అరైవ్ అలైవ్ లో భాగంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి జిల్లా రవాణా అధికారి సిహెచ్. రంజిత్, అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో అరైవ్ అలైవ్ లో భాగంగా ఆటో, లారీల డ్రైవర్లకు వైద్య పరీక్షలు, కంటి పరీక్షలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో ప్రభుత్వ వైద్య కళాశాల, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులతో దాదాపు 200 మంది డ్రైవర్లకు పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్నవారికి మందులు, కంటి అద్దాలు అందించడం జరిగిందని తెలిపారు. రోడ్లపై ప్రయాణించే సమయంలో రక్షణ ముఖ్యమని, ప్రతి వాహనదారుడు లైసెన్స్ కలిగి ఉండాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారులో ప్రయాణించేవారు సీటు బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని తెలిపారు. వాహనం నడిపే సమయంలో వేగ పరిమితి అనుసరించాలని, మద్యం సేవించి, మొబైల్ మాట్లాడుతూ వాహనం నడపకూడదని తెలిపారు. ప్రజల రక్షణలో భాగంగా వాహనదారులు ఎలాంటి కంటి సమస్యలు లేకుండా చూసుకోవాలని, వాహనాలు నడిపే వారికి కంటిచూపు అత్యవసరమని, కంటి పరీక్షలు నిర్వహించిన వారిలో అవసరం ఉన్నవారికి శస్త్రచికిత్స చేయడం జరుగుతుందని తెలిపారు. రోడ్డు ప్రమాదం అంటే ఒక కుటుంబానికి జరిగే ప్రమాదమని తెలిపారు. జిల్లాలో రహదారులపై లైట్లు, బ్లైండ్ స్పాట్లను గుర్తించి తగు ఏర్పాట్ల చేయడం జరుగుతుందని, సిగ్నల్ వ్యవస్థలను ఏర్పాటు చేసి వాహనాలను నియంత్రించడం జరుగుతుందని తెలిపారు. అనుభవానికి, ప్రమాదానికి సంబంధం లేదని, వాహనం నడిపి సమయంలో ఏకాగ్రతతో నడపాలని తెలిపారు. ప్రతి వాహనానికి సంబంధించి ధ్రువపత్రాలు కలిగి ఉండాలని, రాంగ్ రూట్ లో వాహనం నడపకూడదని తెలిపారు. తనిఖీలలో మద్యం సేవించి వాహనం నడుపుతూ దొరికినట్లైతే సంబంధిత వాహనదారుడి లైసెన్స్ సస్పెండ్ చేయడం జరుగుతుందని, 18 సంవత్సరాల వయసు నిండని వారు వాహనాలు నడపకూడదని, ఒకవేళ నడిపినట్లయితే వారి తల్లితండ్రులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అతివేగం చాలా ప్రమాదమని, వేగం పరిమితిలో ఉండి నిబంధనలు పాటించినట్లయితే గమ్యస్థానానికి సురక్షితంగా చేరుకోవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# సన్‌రైజర్స్ హైదరాబాద్ మూడో విజయం

**ఉప్పల్ వేదికగా ఉత్కంఠగా సాగిన మ్యాచ్**

**సమష్టిగా రాణించిన సన్‌రైజర్స్ జట్టు**

**2 పరుగుల తేడాతో చెన్నైపై విజయభేరీ**

ఐపీఎల్ 2026 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్(ఎస్‌ఆర్‌హెచ్) మూడో విజయాన్ని నమోదు చేసింది. శనివారం ఉప్పల్ వేదికగా ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన సన్‌రైజర్స్ హైదరాబాద్ 12 పరుగుల తేడాతో చెన్నై సూపర్ కింగ్స్(సీఎస్‌కే)ను ఓడించింది. బ్యాటింగ్‌లో అభిషేక్, క్లాసెన్ సత్తా చాటితే.. బౌలింగ్‌లో ఇషాన్ మలింగా, నితీష్ రెడ్డి, ప్రఫుల్ హింగే నిప్పులు చెరిగారు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 194 పరుగులు చేసింది. అభిషేక్ శర్మ(22 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్స్‌లతో 59), హెన్రిచ్ క్లాసెన్(39 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లతో 59) హాఫ్ సెంచరీలతో రాణించారు. సీఎస్‌కే బౌలర్లలో అన్షుల్ కంబోజ్(3/22), జెమీ ఓవర్టన్(3/37) మూడేసి వికెట్లు తీయగా..ముఖేష్ చౌదరి(2/21) రెండు వికెట్లు పడగొట్టాడు. గుర్జప్నీత్ సింగ్(1/34) ఒక వికెట్ దక్కింది. అనంతరం సీఎస్‌కే 20 ఓవర్లలో 8 వికెట్లకు 184 పరుగులే చేసి ఓటమిపాలైంది. ఆయుష్ మాత్రే(13 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌తో 30), మాథ్యూ షార్ట్(30 బంతుల్లో 3 ఫోర్లతో 34) టాప్ స్కోరర్లుగా నిలిచారు. శివమ్ దూబే(16 బంతుల్లో ఫోర్, సిక్స్‌తో 21) దూకుడుగా ఆడినా ఫలితం లేకపోయింది. సన్‌రైజర్స్ హైదరాబాద్ బౌలర్లలో ఇషాన్ మలింగా(3/29) మూడు వికెట్లు తీయగా.. నితీష్ కుమార్ రెడ్డి(2/19) రెండు వికెట్లు పడగొట్టాడు. శివాంగ్ కుమార్(1/18), సాకిబ్ హుస్సేన్(1/32), ప్రఫుల్ హింగే(1/60) చెరో వికెట్ తీసారు. 195 పరుగుల లక్ష్య ఛేదనలో సంజూ శాంసన్(7) త్వరగానే ఔటైనా.. ఆయుష్ మాత్రే దూకుడుగా ఆడాడు. నితీష్ కుమార్ రెడ్డి తన వరుస ఓవర్లలో ఆయుష్ మాత్రే, రుతురాజ్ గైక్వాడ్(19)లను ఔట్ చేసినా సీఎస్‌కే పవర్ ప్లేలో 76 పరుగులు చేసింది. ఆచితూచి ఆడిన సర్ఫరాజ్ ఖాన్, మాథ్యూ షార్ట్ జోడీని ఇషాన్ మలింగా విడదీసాడు. సర్ఫరాజ్ ఖాన్‌ను క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. ఆ వెంటనే డేంజరస్ డెవాల్డ్ బ్రెవిస్(0)ను శివాంగ్ కుమార్ క్యాచ్ ఔట్ చేశాడు. ఈ పరిస్థితుల్లో శివమ్ దూబే, మాథ్యూ షార్ట్‌లు ఇన్నింగ్స్‌ను నిలబెట్టే ప్రయత్నం చేశారు. కానీ మాథ్యూ షార్ట్(34)ను మలింగా పెవిలియన్ చేర్చి మ్యాచ్‌ను ఉత్కంఠగా మార్చాడు. శివమ్ దూబే(21)ను హుస్సేన్ క్లీన్ బౌల్డ్ చేయగా.. అన్షుల్ కంబోజ్ భారీ సిక్సర్‌తో మ్యాచ్‌పై ఉత్కంఠగా మార్చాడు. ఆఖరి ఓవర్‌లో సీఎస్‌కే విజయానికి 18 పరుగులు అవసరం కాగా.. ప్రఫుల్ హింగే.. జెమీ ఓవర్టన్(16)ను ఔట్ చేసి సన్‌రైజర్స్ విజయాన్ని లాంఛనం చేశాడు. తొలి 3 ఓవర్లలో 53 పరుగులిచ్చిన ప్రఫుల్ హింగే.. ఆఖరి ఓవర్‌లో కేవలం 7 పరుగులు మాత్రమే ఇచ్చాడు. రాజస్థాన్ రాయల్స్‌తో గత మ్యాచ్‌లోనూ ప్రఫుల్ హింగే మ్యాచ్ విన్నింగ్ ప్రదర్శన కనబర్చిన సంగతి తెలిసిందే.

## రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు
# జోరుకి బ్రేక్..

**ఉత్కంఠపోరులో ఢిల్లీ క్యాపిటల్స్‌దే గెలుపు**

**చివరలో డేవిడ్ మిల్లర్ మెరుపులు**

**ఈ సీజన్ లో బెంగళూరుకి ఇది రెండో పరాజయం**

ఐపీఎల్ 2026లో భాగంగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య జరిగిన ఉత్కంఠభరిత పోరులో ఢిల్లీ జట్టు విజయం సాధించింది. కేఎల్ రాహుల్ (57), స్టబ్స్ (60 నాటౌట్) హాఫ్ సెంచరీలతో రాణించారు. చివరలో డేవిడ్ మిల్లర్ మెరుపులు మెరిపించాడు. రెండు సిక్సర్లు కొట్టి ఢిల్లీకి విజయాన్ని అందించాడు. ఈ సీజన్ లో బెంగళూరుకి ఇది రెండో పరాజయం. అటు ఢిల్లీకి మూడో విజయం. వరుసగా రెండు మ్యాచులు నెగ్గిన బెంగళూరు.. మూడో మ్యాచ్‌లో ఓడిపోయింది. బెంగళూరు జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 171 పరుగులు చేసింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్ చేసిన ఆర్సీబీకి ఓపెనర్లు విరాట్ కోహ్లీ, ఫిల్ సాల్ట్ శుభారంభం అందించినప్పటికీ.. ఢిల్లీ బౌలర్లు నిలవలేకపోయారు. అక్షర్ పటేల్ కీలకమైన సమయంలో టిమ్ డేవిడ్ (26) వికెట్ తీసి ఆర్సీబీని దెబ్బతీశాడు. చివరి 5 ఓవర్లలో ఆర్సీబీ బ్యాటర్లు భారీ స్కోరు సాధిస్తారని అనుకున్నా.. టీ నటరాజన్, లుంగీ ఎంగిడి అద్భుతమైన యార్కర్లతో ఆర్సీబీ బ్యాటర్లను కట్టడి చేశారు. 19వ ఓవర్లో కేవలం 2 పరుగులు మాత్రమే ఇచ్చి ఢిల్లీ పైచేయి సాధించింది. చివరి ఓవర్లో భువనేశ్వర్ కుమార్ క్రీజులోకి వచ్చి ఒకట్రెండు పరుగులు తీయడంతో బెంగళూరు స్కోరు 175కి చేరింది. ఢిల్లీ





బౌలర్లలో కుల్దీప్ యాదవ్ 2 వికెట్లు, అక్షర్ పటేల్ 2 వికెట్లు తీయగా, ఎంగిడి, ముఖేష్ కుమార్ చెరో వికెట్ పడగొట్టారు. ఇక 176 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీ క్యాపిటల్స్.. వరుస విజయాలతో దూసుకుపోతున్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జైత్రయాత్రకి బ్రేక్ వేసింది. చివరి వరకు ఉత్కంఠభరితంగా సాగిన ఈ మ్యాచ్‌లో.. చివరికి ఢిల్లీనే విజయం వరించింది. 176 రన్స్ టార్గెట్‌ను ఢిల్లీ జట్టు 19.5 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేజ్ చేసింది.

మరోవైపు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ) చరిత్ర సృష్టించింది. ఐపీఎల్ చరిత్రలోనే ఒకే వేదికగా 100 మ్యాచ్‌లు ఆడిన తొలి జట్టుగా నిలిచింది. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో శనివారం చిన్నస్వామి స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్‌తో ఈ ఫీట్ సాధించింది. చిన్నస్వామి స్టేడియంలో ఆర్సీబీకి ఇది 100వ మ్యాచ్. 18 ఏళ్ల ఐపీఎల్ చరిత్రలోనే మరే జట్టు కూడా ఈ ఫీట్ సాధించలేదు. కోల్‌కతానైట్‌రైడర్స్, ముంబై ఇండియన్స్ తమ హోమ్ గ్రౌండ్స్ 90 కంటే ఎక్కువ మ్యాచ్‌లు ఆడి తర్వాతి స్థానాల్లో నిలిచాయి. ఐపీఎల్ 2008లో ఇదే రోజు(ఏప్రిల్ 18న) చిన్నస్వామి స్టేడియం వేదికగా ఆర్సీబీ తొలి మ్యాచ్ ఆడింది. సరిగ్గా 18 ఏళ్ల తర్వాత ఇదే రోజు చిన్నస్వామి స్టేడియం వేదికగా 100వ మ్యాచ్‌ను పూర్తి చేసుకుంది. ఈ 100 మ్యాచ్‌ల్లో ఆర్సీబీ 49 గెలిచి 46 మ్యాచ్‌ల్లో ఓడింది. 4 మ్యాచ్‌ల్లో ఫలితాలు తేలలేదు. ఈడెన్ గార్డెన్స్ వేదికగా కేకేఆర్ 98 మ్యాచ్‌లు ఆడి 54 గెలిచింది. 42 మ్యాచ్‌ల్లో ఓడిన కేకేఆర్.. రెండింటిలో ఫలితాలు తేలలేదు. వాంఖడే స్టేడియం వేదికగా ముంబై 95 మ్యాచ్‌లు ఆడి 58 గెలిచింది. మరో 37 మ్యాచ్‌ల్లో ఓడింది. అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా 89 మ్యాచ్‌లు ఆడిన ఢిల్లీ క్యాపిటల్స్ 39 గెలిచి 49 మ్యాచ్‌ల్లో ఓడింది. చెపాక్ స్టేడియంలో చెన్నై సూపర్ కింగ్స్ 80 మ్యాచ్‌లు ఆడి 53 గెలిచింది.

ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 175 పరుగులు చేసింది.

ఫిల్ సాల్ట్(38 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లతో 63) హాఫ్ సెంచరీతో రాణించగా.. టిమ్ డేవిడ్(17 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 26) పర్వాలేదనిపించాడు. ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్లలో లుంగి ఎంగిడి, కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్ రెండేసి వికెట్లు తీయగా.. ముఖేష్ కుమార్ ఒక వికెట్ పడగొట్టాడు. ఈ టోర్నీలో ఆర్సీబీ ఇప్పటి వరకు ఐదు మ్యాచ్‌లు ఆడి 4 విజయాలతో పాయింట్స్ టేబుల్‌లో రెండో స్థానంలో నిలిచింది. సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై శుభారంభం చేసిన ఆర్సీబీ సీఎస్‌కే, లక్నో సూపర్ జెయింట్స్‌లను ఓడించింది. రాజస్థాన్ రాయల్స్ చేతిలో మాత్రం ఓటమిపాలైంది.

మధ్య ఓవర్లలో కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి స్కోర్ వేగాన్ని కట్టడి చేశారు. ఆర్సీబీ ఓపెనర్లు కోహ్లీ (19), సాల్ట్ (63) తొలి ఓవర్ నుంచే ధాటిగా ఆడారు. మొదటి ఓవర్లోనే 13 పరుగులు రాబట్టి ఇన్నింగ్స్ వేగంగా మొదలుపెట్టారు.

అయితే లుంగీ ఎంగిడి వేసిన 6వ ఓవర్లో కోహ్లీ భారీ షాట్‌కు ప్రయత్నించి ఔటయ్యాడు. ఓ వైపు వికెట్లు పడుతున్నా ఫిల్ సాల్ట్ నిలకడగా ఆడుతూ 38 బంతుల్లో 63 పరుగులు (4 ఫోర్లు, 3 సిక్సర్లు) చేశాడు. కుల్దీప్ యాదవ్ బౌలింగ్‌లో సాల్ట్ ఔట్ కావడంతో ఆర్సీబీ ఇన్నింగ్స్ స్లో అయ్యింది. ఇక మధ్య ఓవర్లలో అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్ బెంగళూరు బ్యాటర్లను ముప్పుతిప్పలు పెట్టారు. రజత్ పాటిదార్ (8), దేవదత్ పడిక్కల్ (18) ఎక్కువ సేపు క్రీజులో



## చరిత్ర సృష్టించిన టిమ్ డేవిడ్..

ఢిల్లీ క్యాపిటల్స్‌తో సొంత వేదిక బెంగళూరులో జరుగుతున్న ఐపీఎల్ లీగ్ మ్యాచులో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు బ్యాటర్లు రాణించారు. కఠినమైన పిచ్ కండీషన్‌లో ఆర్సీబీ బ్యాటర్లు 180 పరుగులు చేసి ప్రత్యర్థి జట్టుకు మోస్తరు టార్గెట్ ఇచ్చారు. చిన్నస్వామి స్టేడియంలో బెంగళూరు జట్టు గత 6 మ్యాచ్‌లలో ఒక్కటి కూడా ఓడలేదు. తాజా మ్యాచులో బెంగళూరు ఆటగాళ్ళు ఢిల్లీ క్యాపిటల్స్ బౌలింగ్‌ను సమర్థంగా ఎదుర్కోలేకపోయారు. స్టార్ బ్యాటర్ టిమ్ డేవిడ్ కేవలం 26 పరుగులు చేశాడు. అయితే ఒక చారిత్రాత్మక రికార్డు తన ఖాతాలో వేసుకున్నాడు. మరోవైపు, ఫిల్ సాల్ట్ ఒక బలమైన అర్ధ సెంచరీ సాధించాడు, కానీ రన్ మేషిన్ విరాట్ కోహ్లీ ఫ్లాప్ అయ్యాడు.టిమ్ డేవిడ్ ఈ మ్యాచ్‌లో 17 బంతులు ఆడి 26 పరుగులు మాత్రమే చేశాడు. తన ఐపీఎల్ కెరీర్‌లో 1000 పరుగులు పూర్తి చేసుకున్నాడు. బంతుల పరంగా టిమ్ డేవిడ్ ఐపీఎల్ లో అత్యంత వేగంగా వెయ్యి పరుగులు చేసిన 2వ బ్యాటర్‌గా నిలిచాడు. డేవిడ్ 560 బంతుల్లో 1000 పరుగులు పూర్తి చేశాడు. ఆర్సీబీ బ్యాటర్ కంటే ముందు 545 బంతుల్లో వెయ్యి పరుగులు ఆండ్రీ రస్సెల్ ఉన్నాడు. ట్రావిస్ హెడ్ 575 బంతుల్లోనే వెయ్యి పరుగులు చేయగా.. ఫిల్ సాల్ట్ సైతం 575 బంతుల్లో, హెన్రిచ్ క్లాసెన్ 594 బంతుల్లో 1000 రన్స్ సాధించి టాప్ 5 లో నిలిచారు. ఓపెనర్ ఫిల్ సాల్ట్ విధ్వంసం సృష్టించాడు. 38 బంతుల్లో 63 పరుగులతో అర్ధ సెంచరీ సాధించాడు. విరాట్ కోహ్లీ, దేవదత్ పడిక్కల్ కేవలం 19 పరుగులు, 18 పరుగులు చేసి అవుట్ అయ్యారు.

# బంతితో రాణించడం మినహా మరే సమాధానం లేదు

ఐపీఎల్ 2026 సీజన్‌లో ముంబై ఇండియన్స్ పరాజయాల పరంపర కొనసాగుతోంది. జట్టులో స్టార్ క్రికెటర్లకు కొదవ లేకున్నా విజయాలు మాత్రం దక్కడం లేదు. వరుసగా నాలుగు మ్యాచ్‌ల్లో ముంబై ఓటమిపాలైంది. పంజాబ్ కింగ్స్‌తో ఓటమి అనంతరం ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా తీవ్ర భావోద్వేగానికి గురయ్యాడు. అసలేం మాట్లాడాలో కూడా అర్థం కావడం లేదని, చెప్పడానికి కూడా ఏమి లేదన్నాడు. అలా హార్దిక్ పాండ్యా ఎందుకు అన్నాడో మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ విశ్లేషించాడు. బౌలర్ల పేలవ ప్రదర్శన నేపథ్యంలోనే హార్దిక్ ఈ వ్యాఖ్యలు చేశాడని తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా పేర్కొన్నాడు.'పంజాబ్ కింగ్స్‌తో మ్యాచ్ అనంతరం హార్దిక్ పాండ్యా చెప్పడానికి ఏం లేదన్నాడు. నిజాయితీగా చెప్పాలంటే అతని దగ్గర ఎలాంటి సమాధానాలు లేవు. గత మ్యాచ్‌లో కొన్ని ఓవర్లలో 20 పరుగుల కంటే ఎక్కువ సమర్పించుకున్నామని హార్దిక్ తెలిపాడు. అయితే ప్రస్తుత ఫార్మాట్‌కు ఈ మాటలు ఏ మాత్రమ అమోదయోగ్యం కాదు. ఈ రోజుల్లో 190 పరుగులు చాలా తక్కువ. పంజాబ్‌పై 190ం లక్ష్యం నమోదు చేసిన ముంబై.. 20 పరుగులు తక్కువగా చేసింది. ఇది స్లో పిచ్ అని, 240 పరుగులు చేయడం కష్టమని హెడ్ కోచ్ జయవర్దనే అభిప్రాయపడ్డాడు. అయితే ఈ పిచ్‌పై 240 చేయకున్నా.. 220-230 పరుగులు చేయవచ్చు. అయితే 230 చేసినా ముంబై




గెలిచే స్థాయిలో లేదు. 190ం లక్ష్యం ఉన్నప్పుడే దీపక్ చాహర్ తన తొలి ఓవర్‌లో 21 పరుగులు ఇచ్చుకున్నాడు. జస్‌ప్రీత్ బుమ్రా కూడా అంతే. తర్వాత స్పెల్‌లో బుమ్రా-ఘజన్‌ఫర్ కాస్త కట్టడి చేయగలిగారు. మళ్లీ ఎప్పుడైతే దీపక్ చాహర్ వచ్చాడో.. మ్యాచ్ నుంచి ముంబై దూరమైంది. జస్‌ప్రీత్ బుమ్రా వైఫల్యం కూడా ముంబైపై తీవ్ర ప్రభావం చూపుతోంది. అతను ఒక్క వికెట్ కూడా తీయలేదు. ట్రెంట్ బౌల్ట్ ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. శార్దూల్ ఠాకూర్ వికెట్ తీసినా.. అతను చాలా రిస్క్ బౌలర్. ఘజన్‌ఫర్ ఒక్కడు పర్వాలేదనిపించాడు. మిచెల్ సాంట్నర్ కూడా ఇబ్బంది పడ్డాడు. ముంబై ఈ సమస్యల నుంచి ఎలా బయటపడుతుందో చూడాలి. బౌలింగ్ గురించి ఎన్నో ప్రశ్నలు తలెత్తాయి. బంతితో రాణించడం మినహా మరే సమాధానం లేదు.'అని అశ్విన్ విశ్లేషించాడు.

# తప్పుగా అర్థం చేసుకున్న నెటిజన్లు

## జర్మనీ మోడల్ లిజ్లాజ్ వివరణ

జర్మనీ మోడల్ లిజ్లాజ్ ఒక్క రోజులో సోషల్ మీడియాలో పాపులరైంది. స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ ఇన్‌స్టాగ్రామ్ ఖాతా నుంచి ఆమె పోస్టుకు లైక్ రావడంతో లిజ్లాజ్ పేరు ఒక్కసారిగా వైరల్ అయింది. ఆమె పోస్ట్‌కు లైక్ కొట్టడంతో నెటిజన్లు కోహ్లీని ట్రోల్ చేస్తున్నారు. దీనిపై లిజ్లాజ్ స్పందిస్తూ కోహ్లీపై విమర్శలు రావడం తనకు బాధగా అనిపించిందని తెలిపింది. విరాట్ కోహ్లీ తన పోస్ట్‌ని లైక్ చేసినందుకు చాలా సంతోషపడ్డానని లిజ్లాజ్ తెలిపింది. “విరాట్ కోహ్లీ నా ఫొటోని లైక్ చేసినప్పుడు ముందుగా నేనెంతో సంతోషించాను. ఆ తర్వాత ఆ పోస్ట్‌ని ఆయన అన్‌లైక్ చేశారు. అనుకోకుండా నేను పాపులర్ అయినందుకు ఆనందమే కానీ, తర్వాత బాధగా అనిపించింది. ఈ ఒక్క లైక్ సోషల్ మీడియాలో ఇంత పెద్ద స్టోరీ అవుతుందని అనుకోలేదు. నా ఫోటోని కోహ్లీ లైక్ చేసినందకు ఇంతగా ట్రోల్ చేస్తారనుకోలేదు. ఆ లైక్ వెనక కోహ్లీకి ఏ దురుద్దేశం లేకపోయినా నెటిజన్లు తప్పుగా అర్థం చేసుకున్నారు. ఏదేమైనా నా ఫొటోని స్టార్ క్రికెటర్ లైక్ చేసినందుకు గర్వంగా అనిపించింది” అని లిజ్లాజ్ పేర్కొంది. ఈ జర్మనీ మోడల్ లిజ్లాజ్ ఐపీఎల్ మ్యాచ్‌లను తెగ ఇష్టపడుతుంది. అందులోనూ ఆర్సీబీకి వీరాభిమాని అని గతంలో చెప్పింది. తాజాగా లిజ్లాజ్ ఆర్సీబీ జెర్సీ ధరించి పాటపాడుతున్న ఓ వీడియోని ఇన్‌స్టాలో పోస్టు చేసింది. దీంతో నెటిజన్లు ‘ఆర్సీబీ తదుపరి ఆడనున్న మ్యాచ్‌కి మీరు వస్తున్నారా?’ అంటూ ఆ వీడియోకు నెటిజన్ కామెంట్ పెట్టారు. ‘కచ్చితంగా ఒక రోజ వస్తాను’ అని లిజ్లాజ్ ఆ కామెంట్‌కు రిప్లై ఇచ్చింది. లిజ్లాజ్ జనవరి 30న తన ఇన్‌స్టాగ్రామ్‌లో కొన్ని ఫోటోలను షేర్ చేసింది. గోల్డెన్ అవర్ షాట్స్ అంటూ సూర్యాస్తమయం వేళ దిగిన ఆ ఫొటోలకు విరాట్ కోహ్లీ లైక్ కొట్టినట్లు నెటిజన్లు గుర్తించారు. ఈ వార్త బయటకు రాగానే అసలు ఈ లిజ్లాజ్ ఎవరు? అని గూగుల్ చేయడం మొదలుపెట్టారు. లిజ్లాజ్ జర్మనీకి చెందిన ఒక వ్లాగర్ ,సింగర్ అని తెలుసుకున్నారు. ఈమె ఎంఎస్సీ సైకాలజీ పూర్తి చేసింది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమెకు సుమారు 4.27 లక్షల మంది ఫాలోవర్లు ఉన్నారు. విరాట్ కోహ్లీ లాంటి సెలబ్రిటీలు పొరపాటున స్క్రీన్ స్క్రోల్ చేస్తున్నప్పుడు లైక్ బటన్ ప్రెస్ అయ్యే అవకాశం ఉందని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. మరికొందరు మాత్రం విరాట్ కోహ్లీ అంతర్జాతీయ స్థాయి సెలబ్రిటీ కాబట్టి, ప్రపంచవ్యాప్తంగా ఉన్న వివిధ రంగాల వారిని ఆయన ఫాలో అవుతుంటారని, అందులో భాగంగానే లైక్ కొట్టి ఉండొచ్చని అంటున్నారు. ఏది ఏమైనా, ప్రస్తుతం ఐపీఎల్ సీజన్ నడుస్తున్న వేళ కోహ్లీకి సంబంధించిన ఈ చిన్న విషయం కూడా పెద్ద సెన్సేషన్‌గా మారింది. భారతీయ సంస్కృతీ సంప్రదాయాల్ని ఇష్టపడే విదేశీయులు చాలామందే ఉన్నారు. తానూ ఈ జాబితాలో ఉన్నానంటోంది లిజ్లాజ్. ఆమెకు మన దేశమంటే ఎంతిష్టమంటే ఇప్పటికే ఇక్కడి కట్టూ-బొట్టును నేర్చుకుంది.



సంస్కృతీ సంప్రదాయాల్ని ఒంటబట్టించుకుంది. ఆమె భారత పర్యటనకు వచ్చిన ప్రతిసారీ వారాలు, కొన్నిసార్లు నెలల తరబడి ఇక్కడే ఉండేందుకు ఆసక్తి చూపుతుంది. ఢిల్లీ, ముంబయి, బెంగళూరు, గోవా ఇలా ఇప్పటికే చాలా ప్రదేశాలను చుట్టేసింది. ఇక్కడి దేవాలయాలను దర్శించుకుంటుంది.

సాక్ష్యం
CINEMA
హైదరాబాద్
ఆదివారం 19 ఏప్రిల్ 2026




## ఇంటర్నేషనల్ టెక్నీషియన్స్ తో హ్యూజ్ గ్లోబల్ ప్రాజెక్ట్ గా రాబోతున్న హీరో విజయ్ దేవరకొండ, డైరెక్టర్ శౌర్యువ్, వైరా బ్యానర్ ప్రెస్టీజియస్ మూవీ

### హై ఎక్స్ పెక్టేషన్స్ క్రియేట్ చేస్తున్న ఫస్ట్ లుక్ పోస్టర్

ఇండియన్ సినిమాను గ్లోబల్ స్థాయికి తీసుకెళ్లేందుకు తనదైన ముందడుగు వేశారు హీరో విజయ్ దేవరకొండ. హాయ్ నాన్న ఫేమ్ డైరెక్టర్ శౌర్యువ్ తో విజయ్ దేవరకొండ చేస్తున్న హ్యూజ్ గ్లోబల్ ప్రాజెక్ట్ ఈ రోజు అఫీషియల్ గా అనౌన్స్ చేశారు. ఇంటర్నేషల్ టెక్నీషియన్స్ ఈ మూవీకి వర్క్ చేస్తుండటం విశేషం. వైరా బ్యానర్ నిర్మిస్తున్న ఈ ప్రెస్టీజియస్ మూవీ అనౌన్స్ మెంట్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ పోస్టర్ సినిమా మీద హై ఎక్స్ పెక్టేషన్స్ క్రియేట్ చేస్తోంది. విజయ్ దేవరకొండ, డైరెక్టర్ శౌర్యువ్ సినిమాకు హౌస్ ఆఫ్ ది డ్రాగన్, ఫాల్ ఔట్ వంటి హాలీవుడ్ చిత్రాలకు పనిచేసిన అలెజాండ్రో మార్టినెజ్ డైరెక్టర్ ఆఫ్ ఫొటోగ్రఫీగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గాడ్స్ ఆఫ్ ఈజిప్ట్, బ్యాట్ మ్యాన్ ఫరెవర్, స్నోపియర్సర్ చిత్రాల వీఎఫ్ఎక్స్ సూపర్ వైజర్ ఎరిక్ దస్ట్ ఈ మూవీకి పనిచేస్తున్నారు. యానిమల్, ఓం శాంతి ఓం వంటి చిత్రాలకు పనిచేసిన సురేష్ సెల్వరాజన్ ఈ సినిమా ప్రొడక్షన్ డిజైనర్ గా వ్యవహరిస్తున్నారు. పలు సూపర్ హిట్ చిత్రాల కంపోజర్ హేషమ్ అబ్దుల్ వాహాబ్ మ్యూజిక్ అందిస్తున్నారు. ఇండియన్ సినిమాకు గ్లోబల్ స్థాయి క్రేజ్ తీసుకురావడంలో వారణాసి, రాకా చిత్రాల్లా విజయ్ శౌర్యువ్ మూవీ కూడా ప్రయత్నిస్తోంది. ఈ రోజు రిలీజ్ చేసిన వీడీ శౌర్యువ్ మూవీ పోస్టర్ లో విజయ్ దేవరకొండ చేతిలో నాలుగు పెట్ డాగ్స్ ను తీసుకుని నడుచుకుంటూ వస్తుండటం, వెనక ఏడుగురు వ్యక్తులు వివిధ రకాల ఆయుధాలు చేపట్టి రావడం ఆసక్తి కలిగిస్తోంది. 'ఇప్పుడు కనిపించే కోపమంతా ఒకప్పటి ప్రేమ' అంటూ పోస్టర్ పై రాసిన క్యాప్షన్ క్యూరియాసిటీ క్రియేట్ చేస్తోంది. మైథాలజికల్ యూనివర్స్ బ్యాక్ డ్రాప్ లో రూపొందనున్న ఈ సినిమా ఒక కొత్త ప్రపంచాన్ని ప్రేక్షకులకు చూపించనుంది.



## అక్షరాలకు ఆత్మ నింపిన కళాకారుడు వివ రెడ్డి కి చార్లీ చాప్లిన్ అవార్డు

హైదరాబాద్: సినిమా తెరపై కనిపించే ప్రతి అక్షరానికి ఒక జీవం ఉంటే, ఆ జీవానికి రూపం ఇచ్చే కళాకారుడు వివ రెడ్డి (విష్ణువర్ధన్ రెడ్డి మావూరపు). అక్షరాలను అలంకరించే చేతి గీతల్లో భావాలను పలికించగల అరుదైన సృజనాత్మకతకు ప్రతీకగా నిలిచిన ఆయనకు, ప్రపంచ హాస్య చక్రవర్తి చార్లీ చాప్లిన్ 137వ జయంతి సందర్భంగా ప్రతిష్ఠాత్మక చార్లీ చాప్లిన్ అవార్డు లభించింది. రవీంద్రభారతీ వేదికగా తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో రోజా క్రియేషన్స్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలో, తెలంగాణ శాసనమండలి ఉపాధ్యక్షులు డా. బండ ప్రకాష్, ప్రముఖ మిమిక్రీ కళాకారుడు శివారెడ్డి చేతుల మీదుగా ఈ గౌరవం వివ రెడ్డి కి అందించి సత్కరించారు. ఈ సందర్భంగా ఈ వేడుకలో పాల్గొన్న అతిథులు మాట్లాడుతూ, మూడు దశాబ్దాలకు పైగా సాగుతున్న సృజనాత్మక ప్రయాణంలో అక్షరాలకు అందం, సినిమాకు ఆత్మ, ప్రేక్షకుడికి అనుభూతి ఇచ్చిన కళాకారుడిగా వివ రెడ్డి నిలిచారని కొనియాడారు. ప్రపంచ హాస్య చక్రవర్తి చార్లీ చాప్లిన్ జయంతి సందర్భంగా అందుకున్న ఈ గౌరవం, తెలుగు సినీ అక్షర రూపకల్పన కళకు లభించిన గుర్తింపుగా నిలిచిందని అన్నారు. వివ రెడ్డి కళా కాంతి మరింత విస్తరించి, ఆయన సృజనాత్మక ప్రయాణం కొత్త శిఖరాలను అధిరోహించాలని రోజా క్రియేషన్స్ నిర్వహకులు ఆకాంక్షించారు.

ఆరు వందల చిత్రాలకు అక్షర శిల్పం చిన్ననాటి చిత్రలేఖనపు అమాయక ఆసక్తితో ప్రారంభమైన ప్రయాణం.. కాలక్రమేణా లోగో రూపకల్పనలో నైపుణ్యంగా వికసించి, పబ్లిసిటీ రూపకల్పనలో ప్రత్యేక గుర్తింపును సాధించి, నటనలోనూ తన అభిరుచిని ప్రతిబింబించిన కళాకారుడిగా వివ రెడ్డి ఎదిగారు. "దిల్"తో ప్రారంభమైన ఆయన సినీ ప్రయాణం, "శివమణి", "అర్జున్", "చంద్రముఖి", "సింహ", "ఒక్కమగాడు", "పరమవీరచక్ర", "బొమ్మరిల్లు", "పరుగు", "శంకర్ దాదా జిందాబాద్", "గుడుంబా శంకర్", "దేశముదురు", "పోకిరి", "రక్తచరిత్ర", "సూపర్", "రెడీ", "ప్రస్థానం", "బ్లేడ్ బాబ్జీ", "ఆర్య 2", "ఆపరేషన్ దుర్యోధన" వంటి అనేక విజయవంతమైన చిత్రాల వరకు విస్తరించింది. సుమారు ఆరు వందలకు పైగా చిత్రాలకు ఆయన రూపొందించిన టైటిల్స్ తెరపై పదాలుగా మాత్రమే కాకుండా భావాల ప్రతిరూపాలుగా నిలిచాయి. వివ రెడ్డి చేతుల్లో పుట్టిన ప్రతి అక్షరం ఒక కథ. ప్రతి సినిమా ప్రేక్షకుడి మనసును తాకే తొలి అనుభూతి. పబ్లిసిటీ రూపకర్తగా కూడా వివ రెడ్డి తన ప్రత్యేక శైలిని ప్రతిష్ఠించారు. "బంగారుకొండ", "జై బోలో తెలంగాణ", "లగ్గం", "బాపు", "రుద్రంగి", "సోదర సోదరీమణులారా" వంటి వందకు పైగా చిత్రాలకు ఆయన అందించిన రూపకల్పనలు సినిమాకి ముందే ప్రేక్షకుల హృదయాల్లో ఆసక్తిని రేకెత్తించాయి. నాలుగు రంగాల్లో ప్రతిభా వైవిధ్యం చిత్రలేఖనం, లోగో రూపకల్పన, పబ్లిసిటీ రూపకల్పన, నటన.. ఈ నాలుగు రంగాల్లోనూ ఆయన చూపిన ప్రతిభ కళా వైవిధ్యానికి ప్రతీకగా నిలిచింది. ఫైన్ ఆర్ట్స్ విద్యతో పదును పెట్టుకున్న నైపుణ్యం, కృషి, పట్టుదలతో అవకాశాలను ఆహ్వానించుకుని ఆయన సాగించిన ప్రయాణం నేటి యువతకు మార్గదర్శకంగా నిలుస్తోంది.

## ప్రశాంత్ నీల్ ప్రజెంట్స్- మైత్రీ మూవీ మేకర్స్ , కీర్తన్ నాదగౌడ హర్రర్ మూవీ టైటిల్ 418

ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్, బ్లాక్ బస్టర్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కొలాబరేషన్ లో యంగ్ స్టర్స్ తో కలసి సరికొత్త హర్రర్ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. కీర్తన్ నాదగౌడ దర్శకత్వంలో నవీన్ యెర్నేని, వై రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ప్రశాంత్ నీల్ సమర్పిస్తున్నారు. సూర్య రాజ్ వీరబత్తిని, హను రెడ్డి, ప్రీతి పగడాల ఈ చిత్రంలో ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి టైటిల్ 418 అనే ఇంట్రస్టింగ్ టైటిల్ అనౌన్స్ చేశారు మేకర్స్. టైటిల్ పోస్టర్ సినిమా కథపై క్యూరియాసిటీ పెంచింది. భయంతో కూడిన గ్రామంలోని మెడికల్ కాలేజ్‌లో నేపథ్యంలో ఈ సినిమా ఉండబోతోంది. సైన్స్- మిస్టరీ, సైన్స్, మూఢనమ్మకానికీ అర్ధం కాని ఒక సీక్రెట్ తో ఇప్పటివరకూ చూడని సరికొత్త కథతో ఈ చిత్రం ప్రేక్షకులకు గొప్ప సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ ఇవ్వనుంది. ఈ చిత్రంలో శ్రీ వైష్ణవ, శశాంక్ పాటిల్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి దినేష్ దివాకరన్ డీవోపీ, వెంకీ జి.జి మ్యూజిక్ అందిస్తున్నారు. మోహన్ బి.ఎస్ డైలాగ్స్ రాస్తున్నారు. అనిల్ యెర్నేని ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్.





## మెగాస్టార్ చిరంజీవి లాంచ్ చేసిన "ది బ్రేకింగ్ న్యూస్" ఫస్ట్ లుక్

మీడియా నేపథ్యంతో రూపొందుతున్న థ్రిల్లర్ చిత్రం ★"ది బ్రేకింగ్ న్యూస్"★ తాజాగా ఫస్ట్ లుక్ మరియు టైటిల్ అనౌన్స్‌మెంట్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ప్రముఖ నటులు మురళీ మోహన్, అనన్య నాగళ్ల, వాసుదేవ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి పవన్ కడియాల రచన మరియు దర్శకత్వం వహిస్తున్నారు. ఓపెన్ స్కై క్రియేషన్స్ బ్యానర్‌పై హనుమంత్ రెడ్డి, ఉమ గుటూర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను శుక్రవారం ప్రముఖ నటుడు మెగాస్టార్ చిరంజీవి చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ, "ఈ సినిమాను చూడటానికి ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. మురళీ మోహన్ గారిని ఇంత అగ్రెసివ్‌గా, ఆగ్రహభరితమైన పాత్రలో నేను ఎప్పుడూ చూడలేదు" అని తెలిపారు. అలాగే అనన్య నాగళ్ల నటనను కూడా ప్రశంసించారు. దర్శకుడు పవన్ కడియాల ఈ చిత్రాన్ని ఎంతో ఆసక్తికరంగా, విభిన్నంగా తెరకెక్కించినట్లు ఆయన పేర్కొన్నారు. చిత్ర బృందం తెలిపిన వివరాల ప్రకారం, "ది బ్రేకింగ్ న్యూస్" ఒక మీడియా నేపథ్యంతో కూడిన థ్రిల్లర్‌గా రూపొందుతోంది. ఈ సినిమాను 2026 మే నెలలో థియేటర్లలో విడుదల చేయాలని యోచిస్తున్నారు. చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలోనే ప్రకటించనున్నట్లు మేకర్స్ తెలిపారు.

## వారణాసి కోసం పాట చిత్రీకరణ

కథానాయకుడు మహేశ్‌బాబు.. దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి కలయికలో రూపొందుతున్న బహుభాషా చిత్రం 'వారణాసి'. ఈ సినిమా గత కొన్నిరోజులుగా హైదరాబాద్‌లో చిత్రీకరణ చేసుకుంటున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు ఇక్కడే ప్రత్యేకంగా సిద్ధం చేసిన ఓ భారీ సెట్‌లో పాట చిత్రీకరణ చేస్తున్నట్లు సమాచారం. దీనికి ప్రముఖ కొరియోగ్రాఫర్ బాస్కో మార్టిన్ నృత్యరీతులు అందిస్తున్నట్లు తెలిసింది. ఈ పాట చిత్రీకరణ పూర్తయ్యాక చిత్ర బృందం మే నెలంతా విరామం తీసుకోనుందని.. జూన్‌లో షూట్ తిరిగి ప్రారంభించనున్నారని తెలుస్తోంది. వివిధ యుగాలతో ముడిపడి సాగే ఆసక్తికర కథతో ఈ సినిమా ముస్తాబవుతుండగా.. మహేశ్ దీంట్లో శ్రీరాముడిగా, రుద్రగా రెండు పాత్రల్లో అలరించనున్నారు. ఈ చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. కేఎల్ నారాయణ, ఎస్ఎస్ కార్తికేయ నిర్మిస్తున్నారు. ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాకి సంగీతం: ఎంఎం కీరవాణి, కథ: కె విజయేంద్ర ప్రసాద్, ఎస్ఎస్ కంచి, మాటలు: దేవ కట్టా, ఛాయాగ్రహణం: పీఎస్ వినోద్.




## అన్ని షేడ్స్‌లో నటించాల్సిందే: రాశి

ఒకప్పుడు హీరోయిన్‌గా మెరిసిన రాశి ప్రస్తుతం క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా సందడి చేస్తున్నారు. ఆమె కీలక పాత్ర పోషించిన కొత్త సినిమా 'పాపం ప్రతాప్' మూవీ సక్సెస్ మీట్‌లో అడిగిన ప్రశ్నలకు రాశి సమాధానాలిచ్చారు. 'నిజం సినిమాలో మీరు నెగెటివ్ క్యారెక్టర్‌లో నటించారు. తర్వాత హీరోయిన్‌గా అవకాశాలు రాలేదు' అని ప్రస్తావించగా.. అది నెగెటివ్ అవుతుందని అనుకోలేదన్నారు. 'ఏ సినిమాలో ఎలాంటి పాత్ర కావాలన్నది నేను నిర్ణయించను. 'మిమ్మల్ని అనుకొనే ఈ సినిమాలోని పాత్ర రాశాను' అని పాపం ప్రతాప్ దర్శకుడు చెప్పారు. ఇలా ఎవరు చెప్పినా.. ఆయా పాత్రలు నచ్చితేనే నటిస్తా. అది పాజిటివ్ క్యారెక్టరా? నెగెటివ్ రోలా? అనేది పట్టించుకోను. ఏదైనా ఒకటే. ఓ నటిగా అన్నిరకాల షేడ్స్ ఉన్న రోల్స్ ప్లే చేయాలి. ఆ ఉద్దేశంతోనే 'నిజం'లో నటించా. కానీ, ఆ పాత్ర అంతగా నెగెటివ్ అవుతుందని అనుకోలేదు. ఇకపై ఏ రోల్ అయినా ప్రేక్షకులు అంగీకరించేవిధంగా ఉంటేనే చేస్తాను అని తెలిపారు. మహేశ్‌బాబు హీరోగా దర్శకుడు తేజ తెరకెక్కించిన చిత్రం 'నిజం'. ఇందులో గోపీచంద్ విలన్‌గా నటించారు. రాశి కూడా నెగెటివ్ ఛాయలున్న పాత్రలో కనిపించి, ప్రేక్షకులను ఆశ్చర్యపరిచారు. కథానాయికగా రాణిస్తున్న సమయంలో ఇలాంటి రోల్ చేయడం ఆమె కెరీర్‌పై ప్రభావం చూపింది. 2003లో ఈ మూవీ రిలీజ్ అయింది. 'పాపం ప్రతాప్' విషయానికొస్తే.. తిరువీర్ హీరోగా ఎస్పీ దుర్గా నరేశ్ రూపొందించారు. శుక్రవారం విడుదలైన ఈ సినిమా ప్రేక్షకాదరణ పొందింది.



## సల్మాన్‌లో వంశీ పైడిపల్లి మూవీ

బాలీవుడ్ సూపర్ స్టార్ సల్మాన్ ఖాన్ మరియు టాలీవుడ్ సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ వంశీ పైడిపల్లి కాంబినేషన్‌లో తెరకెక్కనున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ శనివారం పట్టాలెక్కింది. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై అగ్ర నిర్మాత దిల్‌రాజు నిర్మిస్తున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రం రెగ్యులర్ షూటింగ్ నేటి నుంచి ప్రారంభమైనట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. ఈ ప్రాజెక్టులో 'లేడీ సూపర్ స్టార్' నయనతార కథానాయికగా నటిస్తుండటంతో అంచనాలు అప్పుడే ఆకాశాన్ని తాకాయి. బాలీవుడ్ కండల వీరుడు సల్మాన్ ఖాన్, వంశీ పైడిపల్లి డైరెక్షన్‌లో నటించడం ఇదే మొదటిసారి కావడంతో ఈ పాన్-ఇండియా చిత్రంపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. ఈ నెలనుంచే షూటింగ్ మొదలవుతుందని గతంలోనే ప్రకటించిన చిత్ర బృందం, ఈరోజు నుంచి కెమెరా ముందుకు వెళ్తున్నట్లు వెల్లడించింది. యాక్షన్ మరియు ఎమోషన్స్ కలయికగా రానున్న ఈ చిత్రం 2027 ప్రథమార్ధంలో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉంది.

## బాలయ్యతో కొరటాల శివ మూవీ

ప్రస్తుతం కొరటాల శివ ఫోకస్ అంతా 'దేవర' సీక్వెల్ పైనే ఉందని అందరూ అనుకున్నారు. కానీ ఎన్టీఆర్ బిజీగా ఉండడంతో కుదరడం లేదు. ఎన్టీఆర్ ప్రస్తుతం ప్రశాంత్ నీల్ సినిమాతో బిజీగా ఉన్నారు. ఆ ప్రాజెక్ట్ పూర్తయి 'దేవర-2' మొదలవ్వడానికి కనీసం ఏడాది నుంచి ఏడాదిన్నర సమయం పట్టేలా ఉంది. ఈ ఖాళీ సమయాన్ని వృథా చేయకుండా, కొరటాల ఒక పవర్ ఫుల్ స్క్రిప్ట్‌ను సిద్ధం చేశారట. ఇప్పటికే ఈ కథను బాలయ్యకు వినిపించడం, దానికి ఆయన గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం కూడా జరిగిపోయాయని సమాచారం. అయితే నందమూరి అభిమానుల్లో మెదులుతున్న ప్రశ్న ఏంటంటే.. దేవర 2 కంటే ముందే ఈ సినిమా ఉంటుందా అంటే అవుననే అంటున్నాయి టాలీవుడ్ వర్గాలు. ఎన్టీఆర్ డేట్స్ దొరికే వరకు వేచి చూడకుండా, బాలయ్యతో ఒక సెన్సేషనల్ ప్రాజెక్ట్ పూర్తి చేయాలని కొరటాల భావిస్తున్నారు. ఇది టాలీవుడ్ వరకు పరిమితమవుతుందా లేక పాన్ ఇండియా రేంజ్‌లో ఉంటుందా అనే క్లారిటీ రావాల్సి ఉంది. అయితే బాలయ్య క్రేజ్ ఇప్పుడు నేషనల్ లెవల్‌లో ఉంది కాబట్టి, ఇది భారీ లెవల్‌లోనే ఉండే అవకాశం ఉంది.





బాలయ్య లైనప్ చూస్తుంటే ఫ్యాన్స్‌కు పూనకాలు రావడం ఖాయం. ఇప్పటికే గోపీచంద్ మలినేనితో ఒక సినిమా పట్టాలెక్కనుంది. అలాగే వివేక్ ఆత్రేయ, క్రిష్ వంటి దర్శకులతో సినిమాలు చర్చల దశలో ఉన్నాయి. ఈ గ్యాప్‌లో కొరటాల శివ సినిమా ఎప్పుడు సెట్స్ పైకి వెళ్తుంది..? ఒకవేళ ఈ సినిమా గనుక మొదలైతే, కొరటాల శివ దర్శకత్వంలో చేయబోయే దేవర-2 మరింత ఆలస్యం అయ్యే అవకాశం ఉందా అనేది తెలియాల్సి ఉంది. బాలయ్య మార్క్ యాక్షన్.. కొరటాల మార్క్ సోషల్ మెసేజ్ కలిసి బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి సంచలనాలు సృష్టిస్తాయో చూడాలి.

Published ,printed and owend by Sudheer Kumar Katepally printed at Sree sesha Sai enterprises , plot no .98/part 1,co-operative industrial estate phase-II, Gandhi nagar Hyderabad,Medchal Malkajgiri , Telangana-500037. Published at 6-3-553,Flat no .G2, CLassic Court Ane A, opp:NKM Grand hotel, Erramanzil Colony, Somajiguda, Hyderabad, Telangana-500082.Editor : Sudheer kumar katepally ph: 9000657700 PRGI NO: TGTEL/A2380